
గుండ్లకమ్మ గేటు విరిగి వృథాగా పోతున్న నీరు (ఫైల్)

నాడు.. గుండ్లకమ్మ ప్రాజెక్టుపై వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యమే కొనసాగింది. కనీసం గేట్ల నిర్వహణ నిధులు కూడా ఇవ్వక వరుసగా రెండేళ్లు అవి కొట్టుకుపోయి ప్రాజెక్టులో నీరు నిలిపే అవకాశం లేదు. రైతులు నీరు రాక నష్టపోయారు. టీడీపీ ఆందోళన, ఒత్తిడి, చంద్రబాబు ప్రాజెక్టు సందర్శనతో రెండేళ్ల తర్వాత రూ.9కోట్లతో మరమ్మతులు చేపట్టారు. బిల్లులు సకాలంలో ఇవ్వక పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదు.

నేడు.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక గుండ్లకమ్మపై దృష్టి సారించింది. నిధులకు భరోసా ఇచ్చి గేట్ల పనుల వేగవంతానికి అధికారులను ఆదేశించింది. తొలుత రూ.2.60 కోట్లు విడుదల చేసింది. పని పూర్తయిన వాటికి మరో రూ.4 కోట్లు ఇవ్వాల్సి ఉంది. మొత్తం 15 గేట్లలో 10 పూర్తి కాగా మరో రెండు వారాల్లో మిగిలినవి పూర్తవుతాయని సమాచారం. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 3.85 టీఎంసీలు కాగా గేట్ల పనులు పూర్తికాక ప్రస్తుతం 1.10 టీఎంసీలు నిల్వ ఉంచారు. ఇక పంట కాలువల తవ్వకాలు పెండింగ్‌లో ఉన్నాయి.


పూర్తికాని వెలిగొండ రెండో టన్నెల్

జిల్లాలో సాగునీటి రంగం ప్రభుత్వ సాయం కోరుతోంది. గత వైసీపీ పాలనలో జరిగిన నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. వెలిగొండపై మాటలు తప్ప చేతలు లేవు. నిధులు ఇవ్వ లేదు. నిర్వాసితులను తరలించ లేదు. కృష్ణానది నుంచి నీటిని తీసుకునే అవకాశం ఉన్నా పట్టించుకోలేదు. గుండ్లకమ్మ గేట్లకు మరమ్మతులను కూడా గాలికొదిలేసింది. రామతీర్థం ప్రాజెక్టు గేట్ల లీకులు అరికట్టే చర్యలు శూన్యమయ్యాయి. ఇతర వనరులదీ అదే దారి. ఇలాంటి తరుణంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమిపై ఆశతో ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఈనేపథ్యంలోనే ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు మంగళవారం వెలిగొండకు రానున్నారు. ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలతో కలిసి ప్రాజెక్టు పనులను పరిశీలించి మార్కాపురంలో అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. ఆయనవైపు జిల్లావాసులు ఆశగా చూస్తున్నారు.

నిమ్మలపైనే ఆశలు

సాయం కోరుతున్న సాగునీటి రంగం

- వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యం
- వెలిగొండ పనులు పూర్తి చేయకుండానే శిలాఫలకం
- నిర్వాసితులపై దయచూపని గత జగన్ సర్కారు
- గుండ్లకమ్మ గేట్లు కొట్టుకుపోయినా స్పందన కరువు
- రామతీర్థం సామర్థ్యం పెంపు తక్షణం అవసరం
- సాగర్ కాలువలు అధ్వానం
- మీడియం, మైనర్ వనరులదీ అదే దుస్థితి
- అడ్రస్ లేని ఐడీసీ
- నేడు వెలిగొండ ప్రాంతంలో ముగ్గురు మంత్రుల పర్యటన, మార్కాపురంలో సమీక్ష
- రూ.2వేల కోట్ల కేటాయింపుతోపాటు సకాలంలో వ్యయంతోనే ఊరట



ఒంగోలు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అత్యధిక భాగం వర్షాధారం తప్ప అంతగా సాగునీటి వనరులు లేని జిల్లాలో వరుణుడిపై భారం వేసి వ్యవసాయం చేస్తున్న రైతులు అప్పులు మూటగట్టుకొని ఆత్మహత్యల బాట పట్టడం రివాజుగా మారింది. జిల్లాలో పారిశ్రామిక, ఇతరత్రా ఉపాధి మార్గాలు అంతగా లేకపోగా.. వ్యవసాయం, పాడి పరిశ్రమలే ప్రధాన ఉపాధిగా ఉన్నాయి. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంత ప్రజలకు అవే ఆధారం. ఆరెండు రంగాలు బాగుండాలంటే నీటి లభ్యత అవసరం. కానీ జిల్లాలో అవసరమైన మేర కాకపోయినా కనీస స్థాయిలో కూడా సాగు నీటిరంగం అభివృద్ధి చెందలేదు. ఉండటానికి ఉమ్మడి జిల్లాలో దాదాపు 4.42 లక్షల ఎకరాల ఆయకట్టు కలిగిన ఎన్నెస్పీ కాలువలతోపాటు లక్షా 35వేల ఎకరాలు ఉండే చిన్ననీటి వనరులు, 40 వేల ఎకరాలు ఉన్న మీడియం.. అలాగే ఎక్కడా లేని విధంగా దాదాపు లక్షా 40వేల ఎకరాల ఆయకట్టు ఉన్న ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి.

రూ.2వేల కోట్లు కేటాయించాలి

పాతికేళ్లుగా జిల్లా ప్రజలను ఊరిస్తున్న వెలిగొండ, నిర్మాణం పూర్తయిన గుండ్లకమ్మ, రామతీర్థం ప్రాజెక్టులు

మిగతా 6వ పేజీలో

మీడియం ఇరిగేషన్‌కు మరమ్మతులు కరువు

ఉమ్మడి జిల్లాలో మీడియం ఇరిగేషన్ కింద రాళ్లపాడు, మోపాడు రిజర్వాయర్లు, కంభం చెరువు, పీబీ ఆనకట్ట, వీఆర్ ఆనకట్టలు ఉండగా వాటి పరిధిలో 40వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఒక్క రాళ్లపాడు మినహా ఇతర వనరులు లక్ష్యానికి అనుగుణంగా ఉపయోగపడటం లేదు. కనీసం మరమ్మతులు కూడా జరగని పరిస్థితి. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

అధ్వానంగా సాగర్ కాలువలు

ఎన్నెస్పీ కాలువల ఆలనాపాలనా కరువైంది. సాగర్ నీరు వచ్చేది అంతంతమాత్రం కాగా అది దిగువ ప్రాంతానికి సజావుగా రావడం లేదు. చాలాచోట్ల కాలువలు అధ్వానంగా ఉన్నాయి. గతంలో టీడీపీ ప్రభుత్వంలో చేసిన పనులు తప్ప వైసీపీ పాలనలో రూపాయి ఇవ్వలేదు. ఇక పర్యవేక్షణ సిబ్బంది కొరత వేధిస్తోంది. క్షేత్రస్థాయిలో లస్కర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, జేఈలు లేక నియంత్రణ సాధ్యంకాక నీరు అందడం లేదు.


దెబ్బతిన్న ఒంగోలు బ్రాంచి కాలువ లైనింగ్


ఎలాంటి అభివృద్ధికి నోచుకోని గుండంచర్ల పునరావాస కాలనీ

జాతికి అంకితం పేరుతో

జగన్మాయ

- వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించి ఎనిమిది నెలలైనా చుక్కనీరు రాని పరిస్థితి
- పూర్తికాని టన్నెళ్లు, అప్రోచ్, ఫీడర్ కెనాల్, హెడ్ రెగ్యులేటర్ పనులు
- పునరావాసం కోసం నిర్వాసితుల ఎదురుచూపులు

పెద్దారవీడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం పేరుతో మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి రైతులను మోసం చేశారు. ఎన్నికలకు ముందు ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లా ప్రజల ఓట్లు దండుకోవచ్చనే దురాశతో శ్రీపూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కాకుండానే ప్రారంభోత్సవం పేరుతో హంగామా చేశారు. దోర్నాల మండలం కొత్తూరు వద్ద ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం పేరుతో శిలాఫలకాన్ని సైతం ఏర్పాటు చేశారు. ఇది జరిగి ఇప్పటికి ఎనిమిది నెలలు గడిచింది. అయినా, చుక్కనీరు వచ్చిన పాపాన పోలేదు. 2019 ఎన్నికల హామీగా వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన ఏడాదికి వెలిగొండ ప్రాజెక్ట్‌కు నీళ్లిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా 4 సార్లు 'అప్పుడిస్తాం, ఇప్పుడిస్తాం'


మిగతా 6వ పేజీలో

మునిసిపల్ టీచర్లకు

శుభవార్త

ఉద్యోగోన్నతుల షెడ్యూల్ విడుదల

ఒంగోలు విద్య, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ యాజమాన్యంలోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారికి ప్రమోషన్ల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఇటీవల జరిగిన చర్చల్లో వెంటనే ఉద్యోగోన్నతులు ఇస్తామని యూనియన్ నేతలకు పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు



హామీ ఇచ్చారు. ఆమేరకు షెడ్యూల్ విడుదల చేయడం పట్ల యూటీఎఫ్ నాయకులు, టీచర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మునిసిపల్ ఉపాధ్యాయుల నియామకాలు, ఉద్యోగోన్నతులు అన్నీ గతంలో మునిసిపల్ అధికారులే నిర్వహించేవారు. అయితే గత ప్రభుత్వం వారి సర్వీసులను పాఠశాల విద్య పరిధిలోకి తెచ్చింది. ప్రభుత్వ, పంచాయతీరాజ్ టీచర్ల తరహాలో మునిసిపల్ టీచర్లకు కూడా 010 పద్దు కింద జీతాలు చెల్లిస్తోంది. ప్రభుత్వ, జడ్పీ యాజమాన్య టీచర్లతో సమానంగా ప్రస్తుతం మునిసిపల్ పాఠశాలల్లోని స్కూలు అసిస్టెంట్లకు హెచ్‌ఎంలుగా, ఎస్జీటీలకు స్కూలు అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తున్నారు. హెచ్‌ఎంల ఉద్యోగోన్నతులను పాఠశాల విద్య ఆర్జేడీలు, స్కూలు అసిస్టెంట్ ఉద్యోగోన్నతులను డీఈవోలు నిర్వహిస్తున్నారు.

షెడ్యూల్ ఇదీ..

- ఈనెల 28 నుంచి స్కూలు అసిస్టెంట్ నుంచి హెచ్‌ఎంలు, ఎస్జీటీల నుంచి స్కూలు అసిస్టెంట్ల ప్రాథమిక సీనియారిటీ జాబితాలను విడుదల చేస్తారు.
- ఈనెల 28 నుంచి 1 వరకు ప్రాథమిక సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాలను స్వీకరిస్తారు
- నవంబరు 4న హెచ్‌ఎంలు, స్కూలు అసిస్టెంట్ల ప్రమోషన్లకు తుది సీనియారిటీ జాబితా ప్రకటిస్తారు.
- వచ్చేనెల 6న ప్రధానోపాధ్యాయుల ఉద్యోగోన్నతులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు
- వచ్చేనెల 8న స్కూలు అసిస్టెంట్ల ప్రమోషన్ కౌన్సెలింగ్ డీఈవో నిర్వహిస్తారు. అందుకు సంబంధించిన మార్గదర్శకాలను కూడా కమిషనర్ జారీ చేశారు.


ప్రదర్శనలను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

విద్యార్థులు పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలి

- విభిన్న అంశాల్లో ప్రతిభ కనబర్చాలి
- కలెక్టర్ తమీమ్ అన్సారియా
- కొండపిలో జోన్-3 గురుకులాల సైన్స్ ఫెయిర్ ప్రారంభం
- ఆకట్టుకున్న ప్రదర్శనలు
- నేడూ కొనసాగింపు

6

డీఆర్వోగా ఓబులేషు బాధ్యతల స్వీకరణ


కలెక్టర్‌కు బొకేను ఇస్తున్న డీఆర్వో ఓబులేషు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో)గా బి.చిన్నఓబులేషు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా కలెక్టర్ తమీమ్ అన్సారియాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కొద్దిసేపు భేటీ అయ్యారు. ఓబులేషును కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు, రెవెన్యూ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన గ్రీవెన్స్ సెల్‌లో ఆయన పాల్గొన్నారు.

హైకోర్టులో బాలినేని పిల్ కొట్టివేత

- పోలింగ్‌లో అక్రమాలంటూ ఆరోపణ
- వీవీప్యాట్‌లను లెక్కించాలని వ్యాజ్యం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయని మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వేసిన పిల్‌ను హైకోర్టు కొట్టివేసింది. నగరంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలకు వీవీప్యాట్ స్లిప్‌లకు తేడా ఉందని, అందువల్ల రీకౌంటింగ్ నిర్వహించాలని బాలినేని ఆగస్టు 13న హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న అనంతరం తీర్పును వాయిదా వేసింది. బాలినేని వేసిన పిల్‌ను కోర్టు సోమవారం డిస్మిస్ చేసింది. గతంలో ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన బాలినేని ఈసారి జరిగిన ఎన్నికల్లో ఘోర ఓటమి చెందడంతో హైకోర్టును ఆశ్రయించారు.


గోవాలో వైసీపీ జడ్పీటీసీ సభ్యులతో చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ.. ఆమె కుమారుడు, దర్శి ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి

క్యాంపు రాజకీయాలకు

వైసీపీ శ్రీకారం

- జడ్పీని కాపాడుకునేందుకు గోవా టూర్
- ఎనిమిది నెలలు దాటితే అవిశ్వాసానికి అవకాశం
- ఈలోపే కొత్తచట్టం తెచ్చే యోచనలో కూటమి ప్రభుత్వం
- తెలుగుదేశం పార్టీకి టచ్‌లో పదిహేను మంది
- క్యాంపునకు వెళ్లింది 30మందే
- మాట మేరకే విహారయాత్ర.. క్యాంపు రాజకీయం కాదు : బూచేపల్లి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)
ఉమ్మడి జిల్లాలో కీలకమైన జిల్లా పరిషత్ చేజారకుండా చూసుకునేందుకు వైసీపీ క్యాంపు రాజకీయానికి శ్రీకారం చుట్టింది. అమల్లో ఉన్న నిబంధనల మేరకు మరో ఎనిమిది నెలలు దాటితే ప్రస్తుత జడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు అవకాశం ఉంది. ఈలోపు కూటమి ప్రభుత్వం నిబంధనలను సడలిస్తే ఎప్పుడైనా

మిగతా 6వ పేజీలో


బాణసంచా వ్యాపారుల

ఘరానా మోసం

- జీఎస్టీ చెల్లించకుండా ప్రభుత్వానికి టోకరా
- తాజాగా దరఖాస్తు చేయడంతో వెలుగులోకి..
- ఆగ్రహించిన దర్శి తహసీల్దార్

దర్శి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : మండలంలో దీపావళి బాణసంచా విక్రయించే వ్యాపారులు ఘరానా మోసం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో బిల్లులు లేకుండా కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అధికారులకు కొద్దిపాటి బిల్లులు చూపించి సరిపెడుతున్నారు. నిబంధనల ప్రకారం వాణిజ్య పన్నుల శాఖకు కట్టాల్సిన జీఎస్టీ చెల్లించకుండా ఎగనామం పెట్టిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకెళ్తే... మండలంలో గత ఏడాది మొత్తం 23 మంది వ్యాపారులు దీపావళి మందులు విక్రయించారు. లక్షలాది రూపాయల వ్యాపారం చేసుకున్నా ఇప్పటి వరకు క్రయవిక్రయాల లెక్కలు చెప్పలేదు. వాణిజ్య పన్నుల శాఖకు నిబంధనల ప్రకారం వారు అమ్మిన మొత్తంలో 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంది. ఏడాది గడిచినప్పటికీ ఆ పన్ను చెల్లించలేదు. ప్రస్తుతం ఈ ఏడాది దీపావళికి బాణసంచా విక్రయించుకునేందుకు అనుమతులు కోసం మళ్లీ దరఖాస్తు చేశారు. స్థానిక అధికారులు సిఫార్సు చేసి ఆర్డీవో, వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయాలకు పంపారు. ఈ క్రమంలో వాణిజ్య పన్నుల శాఖాధికారులు వాటిని పరిశీలించగా గతేడాది పన్నులు చెల్లించలేదని గుర్తించారు. 'గతేడాది దీపావళి మందులు విక్రయించిన వ్యాపారులు ఇప్పటి వరకు జీఎస్టీ చెల్లించలేదని, ఆ మొత్తం కట్టే వరకు వారికి అనుమతులు ఇవ్వవద్దని' రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. జిల్లా అధికారుల నుంచి సమాచారం అందటంతో దర్శి తహసీల్దార్ వెంటనే వ్యాపారులను పిలిపించి మాట్లాడారు. గత ఏడాది దీపావళి మందుల విక్రయాలకు సంబంధించిన జీఎస్టీ చెల్లించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పన్నులు వెంటనే కట్టి రసీదులు ఇస్తేనే ఈ ఏడాది దీపావళి మందుల విక్రయాలకు అనుమతులు ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. దీంతో వ్యాపారులు హడావుడిగా జీఎస్టీ చెల్లించే ఏర్పాట్లు చేసుకుంటున్నారు.






ఆరోగ్యానికి ఆటుపోట్లు

- ఇటీవల పెరుగుతున్న బ్రెయిన్, హార్ట్ స్ట్రోక్స్
- బాధితుల్లో యువకులే ఎక్కువ
- నిరంతర వ్యాయామంతో ముప్పు తప్పే అవకాశం

6

యాంత్రిక యుగం.. ఉరుకుల పరుగుల జీవితం.. అనుక్షణం టెన్షన్.. టెన్షన్..! దీంతో ఆరోగ్యపరంగా అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. వీటికితోడు దురలవాట్లు కూడా అనారోగ్యానికి కారణమవుతున్నాయి. ముఖ్యంగా హార్ట్, బ్రెయిన్ స్ట్రోక్స్ ఇటీవల అధికమయ్యాయి. యువత సైతం అర్ధంతరంగా తనువు చాలిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. మంగళవారం ప్రపంచ స్ట్రోక్స్ డే సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..



- ఇటీవల పెరుగుతున్న బ్రెయిన్, హార్ట్ స్ట్రోక్స్
- బాధితుల్లో యువకులెక్కువ
- నిరంతర వ్యాయామంతో ముప్పు తప్పే అవకాశం

నేడు వరల్డ్ స్ట్రోక్ డే

ఆరోగ్యానికి ఆటుపోట్లు

ఒంగోలులోని మామిడిపాలేనికి చెందిన ఓ యువకుడు వృత్తి రీత్యా ప్రైవేటు వైద్యశాలలో ఉద్యోగం చేస్తున్నాడు. నిండా 30 సంవత్సరాల వయస్సు కూడా లేదు. అలా అని ఎలాంటి చెడు అలవాట్లు లేవు.. క్రికెట్ అంటే అలివిమాలిన పిచ్చి. అంతకు మించి ఏ వ్యసనాలూ లేవు. అయితే ఆరు నెలల క్రితం హఠాత్తుగా గుండెపోటుతో మరణించాడు.

నగరంలోని సంజయ్ గాంధీ కాలనీకి చెందిన ఓ వ్యక్తి వయస్సు 35 సంవత్సరాలు. ఆయన ఓ ఇంజనీరింగ్ కాలేజీలో అధ్యాపకుడు. కాలేజీ, ఇల్లు, కుటుంబం ఇదే అతని దినచర్య. రోజువారీ మాదిరిగా కాలేజీ నుంచి వచ్చి రాత్రి భోజనం చేసిన తర్వాత ఇంటిముందు వాకింగ్ చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అత్యవసరంగా వైద్యం కోసం ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

గిద్దలూరుకు చెందిన పెద్దకూరగాయల మార్కెట్ అధ్యక్షుడు షేక్ ఖాజావలి (52)కి సోమవారం తెల్లవారుజామున గుండెపోటు వచ్చింది. సమీపంలోని ఆసుపత్రికి తరలించేలోపే ఆయన కన్నుమూశారు.

ఒంగోలు, కార్పొరేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : జీవన విధానంలో మార్పులు అంతుపట్టని అనారోగ్య సమస్యలకు దారితీస్తున్నాయి. శారీరక, మానసిక సమస్యలకు కారణమవుతున్నాయి. 'ఆరోగ్యమే మహాభాగ్యం' అనే నానుడిని 'ఆదాయమే ఆరోగ్యం' అన్నట్టుగా మార్చేసి సంపాదనే ధ్యేయంగా కొందరు, దురలవాట్లకు బానిసలై మరికొందరు చక్కటి జీవన విధానాన్ని కోల్పోతున్నారు. చివరికి అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. వీటి ఫలితంగా... ఒకప్పుడు వృద్ధులకు వచ్చే బ్రెయిన్, హార్ట్ స్ట్రోక్‌లు ఇప్పుడు యువకులకు వస్తున్నాయి. క్షణాల్లోనే కొందరి ప్రాణాలను కూడా హరిస్తున్నాయి. ఈ క్రమంలో ప్రపంచ స్ట్రోక్‌డే సందర్భంగా ప్రత్యేక కథనం...

స్ట్రోక్ అంటే ఏమిటి?

ఒక స్ట్రోక్‌ను కొన్నిసార్లు బ్రెయిన్ స్ట్రోక్, హార్ట్ స్ట్రోక్ అని కూడా పిలుస్తారు. మెదడులోని ఒక ప్రాంతానికి రక్త ప్రవాహం ఆగిపోయినపుడు ఇది సంభవిస్తుంది. మెదడు మనుగడకు అవసరమైన ఆక్సిజన్, గ్లూకోజ్ లేని కారణంగా మెదడు కణాలు చనిపోతాయి. పని ఒత్తిడి కారణంగా మెదడుపై పడే భారం గుండెమీద కూడా పడటంతో, రక్త ప్రసరణ వేగమై, లేదా గుండెకు రక్త సరఫరాలో లోపం ఉన్నపుడు స్ట్రోక్ వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయి.

స్ట్రోక్‌కు కారణమేంటి?

కరోనాకు ముందు పరిస్థితులకూ, కరోనా తరువాత పరిస్థితులకూ ఆరోగ్యంలో చాలా మార్పు వచ్చింది. కారణాలేంటో స్పష్టమైన నిర్ధారణలు లేవుగానీ 16 ఏళ్ల యువకులు సైతం హార్ట్ స్ట్రోక్, బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి చనిపోతున్నారు. కరోనా వ్యాక్సిన్‌ల కారణంగా స్ట్రోక్‌లు వస్తున్నాయని కొందరు, కరోనా వచ్చిన వారికే వస్తున్నాయని మరి కొందరు చెబుతున్నారు. లైఫ్‌స్టైల్ మారడం, షుగర్, బీపీతోపాటు దుర అలవాట్లు కారణమని మరికొందరు అంటున్నారు.

నివారణ మార్గాలు

రక్తపోటు (బీపీ), షుగర్ (మధుమేహం), బరువును అదుపులో ఉంచుకోవాలి. ప్రతిరోజూ శారీరక శ్రమ చేయాలని వైద్యులు సూచిస్తున్నారు. ధూమపానం, మద్యపానంకు దూరంగా ఉండటంతోపాటు క్రమం తప్పకుండా ప్రతిరోజూ 40 నిమిషాలు వాకింగ్, వ్యాయామం వంటి శారీరక శ్రమతో స్ట్రోక్ ముప్పు తప్పుతుందని వైద్యులు వెల్లడిస్తున్నారు.

క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి



ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. ఒత్తిడికి గురికాకుండా మనసు ప్రశాంతంగా ఉంచుకోవడం అలవాటు చేసుకోవాలి. డయాబెటీస్, హైపర్ టెన్షన్, కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుకోవాలి. స్ట్రోక్ వచ్చినపుడు (ఫేషియల్ వీక్‌నెస్), మూతి వంకర పడటం, చేయి, కాలు సడన్‌గా సచ్చుపడటం, మాట తడబడటం, కళ్లు తిరగడం... వీటిలో ఏవైనా లక్షణాలు ఉంటే నాలుగు గంటల లోపుల వైద్యుని సంప్రదించాలి. ట్రాంబోలైసెస్ చికిత్స ద్వారా రక్తాన్ని కరిగిస్తారు.

- డాక్టర్ పోకూరి శ్రీనివాసరావు, ఎండీడీఎం, న్యూరాలజిస్ట్, ఉపాస్ హాస్పిటల్, ఒంగోలు

ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందించాలి

ఆపరేషన్ గదులు, అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే

కనిగిరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాసుపత్రిలో ప్రైవేటు హాస్పిటల్స్ కంటే మెరుగైన వైద్య సేవలు అందించాలన్నదే తన సంకల్పమని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో నూతనంగా హంగులతో మార్చిన ప్రత్యేక ఆపరేషన్ థియేటర్‌ను ఎమ్మెల్యే సోమవారం సందర్శించారు. ఆతర్వాత తీగలగొందిలోని అన్న క్యాంటిన్‌లో భోజనాలను పరిశీలించి రుచి చూశారు. అక్కడ ప్రజలతో మాట్లాడారు. ఆ తర్వాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న సచివాలయంతోపాటు పరిసరాలను, పాత స్కూలు భవనాలను పరిశీలించారు. కమిషనర్ దానియేలును పిలిపించి ప్రాంగణాన్ని శుభ్రం చేయించాలని, అదేవిధంగా ఈ ప్రాంగణాన్ని పార్కుగా తీర్చిదిద్దే ఆలోచనపై సూచనలు చేశారు. సీఐ ఖాజావలి, నాయకులు శ్యామల కాశిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఫిరోజ్, జంషీర్, షరీఫ్, బడే బాయి, విజయభాస్కర్‌రెడ్డి, ఫిరోజ్ పాల్గొన్నారు.



షాదీఖానా వద్ద ఉన్న పాత స్కూలు ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

విద్యార్థులు పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలి

- విభిన్న అంశాల్లో ప్రతిభకనబర్చాలి
- కలెక్టర్ తమీమ్ అన్సారియా
- కొండపిలో జోన్-3 గురుకులాల సైన్స్ ఫెయిర్ ప్రారంభం
- ఆకట్టుకున్న ప్రదర్శనలు

కొండపి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. ఒక లక్ష్యాన్ని ఎంచుకొని అందుకోసం కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. 'ఫ్యూచరాన్' పేరుతో రెండు రోజులపాటు ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, పాక్షిక నెల్లూరు జిల్లాల (జోన్-3) స్థాయి గురుకులాల సైన్స్ ఫెయిర్‌ను సోమవారం ఆమె స్థానిక బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాలలో ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా విభిన్న అంశాల్లో ప్రతిభ కనబరచాలన్నారు. జిల్లాలో బాల్య వివాహాలు ఎక్కువగా ఉంటున్నాయని, వాటిని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. నిర్ణీత వయస్సు వచ్చే వరకు బాలికలు పెళ్లి చేసుకోవద్దని సూచించారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను ఆమె పరిశీలించారు. వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ డి.జయ, నెల్లూరు జిల్లా కోఆర్డినేటర్ కె.జయలక్ష్మి, గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ పద్మజ, కొండపి గురుకులం ప్రిన్సిపాల్ అరుణ, తహసీల్దార్ పి.మురళి, ఎంపీడీవో రామాంజనేయులు, ఎంఈవో-2 పి.రామారావు పాల్గొన్నారు. ఈసందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

గురుకులం అభివృద్ధికి చేయూత

- దామచర్ల సత్య

కొండపిలోని గురుకుల బాలికల కళాశాల అభివృద్ధికి తమ కుటుంబం సొంత నిధులు వెచ్చించేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉందని ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య అన్నారు. సైన్స్‌ఫెయిర్‌ను ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన తాత దివంగత ఆంజనేయులు కొండపికి గురుకుల బాలికల పాఠశాల మంజూరు చేయించారన్నారు. సొంతంగా పది ఎకరాల స్థలం కొనుగోలు చేసి ఇవ్వడంతోపాటు, పక్కా ప్రభుత్వ భవనాల నిర్మాణానికి కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, టీడీపీ నాయకులు బత్తుల నారాయణస్వామి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, చాగంరెడ్డి నరసారెడ్డి, కొర్రపాటి వసంతరాయుడు, సీఐ సోమశేఖర్, ఎస్సై ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆకర్షణీయంగా ప్రముఖుల చిత్రాలు

సైన్స్‌ఫెయిర్‌లో ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మొత్తం ఐదు అంశాలకు సంబంధించిన 160 ప్రాజెక్టులను ఎంపిక చేయగా, తొలిరోజు ప్రారంభకార్యక్రమం కావడంతో కొన్నింటిని మాత్రమే ప్రదర్శించారు. కురిచేడు సాంఘిక సంక్షేమ గురుకులం ఆర్ట్ టీచర్ ప్రసాద్, ఆ స్కూల్‌లోని పదో తరగతి విద్యార్థి ఆదిత్య వాటర్ పెయింటింగ్‌తో వేసిన చిత్రాలు ఆకర్షణీయంగా నిలిచాయి. ఆదిత్య స్వర్ణాంధ్ర విజనరీ లీడర్ అంటూ చంద్రబాబు తన ఆలోచనలను పెయింటింగ్ రూపంలో వేస్తున్న చిత్రం ఆకర్షణీయంగా ఉంది. దీంతోపాటు దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఆలోచనతో మొదలైన గురుకులం అనే చెట్టు అనేక మందిని డాక్టర్లు, ఇంజనీర్లు, ఉపాధ్యాయులు, అధికారులను తయారు చేసిందని తెలియజేస్తూ గీచిన చిత్రం ఆకట్టుకుంది. ఆర్ట్ టీచర్ వేసిన దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్, బుద్ధుడు, ప్రస్తుత సీఎం చంద్రబాబు నాయుడు, రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా చిత్రాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. రెండోరోజైన మంగళవారం పూర్తిస్థాయిలో ప్రాజెక్టులను ప్రదర్శనకు ఉంచనున్నారు.

అవినీతికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా అవినీతికి వ్యతిరేకంగా, బాధ్యత గల పౌరునిగా ప్రవర్తిస్తామంటూ కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రతిజ్ఞ చేయించారు. కలెక్టరేట్‌లోని మీకోసం కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో సోమవారం ఈ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జేసీ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్వో ఓబులేసు, ఎస్‌డీసీలు వరకుమార్, లోకేశ్వరరావు పాల్గొన్నారు.

క్యాంపు రాజకీయాలకు వైసీపీ శ్రీకారం

(5వ పేజీ తరువాయి)

ప్రవేశపెట్టవచ్చు. దీనికితోడు ఇప్పటికే టీడీపీలో చేరిన వారికి తోడు మరికొందరు జడ్పీటీసీ సభ్యులు టీడీపీ నేతలకు చేరువవుతున్నారు. ఇటీవల జనసేనలో చేరిన మాజీమంత్రి బాలినేనికి మరికొందరు టచ్‌లో ఉన్నారు. ఈ నేపథ్యంలో అప్పుడెప్పుడో ఇచ్చిన హామీ అంటూ జడ్పీటీసీ సభ్యులను భారీ విహారయాత్రకు తీసుకెళ్లటం విశేషం.

వరుసగా చేజారుతుండటంతో..

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం దిగిపోయి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత స్థానిక సంస్థలు వైసీపీ చేజారిపోవటం ప్రారంభమైంది. ఒంగోలు కార్పొరేషన్, గిద్దలూరు నగర పంచాయితీలు పూర్తిగా టీడీపీ వశం కాగా మండల పరిషత్తుల్లో అత్యధిక భాగం వైసీపీ ప్రతినిధులు టీడీపీ ఎమ్మెల్యేలతో చేతులు కలిపేశారు. సర్పంచ్‌లు అయితే బహిరంగంగానే టీడీపీ ఎమ్మెల్యేలు, నేతలతో చెట్టాపట్టాలేసుకొని తిరుగుతున్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల భర్తీకి సిద్ధమైంది. ఈ నేపథ్యంలో కీలకమైన జడ్పీ చైర్‌పర్సన్ వ్యవహారం కూడా చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఉమ్మడి జిల్లాలోని టీడీపీ ప్రజాప్రతినిధులు సమావేశమై నామినేటెడ్ పదవులపై, కీలక అంశాలపై చర్చించుకొని ఐక్యంగా ముందుకు పోయేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. దీంతో జడ్పీ వ్యవహారం కూటమి పార్టీలోనే కాక మొత్తం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

మారుతున్న బలబలాలు

జిల్లా పరిషత్ చైర్మన్‌ను జడ్పీటీసీ సభ్యులు ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో పొదిలికి ఎన్నికలు జరపకపోగా మిగిలిన స్థానాల్లో అప్పుడు వైసీపీనే గెలుచుకుంది. అందులో ముగ్గురు సభ్యులు ఇటీవల కాలంలో మృతిచెందారు. పోతే మిగిలిన సభ్యుల్లో ఎన్నికలకు ముందే గిద్దలూరు నియోజకవర్గంలో ఇద్దరు, దర్శి, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో ఒకొక్క జడ్పీటీసీ బహిరంగంగానే టీడీపీలో చేరిపోయారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత మరికొందరు టీడీపీ ఎమ్మెల్యేలకు దగ్గరయ్యారు. అలాంటి వారు ఎనిమిది నుంచి పది మంది కనిపిస్తున్నారు. వివిధ కారణాలతో వైసీపీకి దూరంగా ఉంటున్న వారు ఉన్నారు. ఇదేసమయంలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి జనసేనలో చేరటంతో ఆయనతో కొందరు టచ్‌లో ఉన్నారు. కాగా బాలినేనికి దర్శి ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డిలకు మధ్య కొంతకాలంగా దూరం పెరిగింది. కారణం ఏమైనా బాలినేని కూడా వైసీపీలోని ఎంపీపీలు, జడ్పీటీసీలను జనసేనలోకి తీసుకెళ్లే ప్రయత్నంలో ఉన్నారు. ఒంగోలు నియోజకవర్గంలో వైసీపీకి చెందిన ఒక జడ్పీటీసీ ఎమ్మెల్యే జనార్దన్‌కు టచ్‌లో ఉండగా మరో జడ్పీటీసీ భర్త వైసీపీలో ఉన్నప్పటికీ ఇటు బాలినేనితోను అటు ఎమ్మెల్యే జనార్దన్‌తో టచ్‌లో ఉండటం విశేషం. కాగా ఎస్ఎన్‌పాడు, పర్చూరు, దర్శి, మార్కాపురం, గిద్దలూరు, కొండపి, వైపాలెం నియోజకవర్గాల్లోని కొందరు జడ్పీటీసీ సభ్యులు బాలినేనికి టచ్‌లో ఉన్నారు. అలాంటి వారి సంఖ్య ఇప్పటికీ పదిమంది వరకు ఉందని సమాచారం. ఇక వైసీపీలో ఉన్నప్పటికీ అద్దంకి నియోజకవర్గంలో మారిన రాజకీయ పరిణామాల్లో అవసరమైతే బాచిన చైతన్యకు అనుగుణంగా మరో ముగ్గురు జడ్పీటీసీలు టీడీపీకి జైకొట్టే ఉద్దేశంతో ఉన్నారు. చీరాలలో ఉన్న ఇద్దరు జడ్పీటీసీలు మాజీ ఎమ్మెల్యే ఆమంచికి టచ్‌లో ఉండటం విశేషం. కందుకూరు నియోజకవర్గంలో ఒక జడ్పీటీసీ చనిపోగా మిగిలిన వారిలో కొందరు ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డితో ఉండగా అక్కడ పార్టీ బాధ్యతలు బుర్రా మధుసూదన్ చూస్తున్నారు. ఇలా లోతుగా అన్నీ విషయాలను పరిగణనలోకి తీసుకొని పరిశీలిస్తే కూటమి పార్టీలకు జడ్పీటీసీల మద్దతు పెరిగిపోతుండటంతో వైసీపీ నాయకులు కలవరపడుతున్నారు.

అవిశ్వాస తీర్మానంపై చర్చ

కాగా ప్రస్తుత నిబంధనల మేరకు చైర్‌పర్సన్ స్థానంలో ఉన్న వారి పదవీకాలం నాలుగేళ్లు పూర్తయ్యే వరకు వారిపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు అవకాశం లేదు. ప్రస్తుత చైర్‌పర్సన్ వెంకాయమ్మ బాధ్యతలు చేపట్టి మూడేళ్ల మూడు నెలలు దాటింది. దీంతో మరో ఆరేడు నెలల తర్వాత కూటమి పార్టీలు రంగంలో దిగి అవిశ్వాస తీర్మానం పెడితే పరిస్థితి ఏమిటి? అదేవిధంగా సమయాన్ని తగ్గిస్తూ కూటమి ప్రభుత్వం సవరణ నిబంధన తెచ్చేందుకు అవకాశం లేకపోలేదు. ఆ వైపు అడుగులు వేయబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో చైర్మన్ వెంకాయమ్మతోపాటు ఆమె కుమారుడు దర్శి ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి జడ్పీటీసీ సభ్యులను విహారయాత్రకు తీసుకెళ్లేందుకు భారీ ఏర్పాట్లతో కుటుంబ సభ్యులతో సహా రావాలని ఆయన ఆహ్వానించి అక్కడ ఏర్పాట్లు చేశారు. మొత్తంపై 70మందికి పైగా వెళ్లినప్పటికీ అందులో జడ్పీటీసీలు 30 లేక 32 మంది అని అంటున్నారు. టీడీపీలో చేరిన వారు కాక వైసీపీలో ఉండి కూడా వెళ్లని జడ్పీటీసీల సంఖ్య పదికిపైగా కనిపిస్తోంది. గోవా వెళ్లిన వారిలో కొందరు స్థానిక టీడీపీ నాయకులతో టచ్‌లో ఉండటం విశేషం. మున్ముందు జడ్పీ పరిణామాలు ఎలా మారుతాయో కానీ ప్రస్తుతానికి వైసీపీ రాజకీయ క్యాంపు వ్యవహారంతో వాతావరణం వేడెక్కింది. కాగా తాము చైర్మన్‌గా తన తల్లి బాధ్యతలు తీసుకున్న సమయంలోనే జడ్పీటీసీలను గోవా విహారయాత్ర తీసుకెళ్తానని హామీ ఇచ్చానని ఆ మేరకు తీసుకెళ్లామని శివప్రసాద్‌రెడ్డి చెప్పటం విశేషం.

నిమ్మలపైనే ఆశ

(5వ పేజీ తరువాయి)

జిల్లాలో ఉన్నాయి. వెలిగొండ పూర్తి చేస్తే పశ్చిమప్రాంతం సస్యశ్యామలం అవుతుంది. సాగు, తాగునీటి ఇక్కట్లు పడుతున్న పశ్చిమప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. ఇక లక్ష్యానికి అనుగుణంగా గుండ్లకమ్మ, రామతీర్థం ప్రాజెక్టులు వినియోగంలోకి తీసుకురావచ్చు, సాగర్, ఇతర వనరుల ద్వారా ఆయకట్టుకు నీరిచ్చే చర్యలు చేపడితే జిల్లాలో వ్యవసాయం, పాడి పరిశ్రమ రెండూ ప్రజలకు ఉపకరిస్తాయి. అయితే వెలిగొండపై మాటలు తప్ప చేతలు లేని వైసీపీ పాలనలో రూ.4వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించి రూ.900 కోట్లకు మించి ఖర్చుచేయక, నిర్వాసితులను తరలించక కృష్ణానది నుంచి నీటిని తీసుకునే అవకాశం ఉన్నా తీసుకోలేకపోయారు. గుండ్లకమ్మ ఇతర నీటి వనరుల పరిస్థితీ అంతే. వాస్తవ పరిస్థితులను గుర్తించి ఈ ఏడాది రూ.2వేల కోట్లు కేటాయించి సకాలంలో వాటిని ఖర్చుచేస్తే జిల్లాలో సాగునీటి రంగం గాడిన పడుతుంది. ప్రత్యేకించి వెలిగొండ, గుండ్లకమ్మలు వినియోగంలోకి వస్తాయి.

కొండపి నియోజకవర్గంలో కీలకమైన సంగమేశ్వరం ప్రాజెక్టును వైసీపీ ప్రభుత్వం అటకెక్కించింది ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు.

ఎన్నెస్పీ ఆధారంగా 72వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, ఒంగోలుతోపాటు పలు ప్రాంతాలకు తాగునీరు అందిస్తున్న రామతీర్థం రిజర్వాయర్ నిర్వహణ అధ్వానంగా ఉంది. సుమారు 1.50 టీఎంసీల సామర్థ్యం ఉన్న ఈ ప్రాజెక్టు గేట్ల లీకుల నివారణకు కూడా నిధులు ఇవ్వకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. పెరిగిన అవసరాల దృష్ట్యా రిజర్వాయర్ సామర్థ్యాన్ని మరో టీఎంసీ పెంచాల్సిన అవసరం ఉంది.

చిన్న నీటిపారుదల కింద జిల్లాలో 9.31 టీఎంసీల సామర్థ్యంతో 11వేల ఎకరాల ఆయకట్టు కలిగిన 803 చెరువులు ఉన్నాయి. గతంలో టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన నీరు-చెట్టు పథకం కింద చేసిన పనులు తప్ప వైసీపీ పాలనలో ఏం చేయలేదు. భారీవర్షాలు కురిసినా సగం నీరు కూడా నిల్వ ఉండటం లేదు. కనీసం రూ.200 కోట్లు ఖర్చుచేస్తేనే తప్ప ఆ చెరువుల్లో నీరు నిలిచే పరిస్థితి లేదు.

మరోవైపు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఎత్తిపోల పథకాలకు పెట్టింది పేరు. అలా ఐడీసీ పరిధిలో లక్షా 40వేల ఎకరాల ఆయకట్టు ఉన్నా 350కిపైగా ఎత్తిపోతల పథకాలలో అత్యధిక భాగం పనిచేయడం లేదు. వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యం ఈ రంగంపై సాగడంతో ఆ పరిస్థితి ఏర్పడింది. తగు చర్యలు తీసుకొని ఎత్తిపోతల పథకాలను పునరుద్ధరించాల్సిన అవసరంఉంది.

జాతికి అంకితం పేరుతో జగన్మాయ

(5వ పేజీ తరువాయి)

అంటూ హామీలను కొనసాగించారు. అయితే బడ్జెట్‌లో అందుకు అవసరమైన నిధులు కేటాయించలేదు. అరకొరా కేటాయించినా వాటిని విడుదల చేయకపోవడం గమనార్హం.

అబద్ధపు హామీలతో ఐదేళ్లు పూర్తి

జగన్మోహన్‌రెడ్డి వెలిగొండపై ఐదేళ్లపాటు అబద్ధపు హామీలను కొనసాగించారు.

2021 అక్టోబరు 7న ఒంగోలులో : వెలిగొండ ప్రాజెక్ట్ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసే విధంగా అడుగులు వేస్తున్నాం. మొదటి టన్నెల్‌ను 2022 ఆగస్టు నాటికి పూర్తి చేస్తాం. దానికి ద్వారా వెలిగొండ ప్రాజెక్టుకు 3,000 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తాం. 2023 ఫిబ్రవరి నాటికి రెండో టన్నెల్‌ను కూడా పూర్తి చేసి 9,000 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తాం.

2022 ఆగస్టు 23న చీమకుర్తిలో : 2023 సెప్టెంబరు నాటికి వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేసి నీటిని విడుదల చేస్తాం. వెలిగొండ ప్రాజెక్టుకు నీళ్లిచ్చిన తర్వాతే ఎన్నికలకు వెళ్తాం.

2023 ఏప్రిల్ 12న మార్కాపురంలో : వెలిగొండ ప్రాజెక్టులో భాగమైన మొదటి టన్నెల్ తవ్వకం ఇప్పటికే పూర్తయింది. 2వ టన్నెల్‌ను సెప్టెంబరు లేదా అక్టోబరు నాటికి పూర్తిచేస్తాం. మళ్లీ జిల్లాకు వచ్చి వెలిగొండకు నీటిని విడుదల చేస్తాం.

2023 సెప్టెంబరు 20న నంద్యాల జిల్లా లక్షవరంలో : ఈ ఏడాది అక్టోబరులో వెలిగొండ ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేయబోతున్నాం.

అంటూ హామీల పరంపర కొనసాగించారు. 2024 మార్చి 6న ప్రాజెక్ట్ పూర్తికాకుండానే శిలాఫలకం ఆవిష్కరించి, జాతికి అంకితం పేరుతో ప్రజలను మోసం చేశాడు.

అసంపూర్తిగా టన్నెల్, ఫీడర్ కెనాల్ పనులు

వెలిగొండ ప్రాజెక్ట్‌లో భాగంగా రెండు టన్నెళ్ల నిర్మాణం చేయాల్సి ఉంది. మొదటి టన్నెల్ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పూర్తయింది. రెండో టన్నెల్ మొత్తం పొడవు 18 కి.మీటర్లలో 16 కి.మీటర్ల మేర పూర్తయింది. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టన్నెల్ తవ్వకం పక్కదారి పట్టింది. రెండో టన్నెల్‌లో నిబంధనలకు విరుద్ధంగా పనులు చేశారు. రెండవ టన్నెల్ నుంచి మొదటి టన్నెల్‌లోకి రెండు ఆడిట్లు తవ్వడం, టన్నెల్ తవ్వకం పనులను టీబీఎం ద్వారా కాకుండా మనుషులతో తవ్వించారు. టన్నెల్‌లో నుంచి మట్టిని లారీల ద్వారా తీసుకువెళ్లి కృష్ణా నదిలో పోశారు. ఈ మేరకు ఆత్మకూరు అటవీశాఖ అధికారులు సైతం కేసులు నమోదు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం నీటిని విడుదల చేయాలంటే మొదటి టన్నెల్ ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. రెండో టన్నెల్ లైనింగ్ పనులు పూర్తికాలేదు. హెడ్‌రెగ్యులేటర్ పనులు కూడా పూర్తి కావాల్సి ఉంది.



ప్లాట్లు కేటాయించని కలనూతల పునరావాస కాలనీ

పూర్తికాని ఫీడర్ కెనాల్-వర్షపు నీటికే కాల్వకు గండ్లు

ఫీడర్ కెనాల్ దోర్నాల మండలం కొత్తూరు నుంచి మార్కాపురం మండలం గొట్టిపడియ వరకు సుమారు 24 కిలోమీటర్ల మేర ఉంది. కెనాల్ తవ్వకం పనులు 2008లో ప్రారంభమైనప్పటికీ నేటికీ పూర్తికాలేదు. కొన్నిచోట్ల ఒకవైపు కొండలు హద్దుగా, మరోవైపు మట్టితో కట్టలు నిర్మించారు. కొన్నిప్రాంతాలలో రెండువైపులా మట్టితో కట్టలు పోశారు. పలుచోట్ల యంత్రాలతో తవ్వకం పనులు సాధ్యంకాక నిలిపివేశారు. ఆయా ప్రాంతాలలో మనుషులతో తవ్వకాలను చేపట్టాల్సి ఉంది.

- 2018లో నల్లమలలో భారీ వర్షాలు కురిశాయి. దీంతో ఫీడర్ కెనాల్‌కు నీరు చేరింది. పనుల పూర్తయిన వరకు నీరు ముందుకు ప్రవహించింది. ఆతర్వాత నీటి ఉధృతికి ఫీడర్ కెనాల్‌కు దోర్నాల మండలం కడపరాజుపల్లె వద్ద భారీ గండి పడింది. వర్షపునీటి ఉధృతికే గండి పడిన ఫీడర్ కెనాల్ టన్నెళ్ల ద్వారా వచ్చే నీటి ఉధృతికి తట్టుకొని ఉంటుందా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. కొత్తూరు నుంచి జలాశయం వరకూ సిమెంట్ అలైన్‌మెంట్ చేసి కాల్వను పటిష్ఠం చేస్తే సమస్య లేకుండా ఉంటుంది. గత టీడీపీ హయాంలో రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిమెంట్ అలైన్‌మెంట్‌కు ప్రతిపాదనలు తయారు చేశారు. స్థానిక అధికారులు తయారు చేసిన అంచనాల మేరకు సిమెంట్ అలైన్‌మెంట్‌కు రూ.120 కోట్లు ఖర్చవుతుంది. ఇందుకు సంబంధించిన అంచనాల ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ దస్త్రాన్ని మూలన పడేసింది.

పరిహారం పరిహాసం

సుంకేసుల డ్యాం పరిధిలో...

వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితుల నష్టపరిహారం, పునరావాస చర్యలు 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా ఉన్నాయి. సుంకేసుల డ్యాం ముంపు గ్రామాలైన కలనూతల, చింతలముడిపిల నిర్వాసితులకు ఇడుపూరు-1లో 951, ఇడుపూరు-2లో 386 మందికి నివేశన స్థలాల పట్టాలు మంజూరు చేశారు. కానీ కాలనీలలో మౌలిక వసతులు కల్పించలేదు. వీరికి సంబంధించి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పరిహారం కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపించినా చర్యలు లేవు. ముంపు గ్రామమైన సుంకేసుల నిర్వాసితులకు తోకపల్లిలో 310 మందికి, గోగులదిన్నెలో 1193 మందికి నివేశనా స్థలాలకు పట్టాలు మంజూరు చేశారు. కానీ మౌలిక వసతుల కల్పనలో జాప్యం జరుగుతోంది.

గుండంచర్ల, కాటంరాజుతండా నిర్వాసితులకు దేవరాజుగట్టు వద్ద పునరావాస కాలనీ ఏర్పాటుకు స్థలసేకరణ జరిగింది. మౌలిక వసతుల కల్పనకు పనులు ప్రారంభం కాలేదు. గుండంచెర్లలో 1,210 మంది నిర్వాసితులకుగాను ఆర్‌అండ్‌ఆర్ కింద 634 మంది, వన్‌టైం సెటిల్‌మెంట్ కింద 576 మంది ఉన్నారు. కాటంరాజుతండాలో ఆర్‌అండ్‌ఆర్ కింద 19 మంది, వన్‌టైం సెటిల్‌మెంట్ కింద 24 మంది ఉన్నారు. ఇందుకు సంబంధించి తదుపరి చర్యల నిమిత్తం క్షేత్రస్థాయి అధికారులు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారేకానీ తదుపరి చర్యలు శూన్యం.

గొట్టిపడియ డ్యాం పరిధిలో...

గొట్టిపడియ డ్యాం ముంపు గ్రామాలైన గొట్టిపడియ, అక్కచెరువుతాండ నిర్వాసితులకు మార్కాపురం మండలం వేములకోట సమీపంలో 83.54 ఎకరాల భూమిని పునరావాస కాలనీకి ఎంపిక చేశారు. గొట్టిపడియలో 735 మంది, అక్కచెరువులో 86 మంది నిర్వాసితులకు నేటికీ నివేశన స్థలాలకు లబ్ధిదారులు మొగ్గుచూపకపోవడంతో నేటికీ పట్టాలు తయారు చేయలేదు. పునరావాస కాలనీలో మౌలిక వసతులు పూర్తికాలేదు.

కాకర్ల డ్యాం పరిధిలో...

అర్ధవీడు మండలం కాకర్ల డ్యాం పరిధిలోని సాయిరాంనగర్, రామలింగేశ్వరపురం, కృష్ణానగర్, లక్ష్మీపురంలలో 341 మంది నిర్వాసితులున్నారు. వీరికి బేస్తవారపేట మండలం ఒందుట్ల వద్ద పునరావాస కాలనీ ఏర్పాటు చేసినప్పటికీ మౌలిక వసతుల కల్పనలో జాప్యం జరుగుతోంది. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద క్షేత్రస్థాయి అధికారుల నుంచి ఉన్నతస్థాయి అధికారులకు ప్రతిపాదనలు వెళ్లాయికానీ ఎప్పుడు నిధులు విడుదల అవుతాయో అర్థంకాని పరిస్థితి నెలకొంది.



వర్షపునీటికి గండి పడిన ఫీడర్ కెనాల్(ఫైల్)

30నే పింఛన్ల సొమ్మును డ్రా చేయాలి

● కోర్టు పిటిషన్లపై ప్రత్యేక దృష్టి సారించాలి ● అభివృద్ధి పనుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు ● కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరిక



ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఈనెల 31వతేదీన దీపావళి పండుగ నేపథ్యంలో బ్యాంకులకు సెలవు ఉన్నందున ఈనెల 30వతేదీనే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ సొమ్మును డ్రా చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. బ్యాంకుల నుంచి డ్రా చేసిన సొమ్మును నవంబరు 1వతేదీ ఉదయం ఐదు గంటల నుంచే లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. పెన్షన్లు పంపిణీ సజావుగా జరిగేలా మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు దృష్టిసారించాలన్నారు. వివిధ శాఖలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులపై అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. టైమ్‌బాండ్ కేసులు, డైరెక్షన్, ధిక్కార, రిట్ పిటిషన్లపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. లోకాయుక్తా కేసులపై జిల్లా అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు సమీక్షించుకొని తదనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన ఇంకుడు గుంతల నిర్మాణాలు, రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు, ఫాంపాండ్ నిర్మాణాలు లక్ష్యానికి అనుగుణంగా పూర్తిచేయాలని ఆదేశించారు.

లక్ష్యం మేరకు అనుమతులు తీసుకుని యూనిట్లను గ్రౌండింగ్ చేయాలన్నారు. ప్రతి గ్రామంలో 25 సెంట్ల నుంచి ఒక ఎకరా ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించామని, ఇప్పటివరకు 15 మండలాల నుంచి మాత్రమే ప్రతిపాదనలు వచ్చాయన్నారు. గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ పథకాల అమలు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మీకోసంలో వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో ఓబులేసు, ఎస్‌డీసీ లోకేశ్వరరావు, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు శ్రీనివాసరావు, సురేష్ కుమార్, లక్ష్మానాయక్, వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.



చిల్లర నాణేలు పంపిణీ చేస్తున్న బ్యాంకు అధికారులు

చిల్లర నాణేల పంపిణీ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు చిల్లర నాణేల కొరతతో అనేక ఇబ్బందులు పడుతున్నారని, దానిని దృష్టిలో పెట్టుకొని ఖాతాదారులకు అవసరమైన మేరకు నాణేలను పంపిణీ చేస్తున్నట్లు సీనియర్ బ్యాంకు మేనేజర్ టి.పోలయ్య అన్నారు. స్థానిక బాపూజీకాంప్లెక్స్ వద్ద సోమవారం యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో బ్యాంకు రీజనల్ హెడ్ డీజీఎం రవికుమార్, ఏజీఎం కె. రామలింగేశ్వరరావుల ఆధ్వర్యంలో కరెన్సీ చెస్ట్ చిల్లర నాణాల పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా పది రూపాయల నాణేలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం సుమారు రెండు లక్షల విలువైన చిల్లర నాణేలను ఖాతాదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఏ రామారావు, శివారెడ్డి, కె. రాజీవ రతన్ దేవ్, బి. హరీఫ్, కె ప్రసాద్, ఎస్. బాబీ, ఎం. ఇజ్రాయేలు, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టి. వెంకటచలమయ్య గుప్త, కె. సురేష్‌కుమార్, కమిటీ సభ్యులు బి. రామ్‌సింగ్, డి. మాధవ రావు తదితరులు ఉన్నారు.

సివిల్ సప్లయీస్ డైరెక్టర్‌కు అభినందనలు



పౌరసరఫరాల శాఖ డైరెక్టర్‌కు బోకే ఇస్తున్న డీలర్ల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లయీస్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరెడ్డిని జిల్లా రేషన్ డీలర్ల సంఘం నాయకులు సత్కరించారు. కందుకూరులోని టీడీపీ కార్యాలయంలో సోమవారం డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరెడ్డిని జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు మోదుకూరి శ్రీనివాసులు ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు ఈసందర్భంగా జిల్లాలో డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని శ్రీనివాసులు తెలిపారు. కాగా ఈసందర్భంగా కందుకూరు ఎమ్మెల్యే నాగేశ్వరరావును కూడా సత్కరించారు.

విద్యుత్ లైన్‌ను సరిచేసిన సిబ్బంది

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

నాగులుప్పలపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మట్టిగుంట గ్రామంలోని ఎస్టీ కాలనీ సమీపంలో విద్యుత్ తీగలు చేతికందేంత ఎత్తులో ఉన్నాయి. ఆ తీగలు ప్రమాద భరితంగా ఉండటంతో పాటు గ్రామంలో నెలకొన్న లోవోల్టేజీ సమస్యపై సోమవారం ఆంధ్రజ్యోతిలో పట్టించుకోకుంటే ప్రమాదమే కథనం ప్రచురితమైంది. దాంతో స్పందించిన విద్యుత్ శాఖ ఏఈ రమేష్ బాబు సిబ్బందిని నియమించి మట్టిగుంట గ్రామంలో కిందికి వంగి ఉన్న విద్యుత్ లైన్ తీగలను సరిచేయించారు.త్వరలోనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి లో వోల్టేజి సమస్యను పరిష్కరిస్తామని ఏఈ తెలిపారు.

మునిసిపల్ కార్మికుల నిరసన

ఒంగోలు, కార్పొరేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరపాలక సంస్థలోని పారిశుధ్య విభాగం, ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులు సమస్యలు పరిష్కరించాలని ఏపీ మునిసిపల్ వర్కర్స్, అండ్ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈమేరకు సోమవారం కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. యూనియన్ గౌరవ అధ్యక్షులు టి. మహేష్ మాట్లాడుతూ ఏళ్లతరబడి పరిష్కారానికి నోచుకోని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చట్టబద్ధమైన శెలవులు, పనిముట్లు, రక్షణ పరికరాలు, చనిపోయిన కార్మికుని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సామ్రాజ్యం, కే.వంశీ, బాబు, బి. దివ్య జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఒంగోలులో మెప్మా అర్బన్ మార్ట్

ఒంగోలు, కార్పొరేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మెప్మా ఆధ్వర్యంలో నగర పరిధిలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన మెప్మా ఉత్పత్తుల విక్రయాలు (మెప్మా అర్బన్ మార్కెట్) ఈనెల 29, 30 తేదీలలో ఏర్పాటు చేసినట్లు ప్రాజెక్టు డైరెక్టర్ టి. రవికుమార్ సోమవారం తెలిపారు. రెండు రోజులపాటు ఒంగోలులోని అద్దంకి బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న మెప్మా ప్రధాన కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేశామని, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు.

'మాదిగలకు చంద్రబాబుతోనే మేలు'



కృతజ్ఞత యాత్రలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు

ఒంగోలు, కార్పొరేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మాదిగ సామాజిక వర్గానికి, ఉప కులాలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే మేలు జరుగుతుందని ఏపీ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ పేర్కొన్నారు. సోమవారం ఒంగోలులోని కలెక్టరేట్ వద్ద అంబేడ్కర్ విగ్రహం వద్ద చంద్రబాబుకు కృతజ్ఞత యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నసమయంలో ఉమ్మడి రాష్ట్రంలోని 25వేల మంది మాదిగ ఉపకులాలకు రిజర్వేషన్ ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయన్నారు. భవిష్యత్‌లో కూడా మాదిగలకు చంద్రబాబు నాయుడుతోనే మంచి జరుగుతుందని ఆయన అన్నారు. చంద్రబాబుకు కృతజ్ఞత తెలియజేస్తూ హిందూపురం నుంచి బయలుదేరిన యాత్ర ఇచ్ఛాపురం వరకు కొనసాగుతుందని తెలిపారు. అందులో భాగంగా ఒంగోలు విచ్చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చెరుకూరి కిరణ్, కొండయ్య, సుధాకర్, జాలరాజు, బక్కా తిరుమల జయరావు, తదితరులు పాల్గొన్నారు.

ఊరు మెచ్చిన శ్రీమంతుడికి జేజేలు

● కారుమంచి మేజర్‌కు నీటిని విడుదల చేసిన ఎన్నారై శేషయ్య ● ఘనసత్కారం చేసిన పదహారు గ్రామాలకు చెందిన రైతులు



నీటిని విడుదల చేస్తున్న శేషయ్య

చీమకుర్తి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఊరు మెచ్చిన శ్రీమంతుడు ఎన్నారై నల్లూరి వెంకట శేషయ్యకు పదహారు గ్రామాలకు చెందిన రైతులు తమ కృతజ్ఞతను చాటుకున్నారు. తమ సంక్షేమాన్ని... ప్రభుత్వం, తాము ఎన్నో ఆశలతో ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు గత మూడేళ్లుగా విస్మరించిన వేళ రైతుబిడ్డ, నల్‌సాఫ్ట్ అధినేత నల్లూరి వెంకటశేషయ్య స్పందించారు. రైతుల కష్టాలను స్వయంగా చూసి, వారి వినతి మేరకు కారుమంచి మేజర్ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. దాదాపు రూ.12లక్షలతో మేజర్‌తోపాటు అనుసంధానంగా ఉన్న మైనర్ కాలువల్లో సైతం జంగిల్ క్లియరెన్స్, పూడికతీత పనులు చేపట్టటంతోపాటు మేజర్ హెడ్ రెగ్యులేటరీని నూతనంగా ఏర్పాటు చేయించారు. సోమవారం శేషయ్య చేతులమీదుగా మేజర్‌కు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో నల్లూరి వెంకటశేషయ్య మాట్లాడుతూ మన ప్రాంతంలో నదులు లేవు, ఉన్న కాలువలు సైతం నీరు పారని స్థితిలో ఉంటే ఒక రైతుబిడ్డగా చలించిపోయి కారుమంచి మేజర్‌కు మరమ్మతులకు పూనుకున్నానన్నారు. నేడు కాలువలో పారుతున్న నీటిని చూసి పదహారు గ్రామాల రైతుల్లో వ్యక్తమవుతున్న సంతోషం ముందు తాను పెట్టిన ఖర్చు చాలా చిన్నదన్నారు. కారుమంచి మేజర్ నుంచి పూర్తిస్థాయిలో లబ్ధి పొందాలంటే క్వారీలో కూలిన కట్టని పునరుద్ధరించటానికి రైతులందరూ పార్టీలకతీతంగా పట్టుబట్టాలన్నారు. వచ్చే వేసవిలోపు ఆ దిశగా సానుకుల ఫలితం రాకపోతే మనమే మన జీవనాడిని పునరుద్ధరించుకుందామన్నారు. ఈ సభలో పాల్గొన్న రైతులు, టీడీపీ నాయకులు తమ అభ్యున్నతికి శేషయ్య అందించిన సేవలను కొనియాడారు. ఘనంగా సత్కరించారు. అంతకు ముందు మేజర్ పనులను శేషయ్య స్వయంగా పరిశీలించారు. ఆపై లాకులు ఎత్తి నీటిని విడుదల చేశారు. నీటిలో పూలు చల్లి పూజలు జరిపారు. కార్యక్రమంలో ప్రసాద్, నారాయణ, కాట్రగడ్డ రమణయ్య, గొట్టిపాటి రాఘవరావు, రావిపాటి రాంబాబు, కొత్తపు రాఘవరావు, కందిమళ్ల గంగాధరరావు,ఎనికపాటి లక్ష్మీనరసయ్య, సింగారెడ్డి, సురేష్, పుట్టా బ్రహ్మయ్య పుట్టా శ్రీనివాసరావు, ఎస్ ఆంజనేయులు పాల్గొన్నారు.



క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన లారీ డ్రైవరు



గాయపడిన టాటా ఏస్ డ్రైవర్ విజయ్‌మనోజ్

పసుపుగల్లు వద్ద రెండు లారీలు ఢీ

● క్యాబిన్లలో ఇరుక్కుపోయిన డ్రైవర్లు ● బాధితులు ఆస్పత్రికి తరలింపు

ముండ్లమూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పసుపుగల్లు ఎస్సీ కాలనీ సమీపంలో అద్దంకి-దర్శి ప్రధానరహదారిపై సోమవారం రాత్రి 9 గంటల సమయంలో ఎదురెదురుగా రెండు లారీలు ఢీకొన్నాయి. దీంతో ఇరువురు డ్రైవర్లు లారీ క్యాబిన్లలో అరగంటకుపైగా ఇరుక్కుపోయి క్షోభను అనుభవించారు. తమను బయటకు తీసి కాపాడాలంటూ ఆర్తనాదాలు చేశారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ నాగరాజు తన సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్థుల సహకారంతో వారిని బయటకు తీశారు. బాధితులను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఓ లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉండటం వలన ప్రమాదం జరిగిందని సమాచారం.

తహసీల్దార్ కార్యాలయ

నూతన భవన నిర్మాణానికి నిధులు

● రూ.3 కోట్లు జిల్లా ఖనిజ నిధి నుంచి మంజూరు

● తాత్కాలిక కార్యాలయం కోసం నానాపాట్లు



శిథిలావస్థలో ఉన్న చీమకుర్తి తహసీల్దార్ కార్యాలయం

చీమకుర్తి, అక్టోబర్ 28(ఆంధ్రజ్యోతి): శిథిలస్థితికి చేరుకున్న చీమకుర్తి తహసీల్దార్ కార్యాలయాన్ని పడగొట్టి నూతన భవనాన్ని నిర్మించడానికి గ్రీన్‌సిగ్నల్ లభించింది. గ్రానైట్ క్వారీల నుంచి వసూలు చేసి ప్రభావిత ప్రాంతాలకు వినియోగించే డీఎంఎఫ్ (జిల్లా ఖనిజ నిధి)నుంచి రూ.3కోట్లను విడుదల చేయటానికి కలెక్టర్ తమీమ్ అన్సారియా అనుమతులు మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో నూతన భవన నిర్మాణం చేపట్టడానికి అవసరమయ్యే ప్రణాళికలను రూపొందించే పనిలో ఆర్‌అండ్‌బీ అధికారులు నిమగ్నమయ్యారు. కాగా ప్రస్తుతం శిథిల స్థితికి చేరుకున్న కార్యాలయాన్ని ఖాళీ చేయాల్సి ఉంది. నూతన భవనం పూర్తయ్యే వరకూ తాత్కాలికంగా ఎక్కడో చోట కార్యాలయాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. దీని కోసం జేసీ సూచన మేరకు పాత మున్సిపల్ కార్యాలయంలో తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధమయ్యారు. అయితే అందుకు మున్సిపల్ కమిషనర్ నుంచి స్పందన రాకపోవటంతో ఏమి చేయాలనే విషయమై రెవెన్యూ అధికారులు ఆలోచనలో పడ్డారు. అధికారికంగా లెటర్ పెట్టినా కమిషనర్ నుంచి స్పందన లేకపోవటంపై జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లాలని తహసీల్దార్ నిర్ణయించుకున్నారు. తదనుగుణంగా జిల్లా అధికారుల స్పందన మేరకు నూతన కార్యాలయ నిర్మాణ పనులకు ముహూర్తం ఖరారు కానుంది.

మార్కెట్ వేలాన్ని మమ అనిపించారు!

మున్సిపల్ అధికారుల ఆదాయం ఆశలు గల్లంతు



వేలంలో పాల్గొన్న కమిషనర్ తదితరులు

చీమకుర్తి, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ వేలంకు కనీస స్పందన కూడా కరువైంది. చీమకుర్తి మున్సిపాలిటీ పరిధిలో ఏళ్ల తరబడి తెరుచుకోని కూరగాయల మార్కెట్‌లో ఉన్న 13షాపులు, కబేళాలు, చేపల మార్కెట్ నిర్వహణదారులు, స్ట్రీట్ వెండర్స్ నుంచి రుసుం వసూలుకు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో వేలం నిర్వహించారు. నిధుల లేమితో కునారిల్లుతున్న మున్సిపాలిటీ ఆదాయ వనరుల సమీకరణలో భాగంగా వేలం ప్రక్రియను చేపట్టగా అధికారుల ఆశలు నెరవేరలేదు. చివరికి వేలంను మమ అనిపించాల్సి వచ్చింది. వేలంలో పాల్గొనటానికి ఎక్కువమంది రాకపోవటంతో అధికారులు తెల్లబోయారు. వచ్చిన ఆ కొద్దిమంది రింగ్ అయి అధికారులు కోట్ చేసిన మొత్తాలకు కాసింత కలిపి షాపులను, నగదు వసూలు చేసే హక్కులను దక్కించుకున్నారు. ఒక్కో షాపునకు సగటున రూ.2,300, రుసుం వసూలు చేయటానికి రూ.90వేలను చెల్లించటానికి కనీస పోటీ కూడా లేకుండా హక్కులను దక్కించుకున్నారు. అధికారులకు ముందుచూపు లేకపోవడం కూడా వేలానికి స్పందన రాకపోవటానికి ఓ కారణంగా చెబుతున్నారు. వెరసి లక్షల ఖర్చుపెట్టి దాతలు నిర్మించిన కూరగాయల మార్కెట్ కళకళలాడే పరిస్థితి కనిపించడం లేదు.



సభ్యత్వ నమోదు చేసుకున్నట్లు ఫోన్‌లో చూపుతున్న సత్య, టీడీపీ శ్రేణులు

సభ్యత్వ నమోదులో ప్రథమ స్థానంలో నిలుద్దాం

టీడీపీ సమావేశంలో మారిటైం బోర్డు చైర్మన్ సత్య

టంగుటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కొండపి నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వాలను అత్యధికంగా చేయించి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలుద్దామని టీడీపీ శ్రేణులకు ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ (సత్య) పిలుపునిచ్చారు. జాతీయ రహదారిలోని ఐవోసీ ఎదురు ఉన్న ఆయన కార్యాలయంలో సోమవారం టీడీపీ కొండపి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సత్య మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ పనుల సీజన్ ప్రారంభమైనందున ప్రతి నాయకుడు రోజుకు రెండు గంటలు సభ్యత్వాల నమోదుకు కేటాయించాలని సూచించారు. సభ్యత్వం పొందిన వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.5లక్షల వరకూ బీమా చెల్లిస్తారన్నారు. మీరు గ్రామాలకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రకటిస్తే ఐటీ విభాగానికి చెందిన ఐదుగురు సభ్యులను పంపిస్తామని, వారి సాయంతో సభ్యత్వ ప్రక్రియను త్వరగా పూర్తి చేసుకోవచ్చని చెప్పారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు టీడీపీ ఇచ్చిన హామీల్లో ప్రతి ఒక్కటీ అమలు చేస్తామన్నారు. సమావేశంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు అడకా స్వాములు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బెజవాడ వెంకటేశ్వర్లు, జరుగుమల్లి, టంగుటూరు, కొండపి, సింగరాయకొండ, పొన్నలూరు, మర్రిపూడి మండలాల అధ్యక్షులు రవిబాబు, కామని విజయకుమార్, యలమందనాయుడు, శింగయ్య, నర్సారెడ్డి, బీసీ నాయకుడు నారాయణస్వామి పాల్గొన్నారు.

ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలి

● నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు : ఎస్పీ

ఒంగోలుక్రైం, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాలు నివారణకు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో పాటుగా, నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలని ఎస్పీ అదేశించారు. సోమవారం ట్రాఫిక్ సిబ్బందితో ఎస్పీ కార్యాలయంలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్‌ను సులభతరం చేసి ప్రమాదాలను నివారించాలని కోరారు. ట్రాఫిక్‌లో మెరుగైన సేవలు అందించిన వారికి రివార్డు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, ఎస్సైలు కోటయ్య, నజీర్ బాషా, శ్రీనివాసరావు, మాల్యాద్రి సిబ్బంది ఉన్నారు.

నగరంలో చెలరేగుతున్న

గంజాయి బ్యాచ్



హ్యాండ్‌బ్యాగులు లాక్కొని పరార్

పెరిగిన చిల్లర దొంగతనాలు

కొందరిని అదుపులోకి తీసుకొని

విచారిస్తున్న పోలీసులు

ఒంగోలుక్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, మహిళలే లక్ష్యంగా దొంగలు చెలరేగిపోతున్నారు. ఇంటి నుంచి బయటకు వచ్చిన వారి హ్యాండ్‌బ్యాగ్‌లు లాక్కొని పరారవుతున్నారు. నగరంలో నిత్యం ఏదో ఒకచోట దొంగతనం జరుగుతోంది. చిల్లర దుకాణాలు పగుల గొట్టడం, దేవాలయాలలో హుండీలు ధ్వంసం చేసి నగదు అపహరించడం చేస్తున్నారు. దొంగతనాలు చిన్నవైనా పోలీసులకు చిరాకు పుట్టిస్తున్నాయి. బాధితులు రోజూ పోలీసు స్టేషన్ చుట్టూ తిరుగుతుంటే బ్లేటుగుంట బ్యాచ్ వచ్చిందా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే రెండు రోజుల క్రితం పోలీసులు ఏడుమందిని పట్టుకొని విచారించగా విస్తుపోయే నిజాలు బయట పడ్డాయి.

చిల్లర దొంగతనాలు చేసింది గంజాయి బ్యాచ్చే

నగరంలో జులాయిగా తిరుగుతూ మత్తుకు అలవాటు పడిన కొంతమంది మైనర్లు ఇలాంటి చిల్లర దొంగతనాలకు పాల్పడుతున్నారు. చిన్నా చితకా దొంగతనాలు చేసి గంజాయి, మత్తుపానీయాలు తీసుకొని రోడ్ల వెంట జోగాడుతున్నారు. స్కూటీల మీద వెళ్లే మహిళలు, వృద్ధుల వద్ద ఉన్న హ్యాండ్ బాగ్‌లను లాకెళ్ళి దానిలో ఉన్న నగదుతో మద్యం సేవించడం, సెల్ ఫోన్ దొరికితే వచ్చిన కాడికి విక్రయించి ఆ సొమ్ముతో జల్సాలు చేస్తున్నారు. చిల్లర దొంగలు. గంజాయి కొనేందుకు డబ్బులు లేక పోతే మత్తు బిళ్లలు కొనుగోలు చేసి తమ ఆరోగ్యాలను పాడు చేసుకుంటున్నారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న కొన్నిమెడికల్ షాపులలో ఇలాంటి వారికి మత్తుబిళ్లలు సరఫరా చేస్తున్నారు. ఇలా మత్తులో రాత్రి పూట రోడ్ల పై కేరితలు కొడుతూ చిల్లర దొంగతనాలు చేయడం పరిపాటిగా మార్చుకున్నారు.

ఇటీవల జరిగిన నేరాలు

● అన్నవరప్పాడు కాలనీ నుంచి ఓ మహిళ స్కూటీ మీద వస్తుండగా అమెకు ఎదురుగా ఇరువురు చిల్లర దొంగలు వచ్చి అమె వద్ద ఉన్న బ్యాగ్‌ను లాక్కెళ్లారు. బ్యాగ్‌లో నగదు తోపాటుగా సెల్‌ఫోన్‌ఉంది.

● పాత గుంటూరు రోడ్డులోని ఓ దేవాలంలో హుండీని పగుల కొట్టి నగదు అపహరించారు.

● చిల్లర దుకాణాలలో రాత్రులు తలుపులు పగులకొట్టి నగదు అపహరించారు. ఇలా అనేక చోరీలకు పాల్పడిన ముఠా పోలీసులకు తలనొప్పిగా మారింది.

గంజాయి బ్యాచ్‌ని విచారిస్తున్న పోలీసులు

నగరంలో తలనొప్పిగా మారిన గంజాయి బ్యాచ్‌లో ఏడు మందిని పట్టుకొని పోలీసులు విచారిస్తున్నారు. వారంతా చిల్లర దొంగతనాలు చేసిన వారే అని నిర్ధారణకు వచ్చారు. ఒంగోలుతో పాటుగా ఇతరప్రాంతాలలో కూడా వీరు ఇలాంటి దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఇంకా విచారణలో అనేక విషయాలు బయిటకు వచ్చే అవకాశం ఉంది.

సంక్షిప్తంగా..

మాజీ సైనికుల సంక్షేమానికి రూ. 10 కోట్లు

ఒంగోలు(రూరల్)అక్టోబరు 28: మాజీసైనికుల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పదికోట్ల రూపాయల నిధులు కేటాయించటం ఎంతో సంతోషకర విషయమని రాష్ట్ర మాజీసైనికుల సంక్షేమసంఘం గౌరవాధ్యక్షుడు నెప్పల నాగేశ్వర రావు అన్నారు. ఒంగోలు మిలటరీ క్యాంటీన్ ఆవరణలో సోమవారం సాయంత్రం మాజీ సైనికులు సమావేశం జరిగింది. మాజీ సైనికుల కోసం పదికోట్లు కేటాయించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డీఆర్వో

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్‌ను జిల్లా రెవెన్యూ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన చిన్న ఓబులేసు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు బొకేతో పాటు శాలువతో సత్కరించారు.

బాణసంచా విక్రయదారులు నిబంధనలు పాటించాలి

సంతనూతలపాడు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):బాణ సంచా విక్రయదారులు నిబంధనలు పాటించి విక్రయాలు జరపాలని ఎస్సై వి.అజయ్‌బాబు తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్టేషన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు లేకుండా బాణసంచా విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కెనరాబ్యాంక్ ద్వారా రైతులకు విరివిగా రుణాలు

మద్దిపాడు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : కెనరాబ్యాంకు ద్వారా రైతులకు విరివిగా రుణాలను అందిస్తామని మేనేజర్ వి.శ్రీధర్ అన్నారు. సోమవారం మద్దిపాడు కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఖాతాదారులతో మాట్లాడారు. డ్వాకా గ్రూపుల ద్వారా పరిశ్రమలను నెలకొల్పేవారికి రూ.10లక్షలు రుణం మంజూరుచేస్తామన్నారు. పలువురు ఖాతాదారులు లాకర్ సౌకర్యం కల్పించాలని కోరారు.

దేశాభివృద్ధికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ

ఒంగోలుక్రైం, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో ఎలాంటి ఒత్తిడిలకు , ప్రలోభాలకు లొంగకుండా దేశాభివృద్ధికి కృషి చేస్తామని ఏసీబీ ఇన్‌చార్జీ డీఎస్పీ సీహెచ్.శేషు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. సోమవారం స్థానిక అవినీతి నిరోధక శాఖ కార్యాలయం వద్ద విజిలెన్స్ అవేర్నెస్ వీక్ సందర్భంగా కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందితో ప్రమాణం చేయించారు.

జాతీయ స్థాయి నృత్య పోటీలకు తేజశ్రీ ఎంపిక

ఒంగోలు విద్య, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రీయ ఏక్తాపర్వ్-24 ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కళాభారత్ జాతీయ స్థాయి పోటీలకు ఒంగోలు కేంద్రియ విద్యాలయంలో 12వతరగతి చదువుతున్న పి. తేజశ్రీరెడ్డి ఎంపికయ్యారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన తేజశ్రీ రెడ్డిని ప్రిన్సిపాల్ మనీష్‌కుమార్ అభినందించారు.

అంగన్‌వాడీ భవనానికి మెరక

మద్దిపాడు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లంపల్లిలో అంగన్‌వాడీ కేంద్ర ప్రాంగణం వర్షాలకు బురదమయం అయింది. దీంతో స్థానిక సర్పంచ్ చిట్టిబోయిన అనిల్ కుమార్‌యాదవ్, గ్రామ కార్యదర్శి మాధవి, ఎంపీటీసీ దుర్గాభవానీ నేతృత్వంలో మట్టితోలి శుభ్రం చేశారు.

బాస్కెట్ బాల్ జట్టుకు పతకం

ఒంగోలు విద్య, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : జేఎన్‌టీయూ కాకినాడ మహిళా బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌లో ఒంగోలు క్విస్ ఇంజనీరింగ్ కళాశాల మహిళా బాస్కెట్ బాల్ జట్టు ప్రతిభ చూపి పతకం సాధించింది. ఈనెల 27న జరిగిన జేఎన్‌టీయూకే అంతర్‌కళాశాలల మహిళా బాస్కెట్‌బాల్ టోర్నీలో క్విస్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు మూడవ స్థానంలో నిలిచింది. క్రీడాకారుల అద్భుత ప్రదర్శనకు గుర్తింపుగా జట్టుకు ట్రోఫీని బహుకరించారు. ఈసందర్బంగా బాలికల జట్టును కళాశాల వ్యవస్థాపక చైర్మన్ నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి, వైస్ చైర్మన్ డాక్టర్ గాయత్రీలు అబినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వైవీ హనుమంతరావు, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

అర్ధరాత్రి ఆకతాయిల

ఆగడాలకు చెక్

డీజేలు పెట్టి ప్రజాశాంతికి భంగం కలిగిస్తే చర్యలు : డీఎస్పీ

ఒంగోలుక్రైం, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి) : బర్త్‌డే పార్టీల పేరుతో రోడ్ల పై డీజేలు పెట్టి అర్ధరాత్రులు ప్రజా శాంతికి భగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఒంగోలు డీఎస్పీ ఆర్ శ్రీనివాసరావు హెచ్చరించారు. రౌడీయిజంతో ఎలాంటి చిన్న సంఘటనకు పాల్పడినా రౌడీషీట్లు తెరిచేందుకు వెనకాడబోమని అన్నారు. రాత్రులు డీజేలు ఏర్పాటు చేసి డ్యాన్స్‌లు వేస్తే కఠినంగా వ్యవరిస్తామని అన్నారు. నగరంలో నిరంతరం నిఘా ఉంటుందని చెప్పారు. కొప్పోలు ఫ్లైఓవర్ బ్రిడ్జి పై కొంత మంది అర్ధరాత్రులు రేసింగ్ చేస్తున్నారని, అలాంటి వారిని సహించేది లేదన్నారు. మోటార్ వాహన చట్టం ప్రకారం మోటర్ సైకిళ్లకు ఉండవలసిన సైలెన్సర్లు మాత్రమే ఉండాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా వాహన చోదన చేసి పట్టుబడితే వారి తల్లిదండ్రులు , వారికి వాహనం ఇచ్చినవారిపై కేసులు నమోదుకు వెనుకాడబోమని అన్నారు. మోటార్ సైకిళ్లపై ఉన్న జరిమానాలను మీసేవా కేంద్రాలలో జమచేయాలని కోరారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలి

కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కారవేదిక మీ కోసం కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈసందర్బంగా అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మీ కోసం అర్జీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వెంటనే పరిష్కరించాలన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలన్నారు. అర్జీల పరిష్కారంలో సహేతుకత ముఖ్యమన్నారు. మొక్కుబడి సమాధానాలతో అర్జీదారులకు ఎండార్స్‌మెంట్ ఇచ్చేసి సమస్యను పరిష్కరించినట్లుగా రికార్డుల్లో చూపితే సహించేది లేదని హెచ్చరించారు. సాంకేతిక సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకరావాలని కలెక్టర్ సూచించారు. కాగా గ్రీవెన్స్‌సెల్‌లో 242 మంది అర్జీదారులు తమ సమస్యలను విన్నవించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, డిఆర్వో చిన్న ఓబులేసు, స్పెషల్‌డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావుతో పాటు పలు శాఖల అధికారులు ఉన్నారు.

● నాలుగేళ్లుగా దివ్యాంగుల పించన్ రావడం లేదని నాగులుప్పలపాడు మండలం బి. నిడమానూరుకు చెందిన కసుకుర్తి సీతమ్మ ఫిర్యాదు చేశారు. ఫించన్‌పొందేందుకు అర్హత ఉన్నా పట్టించుకోవడం లేదని అవేదన వ్యక్తం చేశారు.

● దర్శి మండలం తానంచింతల గ్రామానికి చెందిన శివయ్య అనే దివ్యాంగుడు మూడు చక్రాల సైకిల్ ఇవ్వాలని కోరారు. ఇలా పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు పలు సమస్యలను అధికారులకు విన్నవించారు.



గ్రీవెన్స్‌లో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఉప్పుగుండూరు మహిళలు

జనావాసాల మధ్యలో మద్యం షాపును ఏర్పాటు చేయొద్దు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : జనావాసాల మధ్యలో మద్యం షాపు ఏర్పాటు చేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మహిళలు డిమాండ్ చేశారు. నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు గ్రామంలోని పురుషోత్తంకాలనీ, ఎస్టీ కాలనీకిచెందిన మహిళలు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్బంగా మహిళలు మాట్లాడుతూ ఈదుమూడి బస్టాండ్ రహదారి కూడలి ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటు చేయడం ద్వారా తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆ మద్యంషాపును పురుషోత్తంకాలనీ, ఎస్టీ కాలనీల మధ్యలో ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. అక్కడ మద్యం షాపు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు అసౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం జేసీ గోపాలకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎం. అనంతలక్ష్మి, రమాదేవి, భాను, ఎం. ఏడుకొండలు తదితరులు ఉన్నారు.

లాటరీలో కారు వచ్చిందని నమ్మించి..

● రూ.1.64 లక్షలు కాజేసిన సైబర్ మోసగాళ్లు

● ఎస్పీకి బాధితుడి ఫిర్యాదు

ఒంగోలుక్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మీకు లాటరీలో ఫ్లిప్‌కార్ట్ ద్వారా కారు వచ్చిందని నమ్మించి రూ. 1.64 లక్షలు జమ చేయించుకొని మోసం చేశారని ఓ బాధితుడు ఎస్పీ వద్ద వాపోయాడు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో నాగులుప్పలపాడుకు చెందిన ఓ బాధితుడు ఎస్పీ వద్ద వాపోయాడు. ఫ్లిప్‌కార్ట్ నుంచి నాగులుప్పలపాడుకు చెందిన వ్యక్తికి ఫోన్ వచ్చింది. మీకు లాటరీలో కారు వచ్చిందని, అందుకు సంబంధించి నగదు కావాలా లేక కారు తీసుకుంటారా? అని అడిగారు. తాను డబ్బులు కావాలని చెప్పాడు. అందుకు సంబంధించిన నగదు జమ చేయడానికి బ్యాంక్ డిటైల్స్ ,ఆధార్, పాన్ కార్డుల నంబర్లతో పాటు ఓ పాస్‌ఫోటో అడిగారు. అనంతరం నగదు జమచేసేందుకు ప్రాసెసింగ్ ఫీజ్ చెల్లించాలని కోరడంతో బాధితుడు విడతల వారీగా రూ.1.64 లక్షలు ఫోన్‌పే ద్వారా చెల్లించానని చెప్పారు. దీంతో నగదు జమ చేసిన తరువాత వారి వద్ద నుంచి ఎలాంటి సమాధానం లేదని ఎస్పీ దామోదర్ వద్ద బాధితుడు వాపోయాడు. అదేవిధంగా చిట్టీపాటల పేరుతో తన వద్ద రూ.5లక్షలు కట్టించుకొని అందుకు సంబంధించిన నగదు అడుగుతుంటే ఇవ్వడం లేదని ఒంగోలుకు చెందిన ఓ మహిళ ఎస్పీ వద్ద ఫిర్యాదుచేసింది. ఇలా జిల్లా నలుమూలల నుంచి 71 మంది ఎస్పీకి తమ ఫిర్యాదులను అందజేశారు. ప్రజాపరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి చట్టపరిధిలో చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఐలు సుధాకర్, సమీముల్లా, సుబ్బారావు, ఎస్సై రజియా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

విలీనం చేయాలని కలెక్టర్‌కు వినతి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : నాగులుప్పలపాడు మండలం కనపర్తి గ్రామపంచాయతీలో నాలుగు గ్రామాలను విలీనం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆగ్రామస్థులు కోరారు. సోమవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి ఆమేరకు వినతిపత్రం అందజేశారు. 29 ఏళ్ళ నుంచి కనపర్తి గ్రామ పంచాయతీ నుంచి ఐదు గ్రామాలతో నూతన పంచాయతీ ఏర్పాటు చేయాలని పోరాటం చేస్తున్నా పట్టించుకోవడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. తోపుపాలెం, పల్లెపాలెం, గోవిందరాజుల పట్టపుపాలెం, మేకల సోమయ్యవారి పట్టపుపాలెం గ్రామాలను కనపర్తి పంచాయతీలో కలిపి ఆయా గ్రామాల అభివృద్ధికిచర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులకు డిక్షనరీ వినియోగంపై తర్ఫీదు ఇవ్వాలి

ఒంగోలు విద్య, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు డిక్షనరీ వినియోగించేలా ఉపాధ్యాయులు తర్ఫీదు ఇవ్వాలని సమగ్రశిక్ష ఏఎంవో ఎం.రమేష్ సూచించారు. స్థానిక పోలీస్ క్వార్టర్స్ లోనిప్రాథమిక పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు లైబ్రరీ పుస్తకాలు వాడుకోనేలా పిరియడ్ కేటాయించాలన్నారు.

నేతలపై కక్షసాధింపు చర్యలు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వైసీపీ నేతలపై కక్షసాధింపు చర్యలు, అక్రమ అరెస్టుల తప్ప ఇచ్చిన వాగ్దానాలను విస్మరించిందని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కాకుమాను రాజశేఖర్ ఆరోపించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

అన్నదానం ప్రారంభం

మద్దిపాడు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మద్దిపాడులోని పాతసిండికేట్ బ్యాంకు సమీపంలో అయ్యప్ప, శివ , భవానీ స్వాములకు సోమవారం అయ్యప్పస్వామి బృందం, అన్నదాన కమిటీ అన్నదానం చేపట్టింది. ఈ కార్యక్రమం 45 రోజుల వరకు సాగుతుందని కమిటీ తెలిపింది.

వెలిగొండ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలి

రైతు సంఘాల నాయకుల డిమాండ్

కంభం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని సోమవారం సీపీఐ, రైతుసంఘాల నాయకులు కంభం తహసీల్దార్ కిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు తక్షణమే ప్రభుత్వం రూ.2వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిద్దలూరు నియోజకవర్గ సీపీఐ సహాయ కార్యదర్శి వి.జోసఫ్, రైతు సంఘం కార్యదర్శి డి.పుల్లయ్య, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి ఆర్. యోగయ్య, వ్యవసాయ సంఘం కార్యదర్శి వి.రంగ య్య పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : పశ్చిమ ప్రకాశానికి వరప్రదాయని అయిన వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ, సీపీఐ నాయకులు సబ్‌కలెక్టర్ వెంకట త్రివినాగ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు అందె నాసరయ్య, కాశీం తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

బేస్తవారపేట : వెలిగొండకు నిధులు కేటాయించాలని, సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ ఏ.జితేంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయింపుతోపాటు ప్రాజెక్టు పరిధిలోని 7500 మంది నిర్వాసితులకు తక్షణమే ఆర్.ఆర్.ప్యాకేజీ ఇవ్వాలన్నారు. అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టు కెనాల్ పనులు పూర్తి చేయాలన్నారు. కాలువలకు అవసరమైన భూసేకరణను వేగవంతం చేయాలన్నారు. ప్రాజెక్టుకు నికర జలాలను కేటాయించాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ ద్వారా తహసీల్దార్ కార్యాలయం చేరుకున్నారు. ఈకార్యక్రమంలో ఏజీటీయూసీ జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, సీపీఐ గిద్దలూరు నియోజకవర్గ కార్యదర్శి వి.జోసఫ్ రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మంత్రుల పర్యటనను విజయవంతం చేద్దాం

పెద్దదోర్నాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతం ప్రజల ఆశలసౌదం వెలిగొండ ప్రాజెక్టు సందర్శనకు వస్తున్న రాష్ట్రమంత్రుల పర్యటనను విజయవంతం చేద్దామని ఎర్రగొండపాలెం ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం కార్తకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు పనులు టీడీపీ హయాంలోనే చురుగ్గా సాగాయన్నారు. వైసీపీ అధికారంలో నత్తనడకన సాగాయన్నారు. ఈ పర్యటనకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, డోలా వీరాంజనేయస్వామి, ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ తమీమ్ అన్సారియా హాజరవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, నాయ కులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని పర్యటనను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, చంటి,షేక్ సమ్మద్ భాష, చల్లా వెంకటేశ్వర్లు, షేక్ ఇస్మాయిల్, భాష, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

మార్కాపురం మున్సిపాలిటీ కార్యాలయం వద్ద కార్మికుల నిరసన

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ గత 13 రోజులుగా మున్సిపల్ కార్యాలయం వద్ద దీక్షలు నిర్వహిస్తున్న కార్మికులు సోమవారం కమిషనర్ ఛాంబర్‌లో బైఠాయించారు. తమ సమస్యలు పరిష్కరించేవరకు ఇక్కడే ఉంటామని భీష్మించుకు కూర్చున్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ మాట్లాడుతూ, కార్మికులు రోడ్లమీద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న అధికారులు, ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ ఘటనపై కమిషనర్ నారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సిబ్బందితో వచ్చి ఛాంబర్‌లో బైఠాయించటం సరికాదన్నారు. ఈ దశలో కార్మికులు పట్టణ ఎస్‌ఐ సైదుబాబు కాళ్లు పట్టుకుని తమ ఉద్యోగాలు తమకు ఇప్పించాలని కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ డీవీఎస్ నారాయణ మాట్లాడుతూ.. కార్మికులను తాము తొలగించలేదని కేవలం పని ఆపామన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం తీసుకుని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వెనుతిరిగారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సోమయ్య, రాజు, నాగరాజు, మున్సిపల్ యూనియన్ నాయకుడు సుబ్బరాయుడు, శేషిరెడ్డి, శేఖర్‌రెడ్డి, యూసుఫ్, చెన్నకేశవులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న కార్మికులు

గిద్దలూరు : సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి టి.ఆవులయ్య ధర్నాలో పాల్గొని మాట్లాడారు. మున్సిపల్ కార్మికులకు ఉపకరణాలు సబ్బులు, బట్టలు, నూనెలు, చెప్పులు అందచేయాలని కోరారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మురళి, పాపయ్య, బాలయ్య, రవికుమార్ పాల్గొన్నారు.

పొదిలి : మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు దార్ల సుబ్బయ్య, బి.కోటేశ్వరరావు కోరారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన కార్యకార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్, బి కోటేశ్వరరావు, జి నాగేశ్వరరావు, పి కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

గిద్దలూరు : సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి టి.ఆవులయ్య ధర్నాలో పాల్గొని మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు పనిముట్లు, సబ్బులు, బట్టలు, నూనెలు, చెప్పులు అందజేయాలన్నారు.

టీడీపీ నాయకులతో మాగుంట చిట్‌చాట్

పొదిలి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక టీ దుకాణం వద్ద టీడీపీ నాయకులతో ముచ్చటించారు. ఒంగోలు నుండి మార్కాపురం వెళుతున్న ఆయన టీడీపీ నాయకులను చూసి ఆగి టీ తాగుతూ కొంతసేపు గడిపారు. అక్కడకు వచ్చిన ప్రజలను కుశల ప్రశ్నలు వేస్తూ పలకరించారు. ప్రస్తుత పరిస్థితులపై నాయకులను అడిగి తెలుసుకున్నారు. అందరిని పలకరించడంతో నాయకులతోపాటు కార్యకర్తలు, ప్రజలు ఆనందంతో పొంగి పోయారు. ఈ సంభాషణలో పొదిలి, కొనకనమిట్ల మండల అధ్యక్షులు మీగడ ఓబులరెడ్డి, మోరబోయిన బాబురావులు ఉన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

● 152 సీసాలు స్వాధీనం

కొనకనమిట్ల, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 28 : మండలంలోని మునగాపాడు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకున్నట్లు అబ్కారీశాఖ సీఐ అరుణకుమారి సోమవారం తెలిపారు. అక్రమంగా బెల్ట్‌దుకాణం నడుపుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసినట్లు తెలిపారు. నిర్వాహకుల వద్ద 152 క్వాటర్ సీసాలు స్వాధీనం చేసుకొని ఒకరిని అదుపులోనికి తీసుకున్నట్లు చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గిద్దలూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు జోన్ ఉప్పర సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీకాళికాంబ దేవాలయం ఆవరణలో జరిగిన ఉప్పర సేవా సంఘ సమావేశంలో అధ్యక్షులుగా దండూరి సోమయ్య, ఉపాధ్యక్షులుగా జి.మద్దులేటి, గౌరవాధ్యక్షులుగా ఎం.రాముడు, ప్రధానకార్యదర్శిగా జె.చిన్నసుబ్బరాయుడు, సహాయ కార్యదర్శులుగా దండెబోయిన రమణ, కె.పెద్దనరసింహులు, కె.వెంకటస్వామి, కోశాదికారిగా కె.మూర్తయ్య, గౌరవ సలహాదారులుగా ఎ.వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వాగు ఆక్రమణలో వెంచర్లు తొలగించాలి

ఎర్రగొండపాలెం(పుల్లలచెరువు), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెంలోని రాళ్లవాగును ఆక్రమించి అక్రమంగా వేసిన రియల్‌ఎస్టేట్ వెంచర్లను తొలగించాలని ఎర్రగొండపాలేనికి చెందిన గుర్రం లక్ష్మీనారాయణ అనే బాధితుడు సోమవారం తహసీల్దార్ బాలకిషోర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో మాజీ మంత్రి సురేష్ ఆయన అనుచరులు కలిసి పుల్లలచెరువు రోడ్డులో రాళ్ళ వాగుపై అక్రమంగా బిడ్జి, రూ.1.50 కోట్లతో రియల్ వ్యాపారులకు ఉపయోగపడేలా పార్కును తెచ్చి వారికి లబ్ధి చేకుర్చారని అన్నారు. పార్కు పేరుతో 4.39 ఎకరాల భూమిని చూపించి 1.30 సెంట్ల భూమిని చూపించి మిగిలిన 3.09 సెంట్ల భూమిని ఆక్రమించుకోని ప్లాట్లు వేశారని అన్నారు. అందుకు అప్పటి రెవెన్యూ అధికారులు, పోలీసులు సహకరించి కోట్ల విలువైన భూమిని కబ్జా చేశారని అన్నారు. వెంటనే అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

కేన్సర్‌పై అవగాహన సదస్సు

బేస్తవారపేట,అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి):బేస్తవారపేట ఐసీడీఎస్ కార్యాలయంలో సోమవారం హెచ్‌సీజీ ఎంఎన్ఆర్ కేన్సర్ వైద్యశాల ఆధ్వర్యంలో సీడీపీవో నీలోఫర్ అధ్యక్షతన కేన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రేష్ఠ మాట్లాడుతూ కేన్సర్ అంటే కణాల అసాధారణ పెరుగుదుల అన్నారు. ఈ సమస్య ఒక అవయవం నుంచి మరో అవయవంపై దాడి చేస్తుందన్నారు. ఇందులో అనేక రకాలున్నాయన్నారు. వాటిలో బ్రస్ట్ కేన్సర్ ఆడవారిలో 25 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల వారికి వచ్చే అవకాశం ఉందన్నారు. అంతేగాక ఆహారపు అలవాట్ల ద్వారా కూడా కేన్సర్ వస్తుందన్నారు. దీనిపై అవగాహన ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమంలో వైద్యశాల మేనేజర్ సంద్రపాటి ప్రభాకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గాలెమ్మ, కార్యకర్తల పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు తర్లుపాడు విద్యార్థి ఎంపిక

తర్లుపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పరుగుపందెంలో రాష్ట్రస్థాయి పోటీలకు తర్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి జి.అజయ్ కుమార్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ముత్తుజు సుధాకర్ తెలిపారు. కందుకూరులో జరిగిన జిల్లాస్థాయి పోటీలలో 3 కి.మీ. పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో అజయ్ పాల్గొంటారన్నారు. అజయ్‌ను పీఈటీ చెంచయ్య నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

ఇంట్లో జారిపడి వృద్ధుడి మృతి

మార్కాపురం రూరల్ అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి). ఇంట్లో జారిపడి వృద్ధుడు గుంటక సత్యనారాయణ(75) మృతిచెందిన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాత్‌రూం వెళుతూ జారిపడి మృతిచెందినట్లు పోలీసులు బావిస్తున్నారు. ఘటన ఐదురోజుల క్రితం జరిగింది. ఇంటి పరిసర ప్రాంతాల్లో దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులు సమాచారం అందించారు. ఎస్సై అంకమ్మరావు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

టీడీపీ సభ్యత్వ నమోదుకు విశేషస్పందన

కంభం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి కంభంలో విశేష స్పందన లభించింది. ముఖ్యంగా కంభం అర్బన్ కాలనీలో టీడీపీ ఎన్ఆర్ఐ ప్రచార కార్యదర్శి సయ్యద్‌రఫీ మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నో పథకాలను ప్రవేశ పెడుతున్నారని తెలిపారు. అందులో భాగంగా టీడీపీ సభ్యత్వం కోసం రూ.100 చెల్లిస్తే సరిపోతుందన్నారు. ప్రతి కార్యకర్తకు రూ.5లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మైనారిటీ విభాగం ప్రధాన కార్యదర్శి దీనా వలి, ప్రచార కార్యదర్శి బేగ్, రైల్వే విశ్రాంత ఉద్యోగి మహబూబ్ బాషా, టీడీపీ సీనియర్ నాయకులు నూరుల్లాఖాద్రి, రజాక్, పిచ్చయ్య ఎంపీటీసీ మాజీ సభ్యుడు అనీస్‌అహమ్మద్ పాల్గొన్నారు.


సభ్యత్వం అందజేస్తున్న రఫీ

ఇంటర్ డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు వినతి

మార్కాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): డివిజన్ కేంద్రమైన మార్కాపురంలో ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం మీ కోసం కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ వెంకట్‌త్రివినాగ్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రధానంగా పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతిదీవెన బకాయిలు విడుదల చేయాలన్నారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలన్నారు. సంక్షేమ హాస్టల్‌లకు సొంత భవనాన్ని ఏర్పాటు చేయాలన్నారు. మెస్ ఛార్జీలను రూ.3 వేలకు పెంచాలన్నారు. జీవో నెంబర్ 77ను రద్దు చేసి పీజీ చదివే విద్యార్థులందరికీ ఫీజ్ రీయంబర్స్‌మెంట్ వర్తింపజేయాలన్నారు. తల్లికి వందనం అమలుపై స్పష్టతనివ్వాలన్నారు. మార్కాపురంలో బీసీ బాలికల వసతిగృహాలను ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డి.సోమయ్య, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి జి.వెంకటశివసాయికుమార్, బి.వెంకట సాయి, వి.శ్రీనివాసులు, పి.జాన్సన్, సీహెచ్ గణేష్, ఎస్.దేవదాసు తదితరులు పాల్గొన్నారు.


అర్జీ అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఫీజు బకాయిలు చెల్లించాలి

గిద్దలూరు : పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా చేశారు. సోమవారం స్థానిక విద్యాశాఖ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాలో ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు తేజ మాట్లాడుతూ విద్యాదీవెన, వసతి దీవెన పథకాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బకాయిలు అన్నింటిని ప్రభుత్వం వెంటనే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు కేటాయించాలని, మెస్‌చార్జీలను రూ.3వేలకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నవీన్, అమర్‌నాథ్, కార్తీక్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ సమస్యల పరిష్కారానికి కృషి

పొదిలి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మైనారిటీలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర మైనారిటీ అధ్యక్షులు మౌలానాముస్తక్ అహమద్ అన్నారు. సోమవారం ఆయన మైనారిటీ నాయకులతో సమావేశమయ్యారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

● వేగం అదుపు తప్పడంతో ఘటన ● ఐదుగురికి గాయాలు

పెదదోర్నాల అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : వేగం అదుపు తప్పిన కారు డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనల్లో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధి లోని చిన్నారుట్ల వద్ద శ్రీశైలం దోర్నాల ఘాట్‌రోడ్డులో సోమవారం చోటుచేసుకొంది. కాకినాడ నుంచి శ్రీశైలం వెళుతుండగా, ఈ ప్రమా దం చోటుచేసుకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న జవ్వాది సత్యారావు, నాగమ్మ, ప్రవళికలకు స్వల్ప గాయాలయ్యాయి. చిన్నారి ప్రవళికకు గాయాలు తీవ్రంగా ఉండడంతో కర్నూలు వైద్యశాలకు సిఫార్సు చేశారు. సున్నిపెంట వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స నిర్వహించారు.

లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించాలి


సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ లోవోల్టేజ్ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం ఆయన విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ట్రాన్స్‌ఫార్మర్ల కొరత, పంటపొలాలకు విద్యుత్ సప్లై సమస్య లేకుండా చూడాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో లోవోల్టేజ్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను తెలిపారు. నియోజకవర్గంలో సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు స్థలసేకరణ చేయాలని, సోలార్ విద్యుత్ సప్లై, వినియోగం తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశంలో మార్కాపురం ఈఈ పి.వి.నాగేశ్వర్‌రావు, గిద్దలూరు డీఈఈ శేషగిరిరావు, కన్‌స్ట్రక్షన్ ఎఇ మురళిమోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మున్సిపల్ స్థలం ఆక్రమణకు యత్నం

● స్థానికుల ఫిర్యాదుతో అడ్డుకున్న అధికారులు

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణంలోని కొండేపల్లి రోడ్డులోని మున్సిపల్ స్థలాన్ని కొంతమంది వ్యక్తులు సోమవారం చదును చేశారు. పాతకాలంలో ఊరికి దూరంగా ఉండే ఈ ప్రదేశంలో సామూహిక మరుగుదొడ్లు ఉండేవి. గత ప్రభుత్వ హయాంలో ఈ స్థలంలో సచివాలయం, గ్రంథాలయం, కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం దాన్ని చదును చేసి ఆక్రమిస్తుండడంతో మున్సిపల్ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో మున్సిపల్ అధికారులు అక్కడకు చేరుకుని మున్సిపల్ స్థలంలో ఎటువంటి పనులు చేయరాదన్నారు. దీంతో ఆ వ్యక్తులు అక్కడ నుంచి వెళ్లిపోయారు.

ఎల్ఐసీ ఏజెంట్ల నిరసన

గిద్దలూరుటౌన్ అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమ వారం ఎల్ఐసీ ఏజెంట్లు నిరసన తెలిపారు. స్థానిక ఎల్ఐసీ కార్యాలయంలో ఏజెంట్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు నర్సిరెడ్డి మాట్లాడుతూ పాలసీలపై జీఎస్‌టి రద్దు చేయాలని, బోనస్‌లు పెంచాలని, ఏజెంట్లకు కమీషన్లు యథావిధిగా ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి రామక్రిష్ణయ్య, ట్రెజరర్ బాబు, ఏజెంట్లు పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై విత్తనాలు

కొమరోలు, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): రైతులకు రాయితీపై ఇస్తున్న పప్పుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షులు డాక్టర్ బోనేని వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని తాటిచర్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతులకు విత్తనాలను సోమవారం పంపిణీ చేశారు.



















వెలిగొండను వెంటనే పూర్తి చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ


ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎంఎల్ నారాయణ

కనిగిరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ చెప్పారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందచేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా పశ్చిమప్రాంత వరప్రదాయిని పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు పూర్తిచేస్తామని ఎన్నికలకు ముందు వైసీపీతోపాటు టీడీపీ వాగ్దానాలు చేసి ప్రజల్ని మోసగిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై రవీంద్రబాబు, కార్యవర్గసభ్యులు యాసీన్, మండలకార్యదర్శి జీపీ రామారావు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలి

పామూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టుకు ప్రభుత్వం తక్షణమే రూ.2 వేల కోట్లు నిధులు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్ మౌలాలి డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అనంతరం తహసీసల్దార్ బీవీ రమణరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు వజ్రల సుబ్బారావు, కే ప్రభాకర్, ఆకుల మోహన్‌రావు, ఆర్ సూరిబాబు, ప్రసాదు, మహేష్ పాల్గొన్నారు. కాగా సీఎస్‌పురంలో వెలిగొండ ప్రాజెక్టు అసంపూర్తి పనులు పూర్తి చేసి నిర్వాసితులను ఆదుకోవాలని కోరుతు తహసీల్దార్ మంజునాధరెడ్డికి సీపీఐ మండల కార్యదర్శి ఎస్‌కేవై పెద మస్తాన్ వినతి పత్రం ఇచ్చారు.

వెంటనే పూర్తి చేయాలి

దొనకొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): దొనకొండ తహసీల్దార్ రమాదేవికి సీపీఐ నేతలు వినతిపత్రం అందజేశారు. వెంటనే వెలిగొండ పూర్తికి కృషి చేయాలని కోరారు. మండల కార్యదర్శి చెన్నుబోయిన గురుమూర్తి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్ కరుణానిధి, నియోజకవర్గ కార్యదర్శి కూరేటి బాలయ్య, ఏఐఎస్ఎఫ్ నాయకులు రామాంజి, మరియదాసు, లక్ష్మీదేవి, ఏసులు, కందుల పెద్దబాలయ్య, మునలయ్య, పెద్ద వెంకటయ్య పాల్గొన్నారు.

ఆ ఆవులకు బూస్టర్ డోస్ వేయాలి

కురిచేడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో లంపి వైరస్ సోకిన ఆవులకు బూస్టర్ డోస్ వ్యాక్సిన్ వేయాలని పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ బేబి రాణి చెప్పారు. ఆవులను వణికిస్తున్న లంపి వైరస్ శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి జాయింట్ డైరెక్టర్ బేబి రాణి స్పందించారు. పొట్లపాడు వచ్చి పరిస్థితిని సమీక్షించారు. ఏడీ నాగేశ్వరరావు ఉన్నారు.

రేషన్ పంపిణీ పర్సంటేజీని పెంచాలి

పీసీపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : రేషన్ పంపిణీలో వచ్చే పర్సంటేజీని పెంచాలని తహసీల్దార్ సీహెచ్ ఉష చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రేషన్‌డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రమేష్ మాట్లాడుతూ ప్రతి డీలర్ స్టాక్ రిజిస్టర్లు నిర్వహించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

ముండ్లమూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఈదర గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్న ఐదుగురు జూదరులను ఎస్‌ఐ వై నాగరాజు తన సిబ్బందితో సోమవారం సాయంత్రం పట్టుకున్నారు. వారి వద్ద రూ.4,170లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఏఎస్‌ఐ వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది మహేష్, ప్రేమానిధి, మరియబాబు, ఎస్‌కేలు ఉన్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇరువురికి తీవ్ర గాయాలు

ముండ్లమూరు, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి) : ముండ్లమూరులో సోమవారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనటంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని సింగనపాలేనికి చెందిన గోపనబోయిన వెంకటరావు, కంచర్ల సుబ్బారావుల బైక్‌లు ఢీకొనడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో వెంకటరావుకు చెయ్యి విరిగింది. గాయపడిన ఇరువురిని మొదట స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం అద్దంకి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

మండలంలోని వేంపాడు వద్ద ముండ్లమూరు గ్రామానికి చెందిన కే హరీష్ అనే ద్విచక్రవాహన చోదకుడు సోమవారం మధ్యాహ్నం అదుపు తప్పి బోల్తా పడటంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 సిబ్బంది అద్దంకి తీసుకు వెళ్లగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ఒంగోలు తరలించారు.

కోర్టు అమీనాకు జైలు

చెల్లని చెక్కు కేసులో శిక్ష విధించిన కనిగిరి కోర్టు న్యాయాధికారి

కనిగిరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : చెల్లని చెక్కు కేసులో కోర్టు అమీనాకు కనిగిరి సివిల్‌కోర్టు న్యాయాధికారి సోమవారం శిక్ష విధించారు. కోర్టు వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం... చీరాల కోర్టు అమీనాగా పనిచేస్తున్న పాలపర్తి ప్రభాకర్‌రావు అనే వ్యక్తి దర్శి ప్రాంతానికి చెందిన దమాముల చిన్నవీరయ్య వద్ద రూ.2లక్షలు అప్పు తీసుకుని చెక్కు ఇచ్చాడు. చిన్నవీరయ్య ఆ చెక్కులను బ్యాంకులో వేయగా అవి బౌన్స్ అయ్యాయి. విచారణలో నేరం రుజువైనందున సోమవారం కనిగిరి జూనియర్ సివిల్ న్యాయాధికారి భరత్‌చంద్ర.. నిందితుడు పాలపర్తి ప్రభాకర్‌రావు(కోర్టు అమీనా)కు శిక్ష విధించారు. నిందితుడు సోమవారం కేసు వాయిదా ఉందని తెలిసినప్పటికీ కోర్టుకు హాజరు కానందున జడ్జి భరత్‌చంద్ర.. నిందితుడ్ని తక్షణమే అరెస్ట్ చేయాలని, నాన్‌బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేయాలని పోలీసులను ఆదేశించారు. పోలీసులు కోర్టులో హాజరు పరిచిన తర్వాత శిక్ష ఎంతకాలం అనేది తెలియచేస్తామని తీర్పు ఇచ్చారు.

పంజాబ్ నేషనల్ బ్యాంక్ వితరణ

తాళ్లూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పుగంగవరం సమీపాన గుంటిగంగ సన్నిధిలో గల తేజా వృద్ధాశ్రమం, ఆ గ్రామంలో ఉన్న పీహెచ్‌సీకి పంజాబ్ నేషనల్ బ్యాంక్ రూ.50వేల ఆర్థిక సాయంతో సామగ్రిని సోమవారం అందజేశారు. వృద్ధాశ్రమానికి 30వేల విలువైన ఫ్రిజ్, పీహెచ్‌సీకి రూ.20 వేల విలువైన బీరువా, మూడుర్యాక్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సర్కిల్ హెడ్ అభిజిత్ సిన్హా, చీఫ్ మేనేజర్ ఉదయ్‌కుమార్, మేనేజర్ నరేంద్ర, వైద్యులు మౌనిక, శ్రీకాంత్‌రెడ్డి, హెచ్‌ఈవో చంద్రశేఖర్‌బాబు, హెచ్‌ఎస్ సుశీల పాల్గొన్నారు.

గుక్కెడు మంచినీళ్లు ఇప్పించండి

దొనకొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మూడేళ్లుగా సాగర్ జలాలు సరఫరా కాకపోవటంతో బోరు నీరు తాగి అనేక వ్యాధులకు గురవుతున్నామని, తమకు గుక్కెడు మంచినీళ్లు ఇప్పించాలని మండలంలోని పెద్దగుడిపాడు గ్రామస్థులు సోమవారం ట్యాంక్‌వద్ద ఆందోళన చేపట్టారు.

పరిమితికి మించి ఆటోలో ఎక్కిస్తే చర్యలు

పీసీపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు తప్పవని ఎస్సై జి.కోటయ్య చెప్పారు. సోమవారం మండలంలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. కూలీలను పరిమితికి మించి ఎక్కించుకుని వెళ్తున్న ఆటోలకు జరిమానా విధించారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

సీఎస్‌పురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ ఆర్ సుమన్ సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ప్రజలకు సోమవారం అవగాహన కల్పించారు. సోషల్ మీడియాలో వివరాలు పోస్టు చేస్తున్నప్పుడు వ్యక్తి గత సమాచారాన్ని పోస్టు చేయరాదన్నారు. సైబర్ మోసానికి గురైతే 1930కు కాల్ చేయాలని సూచించారు.


















క్రీడలు మానసిక వికాసానికి దోహద పడతాయని మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. సోమవారం చుండూరు మండలం యడ్లపల్లిలోని ఆలపాటి వెంకట్రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 68వ అంతర్ జిల్లాల అండర్-17 బాలబాలికల చదరంగం పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు.

-చుండూరు, ఆంధ్రజ్యోతి



విద్యార్థినితో చెస్ ఆడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

అధికార పార్టీలో ఆధిపత్య పోరు..!



- బాపట్లలో కీలక నేతల మధ్య కోల్డ్‌వార్
- బదిలీల విషయంలోనూ నడచిన తకరారు
- ఇద్దరి మధ్య నలిగిపోతున్న యంత్రాంగం
- మద్యం సిండికేట్ అంశంలోనూ జోక్యం

ఇద్దరు నేతల ఆధిపత్యపోరులో భాగంగా యంత్రాంగం నలిగిపోతోంది. కార్యక్రమాల సమాచారం మొదలుకుని, ప్రొటోకాల్ పాటించడం వరకు ప్రతి అంశంలోనూ పైచేయి కోసం పాకులాడడంతో వీరిద్దరి మధ్యలో ఆయా విభాగాల ఉద్యోగులు సతమతమవుతున్నట్లు తెలుస్తోంది. కిందిస్థాయి సిబ్బంది ఉద్యోగుల బదిలీల్లో ఆయా విభాగాల అధిపతులకు కొంతమంది విషయంలో ఇద్దరు నేతలు సిఫారసు చేయడంతో నిర్ణయం తీసుకునే విషయంలో మల్లగుల్లాలు పడాల్సిన పరిస్థితి అధికారులకు ఎదురయింది.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం కొలువుదీరి అంతా నాలుగు నెలలు కాలేదు. అప్పుడే అధికార పార్టీలోని ఇద్దరు కీలక నేతల మధ్య ఆధిపత్యపోరుకు బాపట్ల వేదికగా తెరలేచింది. నిన్న మొన్నటి వరకు జరిగిన ఉద్యోగుల బదిలీలు మొదలుకుని ప్రస్తుతం నడుస్తున్న మద్యం సిండికేట్ వరకు వీరిద్దరి మధ్య కోల్డ్ వార్ నడుస్తూనే ఉంది. రెండు గ్రూపులుగా విడిపోయి బాపట్లలో రాజకీయం చేస్తూ పార్టీ ప్రతిష్టకు మచ్చ తెచ్చేవిధంగా వ్యవహరిస్తున్నారు. ఐదేళ్ల వైసీపీ దుర్మార్గ పాలనతో విసిగిపోయి భారీ మెజారిటీతో వీరికి పట్టం కడితే ప్రజా సమస్యలను గాలికొదిలేసి ఒకరిపై ఒకరు పైచేయి సాధించడం కోసం పోటీ పడుతున్న తీరుపట్ల బాపట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం దక్కాల్సిన ప్రొటోకాల్ విషయంలో తనకు అన్యాయం జరుగుతుందని ఓ నేత బహిరంగంగానే వ్యాఖ్యానిస్తుంటే, నియోజక వర్గంలో తాను చెప్పిందే జరగాలనే ధోరణిని మరో నేత ప్రదర్శిస్తుం డడంతో ఈ విభేదాలు రానున్న రోజుల్లో మరింత ముదిరి పార్టీ పరువు, ఇటు ప్రభుత్వ పరువు బజారున పడుతుందనే ఆవేదనను పార్టీ క్యాడర్ వ్యక్తం చేస్తోంది.

ఉద్యోగుల బదిలీల నుంచే మొదలు....

ఇటీవల జరిగిన ఉద్యోగుల బదిలీల విషయంలో ఇద్దరు నేతల మధ్య అభిప్రాయభేదాలు వచ్చినట్లు తెలుస్తోంది. బాపట్ల నియోజకవర్గ పరిధిలోని ఇద్దరు వీఆర్‌వోల విషయంలో పెద్ద ఎత్తున తకరారు నడవగా అంతిమంగా ఒకరిది పై చేయి అయింది. అప్పటి నుంచి కూడా ప్రతి విషయంలో ఇదే రీతిన వారిద్దరి మధ్య కోల్డ్‌వార్ నడుస్తూనే ఉంది. ఓ దశలో నియోజకవర్గంలో జరిగే బదిలీల విషయంలో ఇంకో నేతను తలదూర్చవద్దని కూడా ముఖం మీదే చెప్పారని సమాచారం. తాజాగా కర్లపాలెం మండలానికి సంబంధించి ఓ సీనియర్ అసిస్టెంట్ డి ప్యుటేషన్ విషయంలో కూడా సదరు నేత అనుచర గణం పైరవీ చేయడంతో ఈ ఆధిపత్యపోరులో భాగంగా అది కూడా త్రిశంకుస్వర్గంలో నిలిచింది

మద్యం షాపుల సిండికేట్ విషయంలో రచ్చ...

ప్రస్తుతం బాపట్ల మార్కెట్ సెంటర్‌లో ఉన్న రెండు మద్యం షాపుల సిండికేట్ వ్యవహారం ఇద్దరునేతల మధ్య ఆధిపత్య పోరుకు మరోసారి వేదికయింది. దాదాపు పదిరోజుల నుంచి ఈ అంశం నడుస్తూనే ఉంది. సిండికేట్ కావాల్సిందేననే ఓ నేత హుకుం జారీ చేస్తుంటే, మరో నేత మాత్రం ఆ ప్రతిపాదనకు వ్యతిరేకంగా సదరు లైసెన్సుదారుడికి మద్దతుగా ఉంటున్నారు. ఈ వివాదం ముదిరి పాకాన పడినట్లు తెలుస్తోంది. బాపట్ల రూరల్‌లో షాపు దక్కించుకున్న ఓ లైసెన్సుదారుడి విషయంలో కూడా ఓనేత ఇదే రీతిన ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. పర్మినెంట్ లైసెన్సుల జారీకి ఇంకా రెండు రోజులే గడువు ఉండడంతో ఈసిండికేట్ రచ్చ వీరి మధ్య ఉన్న విభేదాలను బహిర్గతం చేసే అవకాశం ఉందని కూడా బాపట్లలో జోరుగా ప్రచారం జరుగుతోంది

చంద్రబాబు ఆదేశాలు బేఖాతర్....

ఇసుక, మద్యం విషయంలో నేతల జోక్యం తగదని, గంపెడాశలతో గెలిపించిన ప్రజలకు జవాబుదారీగా ఉండాలని నేతలకు పదేపదే ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి చేస్తూ వస్తున్నారు. కానీ నియోజకవర్గాల్లోని నేతాగణం మాత్రం ఇవేవీ పట్టించుకోకుండా ఏకంగా మద్యం సిండికేట్ విషయంలో పోటీకి దిగుతూ బలనిరూపణకు దిగుతున్న పరిస్థితులు ఉన్నాయి. నిబంధనల ప్రకారం మద్యం షాపులు పెట్టుకోవాలి, అలాకాకుండా ఎక్కడైనా షాపులు పెడితే వారిపై జరిమానాలు విధించడమో లేక కేసులు పెట్టడమో సదరు ఎక్సైజ్ విభాగం చూసుకుంటుంది. కానీ అలా కాకుండా సదరు నేతలే సిండికేట్ పంచాయతీలో తలదూర్చడంతో ముక్కున వేలేసుకోవడం నియోజకవర్గ ప్రజల వంతవుతోంది

నాలుగు నెలల్లోనే పరిస్థితి ఇలా ఉంటే....

గత ప్రభుత్వం అవలంభించిన అప్రజాస్వామిక పోకడలతో విసిగి వేసారిన ప్రజలు ఎన్నో ఆశలతో కూటమి పార్టీలకు పట్టం కట్టారు. ప్రజల వెతలు తీర్చడంలో పోటీ పడాల్సిన నేతలు ఉద్యోగుల బదిలీలు, మద్యం సిండికేట్ విషయంలో పోటీ పడడం చూసి పార్టీ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. సొంత ప్రయోజనాల కోసం నేతల చుట్టూ చేరిన భజనపరులు వీరి మధ్య అంతరాన్ని మరింత పెంచే విధంగా అగ్నికి ఆజ్యం పోస్తూ పబ్బం గడుపుకునే పనిలో బిజీగా ఉంటే, నిజాయితీగా జెండామోసి పార్టీ గెలుపు కోసం కష్టపడిన కార్యకర్తలు మాత్రం బాపట్ల టీడీపీలో జరుగుతున్న పరిణామాల పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు రోజులే గడువు...!

- 31 వరకే మద్యం షాపుల ప్రొవిజనల్ లైసెన్సుల వ్యాలిడిటీ
- నిబంధనలను పరిశీలించి పర్మినెంట్ లైసెన్సు మంజూరు
- 1 నుంచి నూతన లెసెన్సు ఉంటేనే వ్యాపారం
- మరోవైపు సిండికేట్ కోసం కొనసాగుతున్న ఒత్తిళ్లు



బాపట్ల పట్టణంలోని చీలు రోడ్డు సెంటర్‌లో ఏర్పాటు చేసిన మద్యం షాపు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

మద్యం షాపుల ప్రారంభానికి ఇచ్చిన వెసులుబాటు గడువు ఈ నెల 31తో ముగియబోతోంది. లాటరీలో షాపు దక్కించుకున్న లైసెన్సుదారుల సౌలభ్యం కోసం ప్రభుత్వం తాత్కాలిక ప్రాతిపదికన ఇచ్చిన ప్రొవిజనల్ లైసెన్సు గడువు ఈ నెల 31తో ముగుస్తుండగా, నవంబరు1 నుంచి పర్మినెంట్ లైసెన్సు పొందిన వారు మాత్రమే వ్యాపారం చేసే వీలుంటుంది. ఇందుకు సంబంధించి ఎక్సైజ్ శాఖ మార్గదర్శకాల అనుగుణంగా లైసెన్సుదారులు పర్మినెంట్ లైసెన్సు పొందాల్సి ఉంటుంది. ఇంకా రెండు రోజులు మాత్రమే గడువు ఉండడంతో క్షేత్రస్థాయిలో మద్యం షాపుల లోకేషన్‌ను పరిశీలించడానికి ఎక్సైజ్ శాఖ సన్నద్ధమైంది. దీనితో పాటు బ్యాంక్ గ్యారెంటీ, కౌంటర్ పార్టీ అగ్రిమెంట్ ఇతరత్రా డాక్యుమెంట్లన్నీ తనిఖీ చేసి ప్రొవిజనల్ లైసెన్సు స్థానంలో పర్మినెంట్ లైసెన్సును మద్యం వ్యాపారులకు ఎక్సైజ్ శాఖ అందించనుంది. ఈ పదిహేను రోజుల పాటు ఓ చోట షాపు నడిపిన వారు అదే చోట కొనసాగించడానికి విముఖత చూపుతున్నారు. నవంబరు 1 తర్వాత ఏవైనా కారణాల వల్ల షాపు లోకేషన్ మార్చుకోదలచుకుంటే ఎక్సైజ్ శాఖకు లక్షల్లో ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అందుకే లైసెన్సుదారులు ఎక్సైజ్ శాఖకు అందించే లోకేషన్ వివరాల విషయంలో ఆచితూచి అడుగులేస్తున్నారు. కొన్ని చోట్ల ఇంకా సిండికేట్‌లోకి రాని షాపుల విషయంలో ఏదో ఒకరకంగా ఒత్తిడి తెచ్చి అందులో భాగస్వాములను చేయాలనే తెరవెనక ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. మద్యం షాపుల ప్రారంభానికి ఇచ్చిన వెసులుబాటు ఈ నెల 31తో ముగుస్తుండడం, నవంబరు1 నుంచి నిబంధనల పర్యవేక్షణతో పాటు మార్గదర్శకాలన్నింటిని పక్కాగా అమలు చేయడానికి ఎక్సైజ్ శాఖ కసరత్తు చేస్తోంది. సిండికేట్ ప్రతిపాదనలకు కూడా ఈ నెల 31లోగానే ఓ అవగాహనకు వ్యాపారులు వచ్చే అవకాశం ఉంది

సిండికేట్ తేలితేనే....లొకేషన్.

లాటరీలో లైసెన్సు దక్కించుకుని ఈ నెల 15 నుంచే వ్యాపారం మొదలు పెట్టిన వ్యాపారులలో చాలా వరకు సిండికేట్ రూపంలో ఓ అవగాహనకు వచ్చారు. రూరల్ ప్రాంతాలలో అయితే అంతా సిండికేట్ రూపంలోనే అమ్మకాలు సాగుతున్నాయి. ఇలాంటి చోట లోకేషన్ విషయంలో పెద్దగా తకరారు నడవదు. ఎందుకంటే అమ్మకాలలో ఎక్కువ తక్కువలు ఉన్నా సిండికేట్ అవగాహన ఉన్నందువల్ల లాభాలను సమానంగా పంచుకుంటారు. ఇంకా కొన్ని చోట్ల సిండికేట్ పంచాయతీ నడుస్తూనే ఉంది. దీనితో లోకేషన్ విషయంలో వ్యాపారులు ఓ అవగాహనకు రాలేకపోతున్నారు. బాపట్లలోని మార్కెట్ సెంటర్‌లో రెండు షాపులు పక్కపక్కనే ఉన్నాయి. ఇక్కడ సిండికేట్‌కు ఓ గ్రూపు ససేమిరా అనడంతో గడచిన పది రోజులుగా ఈ తకరారు నడుస్తూనే ఉంది. కూటమి పార్టీలోని కీలక నేతలిద్దరూ చెరొకరు తరఫున వకాల్తా పుచ్చుకోవడంతో ఇక్కడ సిండికేట్ సంక్లిష్టంగా మారింది. అదే విధంగా చీరాలలోనూ ఓ రెండు షాపుల విషయంలో సిండికేట్ వివాదం నడుస్తూనే ఉంది. ఈ రెండు రోజుల్లో అవగాహనకు వస్తే లోకేషన్ పట్టింపు లేకుండా పర్మినెంట్ లైసెన్సు కోసం ఎక్సైజ్ శాఖను సంప్రదించే వీలుంది. ఇది తేలకపోతే మాత్రం లోకేషన్ విషయంలో ఇరు గ్రూపులు పట్టుదలకు పోయే అవకాశముందనే ప్రచారం జోరుగా నడుస్తోంది

బ్యాంకు గ్యారెంటీ....లొకేషన్...

పర్మినెంట్ లైసెన్సు కోసం మద్యం వ్యాపారులు లోకేషన్ తెలపడంతో పాటు సదరు షాపు లీజు అగ్రిమెంట్‌ను కూడా ఎక్సైజ్ శాఖకు అందించాల్సి ఉంటుంది. వీటితో పాటు కౌంటర్ పార్టీ అగ్రిమెంట్, బ్యాంక్ గ్యారెంటీతో పాటు ఇతర ప్రక్రియను కూడా పూర్తి చేసి ఆ వివరాలతో ఎక్సైజ్ శాఖకు సమర్పించాలి. వీటిలో ముఖ్యంగా లోకేషన్ విషయంలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో విజిట్ చేసి ప్రభుత్వ నిబంధనల ప్రకారం గుడి, బడితో పాటు ఆసుపత్రికి నిర్దేశిత దూరంలో ఉన్నాయో లేవో తనిఖీ చేయనున్నారు. దీనితో పాటు ఇతర డాక్యుమెంట్లన్నీ కూడా పరిశీలన చేసి మార్గదర్శకాల ప్రకారమే ఉన్నాయనే నిర్ధరణకు వచ్చిన తర్వాతనే పర్మినెంట్ లైసెన్సును మంజూరు చేయనున్నారు. ఎక్సైజ్ శాఖ నుంచి పర్మినెంట్ లైసెన్సు పొందిన వారే నవంబరు 1 నుంచి వ్యాపారం చేయడానికి వీలుంటుంది.

సిబ్బందిని అప్రమత్తం చేసిన ప్రభుత్వం...

నవంబరు 1 నుంచి మద్యం షాపుల విషయంలో ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలన్నింటిని పక్కాగా అమలు చేయాల్సిన బాధ్యత ఎక్సైజ్ విభాగంపైనే ఉంది. ఇందుకు సంబంధించి సిబ్బందిని అధికారులు ఇప్పటికే అప్రమత్తం చేశారు. నిబంధనల ప్రకారం షాపును ఏర్పాటు చేశారా లేదా అనే అంశంతో పాటు పర్మినెంట్ లైసెన్సు పొందకుండా వ్యాపారం చేసే వారిపై కూడా ఈ నెల 1 నుంచి దృష్టి పెట్టాల్సి ఉంది. ఎమ్మార్పీ ఉల్లంఘనలకు తోడు గ్రామాల్లో అనధికారిక బెల్ట్ షాపులు, సమయపాలన పాటించడం వీటన్నింటిపైనా ఎక్సైజ్ శాఖ నిరంతర తనిఖీలకు ఈ నెల 1 నుంచి సమాయత్తం కావాల్సి ఉంది.

రెండు కుటుంబాల మధ్య ఘర్షణ

బల్లికురవ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పుమాగులూరు ఎస్సీ కాలనీలో సోమవారం రెండు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. రెండు కుటుంబాల మధ్య గతంలో ఉన్న పాత గొడవల నేపథ్యంలో మరో మారు ఘర్షణలకు దిగారు. రెండు కుటుంబాల వారు ఫిర్యాదులు ఇచ్చేందుకు ప్రభుత్వ వైద్యశాలలకు చేరినట్లు తెలిసింది.

బైకును ఢీకొన్న ఆటో

మోటర్ సైకిలిస్టుకు గాయాలు

మేదరమెట్ల, అక్టోబరు 28వెళ్తున్న (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిలో గ్రోత్ సెంటర్‌కు వెళ్తున్న మోటర్ సైకిలిస్ట్‌ను ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం ఉదయం అద్దంకి మండలం కొంగపాడు నుంచి గ్రోత్ సెంటర్‌కు మోటర్‌సైకిల్‌పై వెళుతున్న కరి శివరామకృష్ణను ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివరామకృష్ణ గాయపడ్డారు. అతడిని అంబులెన్స్‌లో ఒంగోలుకు తరలించారు.

ముక్తేశ్వరంలో సోలార్ కేబుల్ వైర్లు చోరీ

బల్లికురవ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో ముగ్గురు రైతులకు చెందిన పొలాల్లో సోలార్ కేబుల్ వైర్లను ఆదివారం రాత్రి గుర్తు తెలియని దొంగలు దొంగిలించారు. గ్రామానికి చెందిన అవదానం సుధీర్, శింగంశెట్టి వీరాంజి, కుందుర్తి శ్రీనివాసరావుకు చెందిన సోలార్ వ్యవసాయ విద్యుత్ కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయి. సోమవారం మోటార్లను అన్ చేసేందుకు రైతులు చూడగా కేబుల్ వైర్లు కత్తిరించి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. కొంత కాలం నుంచి మండలంలోని పలు గ్రామాలలో వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లను గుర్తు తెలియని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారని రైతులు వాపోతున్నారు.

మద్యం మత్తులో స్తంభాన్ని ఢీకొట్టిన వ్యక్తి


స్తంభం పక్కన పడిఉన్న నాగేశ్వరరావు

అద్దంకి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తి కరెంట్ స్తం భాన్ని ఢీకొట్టి గాయపడ్డారు. స్థాని కులు తెలిపిన వివరాల మేరకు.. పల్నాడు జిల్లా శావల్యాపురం మండ లం కారుమంచికి చెందిన మల్లవరపు నాగేశ్వరరావు సోమవారం రాత్రి మోటార్‌సైకిల్‌పై అత్తవారి గ్రామమైన చినకొత్తపల్లికి మోటార్‌సైకిల్‌పై వెళుతూ గ్రామం ప్రారంభం లో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. గాయాలైన నాగేశ్వరరావును 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

చికిత్స పొందుతూ మృతి

కుటుంబ సభ్యులను పరామర్శించిన చినహనిమిరెడ్డి

అద్దంకి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన చింతల పెదశ్రీనివాసరావు (43) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. బల్లికురవ మండలం చినజమ్మలమడకకు చెందిన చింతల శ్రీను కుటుంబ సభ్యులకు ఖైలవరానికి చెందిన రైతులు మన్నేపల్లి వెంకటేశ్వర్లు, మారుతీరావు, కనపర్తి అర్జున్, చినజమ్మలమడకకు చెందిన పరిమి సుబ్బారావు, ముట్లూరి అంజయ్యతో కొన్ని సంవత్సరాలుగా భూ వివాదం ఉంది. ఈ నేపథ్యంలో ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం అద్దంకి పట్టణంలోని దర్శి రోడ్డులో గుండ్లకమ్మ నది వద్ద పురుగు మందును కూల్ డ్రింక్‌లో కలుపుకొని తాగాడు. అద్దంకిలో కొద్ది రోజుల చికిత్స అనంతరం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఒంగోలు రిమ్స్ లోని శ్రీనివాసరావు మృతదేహానికి అద్దంకి వైసీపీ ఇన్‌చార్జి పాణెం చినహనిమిరెడ్డి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. శ్రీనివాసరావు మృతికి కారకులైన వ్యక్తులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని హనిమిరెడ్డి డిమాండ్ చేశారు. పోలీసులు టీడీపీ నేతలకు తొత్తులు గా మారారని విమర్శించారు.

విద్యార్థులకు తప్పిన ప్రమాదం

చినగంజాం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఉప్పుగుండూరు గ్రామం నుంచి విద్యార్థులతో వస్తున్న పాఠశాల బస్సు కాలువలోకి దూసుకెళ్లిన సంఘటన మున్నంవారిపాలెం గ్రామ సమీపంలోని ఆక్వా చెరువుల వద్ద సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు ఆక్స్‌ఫర్డ్ పాఠశాలకు చెందిన బస్సు విద్యార్థులతో చినగంజాం బయలుదేరింది. 216వ నెంబరు జాతీయరహదారి నుంచి మున్నంవారిపాలెం గ్రామం వైపు వెళ్తుండగా బస్సు స్టీరింగ్ పట్టివేయడంతో అదుపు తప్పి ఆక్వా చెరువుల వద్ద గల మురుగు కాలువలోనికి వెళ్లింది. బస్సులో చినగంజాం, మున్నంవారిపాలెం, సోపిరాల, కడవకుదురు గ్రామాలకు చెందిన 35 మంది విద్యార్థులు, పలువురు ఉపాధ్యాయులు ఉన్నారు. ఘటనలో విద్యార్థులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఎస్‌ఐ శీలం రమేష్ పరిశీలించారు. ప్రమాద కారణాలను అడిగి తెలుసుకున్నారు.

మద్యం దుకాణంపై ఫిర్యాదు


అసిస్టెంట్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

చీరాలటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం ఈపూరుపాలెం - తోటవారి పాలెం రోడ్డులో మద్యం దుకాణం నిర్వహణ అన్యాయమని పలువురు నాయకులు పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అనసూయ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజా మోహిద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ సుమారు 200 మంది ముస్లింలు ప్రార్థనలు చేసే మసీద్ ప్రాంతంలో మద్యం షాప్ ఏర్పాటు సరికాదన్నారు. కార్యక్రమంలో దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షుడు జిలానీ, జిలానీ బేగ్, అబ్దుల్ ఖాదర్, రవిశంకర్ పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో నాణ్యమైన దిగుబడులు

చినగంజాం, అక్టోబరు 28 (ఆంధ్రజోతి) : ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునని డీపీఎం వాణిశ్రీ అన్నారు. రాజుబంగారుపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న ఆకుకూరలు, వరి పంటలను సోమవారం ప్రకృతి వ్యవసాయాధికారులు పరిశీలించారు. అనంతరం రైతులతో జరిగిన సమావేశంలో డీపీఎం మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలన్నారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గిస్తే ఆరోగ్యవంతమైన పంటలు సాగవతాయన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలు ఆరోగ్యానికి ఎంతో మేలన్నారు. ప్రకృతి వ్యవసాయం వలన కలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పించారు. పలు సూచనలు సలహాలు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం మోహన్, ఎస్ఎఫ్ఏ వర్ధనమ్మ, గ్రామ ఇన్‌చార్జ్ లక్ష్మీ, రైతులు కొనసం శ్రీనివాసరెడ్డి, మునిస్వామి, బాబులు, రాజు శ్రీనివాసరెడ్డి, రత్నారెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

భోజనం రుచిగా, శుచిగా ఉండాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో

బల్లికురవ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మెనూ ప్రకారం రుచిగా, శుచిగా మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఎంఈవో రమేష్ కోరారు. సోమవారం ముక్తేశ్వరం ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈవో పరిశీలించారు. అనంతరం విద్యార్థులను బోజనం ఎలా ఉంది అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రుచిగా భోజనం అందిస్తే ఎక్కువ మంది పిల్లలు స్కూల్ వద్దనే భోజనం చేస్తారన్నారు. హెచ్ఎం హరిబాబు పాల్గొన్నారు.

సంధికాల భత్యం ఎప్పుడో?

- ఎదురు చూస్తున్న మత్స్యకారులు
- రూ.20వేలు ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ
- నేటికీ అమలు కానీ వైనం
- వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి


ఒడ్డున ఉన్న పడవలు (ఫైల్)

చీరాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 74 కిలో మీటర్ల సముద్ర తీరంలో 15 వేలమంది మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. వారంతా సముద్రంలో వేటాడి జీవిస్తుంటారు. ఏటా ఏప్రిల్ 15వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ వరకు సముద్రంలో వేట నిషేధం. అది మత్స్య సంపద పునరోత్పత్తి జరిగే సమయం. ఈ కాలంలో మత్స్యకారులు జీవన అభివృద్ధి కోసం గత ప్రభుత్వం నెలకు ఒక్కొక్కరికీ రూ.5వేలు చొప్పున రెండు నెలలకు రూ.10 వేలు అందిస్తూ వచ్చారు. కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు రూ.20 వేలను ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే నేటికీ హామీ అమలు కాలేదు. నెల రోజుల నుంచి సముద్ర అంతర్ గర్భంలో తీవ్ర మార్పులు వచ్చాయని వేట కూడా సక్రమంగా సాగడం లేదని మత్స్య సంపద వలలకు చిక్కడం లేదు. దీంతో మత్స్యకారులు తమ జీవనభృతికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన చెందుతున్నారు. భృతి కోసం అప్పులు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇదిలావుంటే పెరిగిన సరుకుల ధరలకు ఇబ్బంది పడుతున్నారు. వెంటనే ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. నవంబరు 21వ తేదీన ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం లేదా సంక్రాంతి భత్యం అందేవిధంగా ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. అప్పటివరకు తమ పరిస్థితి ఏమిటని మత్స్యకారులు ప్రశ్నిస్తున్నారు. సంధి భృతిని ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని ఆశిద్దాం.

ఆ రీసర్వేను రద్దు చేయండి

- రైతులందరికీ న్యాయం చేయండి
- తహసీల్దార్‌కు రాచపూడి గ్రామస్థుల విజ్ఞప్తి


రీ సర్వేను రద్దు చేయాలని తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రాచపూడి రైతులు

మేదరమెట్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో నిర్వహించిన రీ-సర్వే తప్పులతడకగా ఉందని, దానిని రద్దు చేయాలని కోరుతూ తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డికి రాచపూడి రైతులు వినతిపత్రం అందజేశారు. సోమవారం మండల కార్యాలయానికి వచ్చిన రాచపూడి గ్రామ రైతులు రీ సర్వే గ్రామ సభలో అందిన అర్జీలను తహసీల్దార్‌కు వివరించారు. రీ సర్వేకు ముందు ఉన్న పూర్వ స్థితికి రికార్డులను మార్చాలని కోరారు. అప్పట్లో గ్రామస్థుల వద్ద సర్వే అధికారుల డబ్బులు తీసుకొని ఇష్టానురీతిన మార్చారని వారు ఆరోపించారు. తన అక్క పేరుతో పొలం, పాస్‌బుక్ ఉండగా ఆ పేరుతో ఎక్కించాలని అర్జీ ఇస్తే తనపేరు మీద మార్చారని ఓ రైతు తహసీల్దార్‌కు చెప్పారు. ఉన్నదానికి తక్కువగా, తక్కువ దాన్ని ఎక్కువగా మార్చారన్నారు. కొత్త పాసుపుస్తకాలను చూస్తే రైతులకు పాలుపోని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మా గ్రామంలోనే 300 పైగా అర్జీలు ఇచ్చారంటే రీ సర్వే తప్పులు ఏ స్థాయిలో జరిగాయో అర్థం చేసుకోవాలని కోరారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అందరికీ న్యాయం చేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు.


శిథిలమైన కల్వర్టు పాత ఫొటో


నిర్మాణమైన తర్వాత

హమ్మయ్య కల్వర్ట్ కట్టారు

ఎమ్మెల్యే ఏలూరి చొరవతో పూర్తయిన నిర్మాణం

ఇంకొల్లు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు నుంచి తిమ్మసముద్రం మీదుగా చీరాల వెళ్లే రహదారిలో కల్వర్ట్ శిథిలమై రాకపోకలు స్తంభించాయి. ప్రయాణికుల ఇబ్బందులను తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వెంటనే కల్వర్టును నిర్మించాలని అధికారులకు సూచించారు. ఎట్టకేలకు నిర్మాణం పూర్తికావడంపై ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నాలుగైదు నెలల కిందట కల్వర్ట్ శిథిలమై రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్సులు సైతం గొల్లపాలెం మీదుగా తిరిగాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎమ్మెల్యే సూచన మేరకు నిర్మాణం పూర్తయింది. తిరిగి ఆ రోడ్డులో రాకపోకలు సాగుతున్నాయని మండల ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు మోహనకృష్ణ కోరారు.


నోటు పుస్తకాలతో విద్యార్థులు

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

జాగర్లమూడి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో యద్దనపూడి మండలం జాగర్లమూడి హైస్కూల్‌లోని 90మంది విద్యార్థులకు సోమవారం నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. రొటేరియన్ నాగబడి సుబ్బారావు ఆర్థిక సహకారంతో నోట్‌పుస్తకాలు, పెన్నులు, ఇతర సామగ్రిని క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ అన్నారు. అందజేశారు. కార్యక్రమంలో కోమటి ఆంజనేయులు, సత్యనారాయణ, సదానందరెడ్డి, పోలిశెట్టి చంద్రశేఖర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి

ఇంకొల్లు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఏపీఎం అనూరాధ కోరారు. వెలుగు కార్యాలయంలో గ్రా మైక్య సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘ సభ్యులకు స్త్రీనిధి, మహిళల జీవనోపాధిపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సీసీ లు, సిబ్బంది పాల్గొన్నారు.


సమీక్షలో మాట్లాడుతున్న న్యాయాధికారి శాంతి

లోక్ అదాలత్‌పై న్యాయాధికారి సమీక్ష

పర్చూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : డిసెంబర్ 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌పై కోర్టు భవనాల సముదాయంలో జూనియర్ సివిల్ న్యాయాధికారి పీ శాంతి సమీక్ష నిర్వహించారు. రాజీకి అవకాశమున్న క్రిమినల్ కేసుల్లో ఇరువర్గాలతో మాట్లాడి వారి అంగీకారంతో కేసులను పరిష్కరించాలన్నారు. రాజీ వల్ల ఇరువర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా పోలీసు అధికారులు కృషి చేయాలని న్యాయాధికారి శాంతి సూచించారు. ఈ సమీక్షలో ఎస్ఐ మాల్యాద్రి, డి.రత్నకుమారి, కారంచేడు ఏఎస్సై జీవీ మధుబాబు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

అద్దంకి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక మంగళవారం ఉదయం 11 గంటలకు అద్దంకి తహసీల్దార్ కార్యాలయంలో ప్రారంభమవుతుందని తహసీల్దార్ శ్రీచరణ్ తెలిపారు. చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు హాజరవుతారని, ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా అందజేయాలని కోరారు.

మునిసిపల్ టీచర్లకు శుభవార్త

పదోన్నతుల షెడ్యూల్ విడుదల

ఒంగోలు విద్య, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ యాజమాన్యంలోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. మునిసిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లకు ప్రభుత్వం ప్రమోషన్ల షెడ్యూల్ ప్రకటించింది. మునిసిపల్ టీచర్ల సమస్యల పరిష్కారానికి సంబంధించి జరిగిన చర్చల్లో వెంటనే ఉద్యోగోన్నతులు ఇస్తామని పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు హామీ ఇచ్చారు. ఆ మేరకు షెడ్యూల్ విడుదల చేయడం పట్ల యూటీఎఫ్ నాయకులు, మునిసిపల్ టీచర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మునిసిపల్ ఉపాధ్యాయుల నియామకాలు, పదోన్నతులు అన్ని గతంలో మునిసిపల్ అధికారులే నిర్వహించేవారు. అయితే గత ప్రభుత్వం వారి సర్వీసులను పాఠశాల విద్య పరిధిలోకి తెచ్చింది. ప్రభుత్వ, పంచాయతీరాజ్ టీచర్ల తరహాలో మునిసిపల్ టీచర్లకు కూడా 010 పద్దు కింద జీతాలు చెల్లిస్తున్నారు. ప్రభుత్వ, జడ్పీ యాజమాన్య టీచర్లతో స మానంగా ప్రస్తుతం మునిసిపల్ యాజమాన్యంలోని పాఠశాలలకు స్కూలు అసిస్టెంట్లకు హెచ్‌ఎంలుగా, ఎస్జీటీలకు స్కూలు అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తున్నారు. హెచ్ఎంల పదోన్నతులను పాఠశాల విద్య ఆర్జేడీలు, స్కూలు అసిస్టెంట్ పదోన్నతులకు డీఈలు నిర్వహిస్తున్నారు. మునిసిపల్ టీచర్ల ఉద్యోగోన్నతుల షె డ్యూల్‌ను కమిషనర్ విజయరామరాజు సో మవారం విడుదల చేశారు. ఈనెల 28 నుంచి స్కూలు అసిస్టెంట్ నుంచి హెచ్ఎంలు, ఎస్జీటీల నుంచి స్కూలు అసిస్టెంట్ల ప్రాథమిక సీనియారిటీ జాబితాలను విడుదల చేస్తారు. ఈనెల 28 నుంచి 1 వరకు ప్రాథమిక సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. 4న హెచ్ఎంలు, స్కూలు అసిస్టెంట్ల ప్రమోషన్లకు తుది సీనియార్టీ జాబితా ప్రకటిస్తారు.

క్యాంపు రాజకీయాలకు వైసీపీ శ్రీకారం

- జడ్పీని కాపాడుకునేందుకు గోవా టూర్
- ఎనిమిది నెలలు దాటితే అవిశ్వాసానికి అవకాశం
- ఈలోపే కొత్తచట్టం తెచ్చే ఆలోచనలో కూటమి ప్రభుత్వం
- తెలుగుదేశం పార్టీకి టచ్‌లో పదిహేను మంది
- జనసేనలో చేరిన బాలినేనితో మరికొందరు
- క్యాంపునకు వెళ్లింది సుమారు 30మందే
- మాట మేరకే విహారయాత్ర, క్యాంపు
- రాజకీయం కాదు: బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఉమ్మడి జిల్లాలో కీలకమైన జిల్లా పరిషత్ చేజారకుండా చూసుకునేందుకు వైసీపీ క్యాంపు రాజకీయానికి శ్రీకారం చుట్టింది. అమల్లో ఉన్న నిబంధనల మేర కు మరో ఎనిమిది నెలలు దాటితే ప్రస్తుత జడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మా నం పెట్టేందుకు అవకాశం ఉంది. ఈలోపు కూటమి ప్రభుత్వం నిబంధనలను సడలిస్తే ఎప్పుడైనా ప్రవేశపెట్టవచ్చు. దీనికితోడు ఇప్పటికే టీడీపీలో చేరిన వారికి తోడు మరి కొందరు జడ్పీటీసీ సభ్యులు టీడీపీ నేతలకు చేరువవుతున్నారు. ఇటీవల జనసేనలో చేరిన మాజీమంత్రి బాలినేనికి మరికొందరు టచ్‌లో ఉన్నారు. ఈ నేపథ్యంలో అప్పుడెప్పుడో ఇచ్చిన హామీ అంటూ జడ్పీటీసీ సభ్యులను భారీ విహారయాత్రకు తీసుకెళ్లటం విశేషం.

వరుసగా చేజారుతుండటంతో

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం దిగిపోయి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత స్థానిక సంస్థలు వైసీపీ చేజారిపోవటం ప్రారంభమైంది. ఒంగోలు కార్పొరేషన్, గిద్దలూరు నగర పంచాయతీలు పూర్తిగా టీడీపీ వశంకాగా మండల పరిషత్‌ల్లో అత్యధిక భాగం వైసీపీ ప్రతినిధులు టీడీపీ ఎమ్మెల్యేలతో చేతులు కలిపేశారు. సర్పంచులైతే బహిరంగంగానే టీడీపీ ఎమ్మెల్యేలు, నేతలతో చెట్టాపట్టాలేసుకొని తిరుగుతున్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల భర్తీకి సిద్ధమైంది. ఈ నేపథ్యంలో కీలకమైన జడ్పీ చైర్‌పర్సన్ వ్యవహారం కూడా చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఉమ్మడి జిల్లాలోని టీడీపీ ప్రజాప్రతినిధులు స మావేశమై నామినేటెడ్ పదవులపై, కీలక అంశాలపై చర్చించుకొని ఐక్యంగా ముందుకు పోయేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. దీంతో జడ్పీ వ్యవహా రం కూటమి పార్టీలోనే కాక మొత్తం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

మారుతున్న బలబలాలు

జిల్లా పరిషత్ చైర్మన్‌ను జడ్పీటీసీ సభ్యులు ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో పొదిలికి ఎన్నికలు జరపకపోగా మిగిలిన స్థానాల్లో అప్పుడు వైసీపీనే గెలుచుకుంది. అందులో ముగ్గురు సభ్యులు ఇటీవల కాలంలో మృతిచెందారు. పోతే మిగిలిన సభ్యుల్లో ఎన్నికలకు ముందే గిద్దలూరు నియోజకవర్గంలో ఇద్దరు, దర్శి, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో ఒకొక్క జడ్పీటీసీ బహిరంగంగానే టీడీపీలో చేరిపోయారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత మరికొందరు టీడీపీ ఎమ్మెల్యేలకు దగ్గరయ్యారు. అలాంటి వారు ఎనిమిది నుంచి పది మంది కనిపిస్తున్నారు. వివిధ కారణాలతో వైసీపీకి దూరంగా ఉంటున్న వారు ఉన్నారు. ఇదేసమయంలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి జనసేనలో చేరడంతో ఆయనతో కొందరు టచ్‌లో ఉన్నారు. కాగా బాలినేనికి దర్శి ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డిలకు మధ్య కొంతకాలంగా దూరం పెరిగింది. కారణం ఏమైనా బాలినేని కూడా వైసీపీలోని ఎంపీపీలు, జడ్పీటీసీలను జనసేనలోకి తీసుకెళ్లే ప్రయత్నంలో ఉన్నారు. ఒంగోలు నియోజకవర్గంలో వైసీపీకి చెందిన ఒక జడ్పీటీసీ ఎమ్మెల్యే జనార్దన్‌కు టచ్‌లో ఉండగా మరో జడ్పీటీసీ భర్త వైసీపీలో ఉన్నప్పటికీ ఇటు బాలినేనితోను అటు ఎమ్మెల్యే జనార్దన్‌తో టచ్‌లో ఉండడం విశేషం. ఎస్ఎన్‌పాడు, పర్చూరు, దర్శి, మార్కాపురం, గిద్దలూరు, కొండపి, వైపాలెం నియోజకవర్గాల్లోని కొందరు జడ్పీటీసీ సభ్యులు బాలినేనికి టచ్‌లో ఉన్నారు. అలాంటి వారి సంఖ్య ఇప్పటికీ పది మంది వరకు ఉందని సమాచారం. ఇక వైసీపీలో ఉన్నప్పటికీ అద్దంకి నియోజకవర్గంలో మారిన రాజకీయ పరిణామాల్లో అవసరమైతే బాచిన చైతన్యకు అనుగుణంగా మరో ముగ్గురు జడ్పీటీసీలు టీడీపీకి జైకొట్టే ఉద్దేశంతో ఉన్నారు. చీరాలలో ఉన్న ఇద్దరు జడ్పీటీసీలు మాజీ ఎమ్మెల్యే ఆమంచికి టచ్‌లో ఉండటం విశేషం. కందుకూరు నియోజకవర్గంలో ఒక జడ్పీటీసీ చనిపోగా మిగిలిన వారిలో కొందరు ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డితో ఉండగా అక్కడ పార్టీ బాధ్యతలు బుర్రా మధుసూదన్ చూస్తున్నారు. ఇలా లోతుగా అన్నీ విషయాలను పరిగణనలోకి తీసుకొని పరిశీలిస్తే కూటమి పార్టీలకు జడ్పీటీసీల మద్దతు పెరిగిపోతుండటంతో వైసీపీ నాయకులు కలవరపడుతున్నారు.

అవిశ్వాస తీర్మానంపై చర్చ

కాగా ప్రస్తుత నిబంధనల మేరకు చైర్‌పర్సన్ స్థానంలో ఉన్న వారి పదవీకాలం నాలుగేళ్లు పూర్తయ్యే వరకు వారిపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు అవకాశం లేదు. ప్రస్తుత చైర్‌పర్సన్ వెంకాయమ్మ బాధ్యతలు చేపట్టి మూడేళ్ల మూడు నెలలు దాటింది. దీంతో మరో ఆరేడు నెలల తర్వాత కూటమి పార్టీలు రంగంలో దిగి అవిశ్వాస తీర్మానం పెడితే పరిస్థితి ఏమిటి? అదేవిధంగా సమయాన్ని తగ్గిస్తూ కూటమి ప్రభుత్వం సవరణ నిబంధన తెచ్చేందుకు అవకాశం లేకపోలేదు. ఆ వైపు అడుగులు వేయబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో చైర్మన్ వెంకాయమ్మతోపాటు ఆమె కుమారుడు దర్శి ఎమ్మెల్యే శివప్రసాద్ రెడ్డి జడ్పీటీసీ సభ్యులను విహారయాత్రకు తీసుకెళ్లేందుకు భారీ ఏర్పాట్లతో కుటుంబ సభ్యులతో సహా రావాలని ఆయన ఆహ్వానించి అక్కడ ఏర్పాట్లు చేశారు. మొత్తంపై 70మందికి పైగా వెళ్లినప్పటికీ అందులో జడ్పీటీసీలు 30 లేక 32 మంది అని అంటున్నారు. టీడీపీలో చేరిన వారు కాక వైసీపీలో ఉండి కూడా వెళ్లని జడ్పీటీసీల సంఖ్య పదికిపైగా కనిపిస్తోంది. గోవా వెళ్లిన వారిలో కొందరు స్థానిక టీడీపీ నాయకులతో టచ్‌లో ఉండటం విశేషం. మున్ముందు జడ్పీ పరిణామాలు ఎలా మారుతాయో కానీ ప్రస్తుతానికి వైసీపీ రాజకీయ క్యాంపు వ్యవహారంతో వాతావరణం వేడెక్కింది. కాగా తాము చైర్మన్‌గా తన తల్లి బాధ్యతలు తీసుకున్న సమయంలోనే జడ్పీటీసీలను గోవా విహారయాత్ర తీసుకెళ్తానని హామీ ఇచ్చానని ఆ మేరకు తీసుకెళ్లామని శివప్రసాద్‌రెడ్డి చెప్పటం విశేషం.

నేడు మెగా జాబ్ ఫెయిర్

అద్దంకి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి నియోజకవర్గంలోని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక చొరవతో మంగళవారం అద్దంకిలో మెగా జాబ్ ఫెయిర్ జరగనుంది. నాగులపాడు రోడ్డులోని కామేపల్లి కల్యాణ మండపం లో ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే మెగా జాబ్ ఫెయిర్‌కు 25 కంపెనీల ప్రతినిధులు వస్తున్నారు. సుమారు వెయ్యి మందికి పైగా ఉద్యోగ అవకాశాల కల్పించేందుకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నారు. 10వ తరగతి, ఇంటర్, డిప్లమో, బీటెక్, ఎంటెక్, డిగ్రీ, పీజీ, ఫార్మా కోర్సులు 2016 నుంచి 2024 సంవత్సరాల మధ్య పూర్తి చేసిన నిరుద్యోగులు జాబ్ ఫెయిర్‌కు హాజరు కావాలని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర సూచించారు. హాజరయ్యే నిరుద్యోగులకు భోజన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం

బాపట్ల జిల్లా నూతన కమిటీ

అద్దంకిటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రెవెన్యూ భవనంలో ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం (ఏపీఎస్‌జీఆర్‌ఈఏ) రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అద్దంకి, మార్టూరు, ఇంకొల్లు మండల శాఖల పక్షాన బాపట్ల జిల్లా శాఖ-2 అధ్యక్షుడిగా రావులపల్లి బాపయ్యను, కార్యదర్శిగా కరి కమలేశ్వరరావును, కోశాధికారిగా అద్దంకి చెందిన పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తిని నియమిస్తూ తీర్మానం చేశారు. నూతన కమిటీ సభ్యులను అద్దంకి శాఖ అధ్యక్షుడు షేక్ మస్తాన్, కార్యదర్శి కృష్ణయ్యతో పాటు మార్టూరు, ఇంకొల్లు సభ్యులు అభినందనలు తెలిపారు.

మా బిడ్డను ఆదుకోండి

కలెక్టర్‌కు నిరుపేద చేనేత కుటుంబం వినతి


విలేకరులతో మాట్లాడుతున్న బాధిత కుటుంబ సభ్యులు

బాపట్లరూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పుట్టుకతో దివ్యాంగురాలైన తమ బిడ్డను ప్రభుత్వం ఆదుకోవాలంటూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో కలెక్టర్‌కు నిరుపేద చేనేత కు టుంబం వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణంలో విలేకరులతో మాట్లాడుతూ వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం పంచాయతీ చేనేతపురి గ్రామానికి చెందిన మేము ఆర్థిక పరిస్థితులు సవ్యంగా లేని కారణంగా మానసికంగా, శారీరకంగా దివ్యాంగురాలైన నాకూతురు ఉషాను పోషించకలిగే శక్తి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. నా భర్త వెంకటసుబ్బయ్య హృదయ సంబంధిత వ్యాధితో అనారోగ్యానికి గురికావటం కుటుంబాన్ని కష్టాలలోకి నెట్టేసిందని తెలిపారు. దివ్యాంగురాలైన నాకూతురుకు వచ్చే పెన్షన్ సరిపోవడంలేదు. తమకు ప్రభుత్వం ఆదుకోవాలని కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు.

హడలెత్తిస్తున్న హైవే

- రోడ్లపై గుంతలు, పగుళ్లు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- భారీగా టోల్ వసూళ్లు
- పట్టించుకోని నిర్వాహకులు

మేదరమెట్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేందుకు ప్రభుత్వాలు బిల్ట్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ (బీవోటీ) పద్ధతిలో రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దేశంలోని జాతీయ రహదారులన్నీ ఈ పద్ధతిలో నిర్మిస్తారు. విజయవాడ నుంచి నెల్లూరు వరకు 6 లైన్ల రహదారిని జాతీయ రహదారుల నిర్మాణ సంస్థ ఇదే పద్ధతిలో నిర్మించింది. 2012-14 లో ఆరు లైన్ల రహదారి పూర్తి చేసి టోల్ ఫీజును వసూలు చేస్తున్నారు. మూడేళ్లుగా ఈ రహదారి తరచూ మరమ్మతులకు గురవుతోంది. నిర్వహణ అంతంతమాత్రంగా ఉంది. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డంతోపాటు చాలాచోట్ల పగుళ్లు ఇచ్చింది. మేదరమెట్లలోని ఫ్లైవోవర్ కిందగా ఒంగోలుకు వెళ్లే రోడ్డులో పెద్ద గుంత ఏర్పడి చాలా కాలమైంది. అయినా పట్టించుకోలేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల గతంలో అ రకొర మరమ్మతులు చేసినా ఇటీవల కురిసిన వానలకు కొరిశపాడు - ఒంగోలు రోడ్డు దెబ్బతింది. కొన్ని చోట్ల కుంగడం, తారు అంతా ఒకచోటకి చేరడంతో రహదారి గుంతలమయంగా మారింది. 100 కిలో మీటర్ల వేగం తో వెళ్లే కార్లు ఈ రోడ్డులో అదుపుతప్పుతున్నాయి. గుంతను చూసి డ్రైవర్ మలుపుతిప్పే క్రమంలో వెనుక వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. బొల్లాపల్లి టోల్‌ప్లాజా వద్ద అత్యధికంగా టోల్‌ను వసూలు చేస్తు న్నారు. కాంట్రాక్టర్ మరమ్మతులు కూడా చేపట్టక పోవడంపై వాహనదారులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారిలో ప్రయాణించే బారీ వాహనాలు, లారీలు, నాలుగు చక్రల వాహనాలు ఈ గుంటలతో అవస్థలు పడలేక పోతున్నామంటున్నారు. ఈ రోడ్డు వేసి పది సంవత్సరాలు పైగా అవుతున్న ఒక్కసారి కూడా పూర్తి లేయర్ వేయలేదు. ఇప్పటికైన హైవే అధికారులు స్పందించి వాహనదారులకు ఇబ్బంది లేకుండా రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.



మేదరమెట్ల - తిమ్మనపాలెం మధ్య హైవే రోడ్డుపై ఏర్పడిన గుంతలు, పగుళ్లు



మేదరమెట్ల జాతీయ రహదారిలో అండర్ పాస్ వద్ద వాహనదారులకు ఇబ్బంది కరంగా ఉన్న గుంత

దివ్యాంగుల ఎదుగుదలకు కృషి చేయాలి

పంగులూరు, అక్టోబరు, 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, దాతల సహకారంతో దివ్యాంగ బాల బాలికల ఎదుగుదలకు అర్పీలు కృషి చేయాలని ఎంఈవో-2 జీ.వీరాంజనేయులు కోరారు. మండల కేంద్రమైన పంగులూరులోని భవిత విద్యా వనరుల కేంద్రానికి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దేవరపల్లి శ్రీదర్‌బాబు, ఇందిరా ప్రియదర్శిని దంపతులు దివ్యాంగ బాల బాలికల శారీరక వ్యాయామం కోసం రూ.15వేల విలువ చేసే జంపిగ్ వాల్‌ను బహూకరించారు. భవిత కేంద్రంలో ముగ్గురు దివ్యాంగ చిన్నారులు శిక్షణ పొందుతున్న టి.శ్రీను, రాజ్యలక్ష్మి కుటుంబానికి బియ్యం, కందిపప్పు, వంటనూనె, కూరగాయలు అందచేశారు. కేంద్రంలో రికార్డులు పరిశీలించిన ఎంఈవో సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫిజియో థెరపిస్ట్ ఇందిరా ప్రియదర్శిని, హెచ్‌ఎం బి.లలితకుమారి, మాధవి, ఉన్నత పాఠవాల ప్రత్యేక ఉపాధ్యాయులు బాస్కరమూర్తి, ఐఈడీ అర్పీ పి.యోహాన్, టి.అరుణ, అంగన్‌వాడీ సిబ్బంది సరోజిని, కల్పన, దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పారిశుధ్య పనులు చేయిస్తున్న పంచాయతీ అధికారులు

సమస్యలపై విచారణ

- అధికారుల సందర్శన
- తోటవారిపాలెంలో పారిశుధ్యం నిర్వహణ

తోటవారిపాలెం(చీరాలటౌన్), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు అధికార యంత్రాంగం చీరాల మండలం తోటవారిపాలెం పంచాయతీ వీవర్స్‌కాలనీ ప్రజల సమస్యలపై దృష్టి సారించింది. సోమవారం ఆంధ్రజ్యోతిలో మాగోడు పట్టించుకోండి.. శీర్షికన వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. సోమవారం కాలనీని పరిశీలించారు. ప్రధాన సమస్యలను స్థానికులతో మాట్లాడి తెలుసుకున్నారు. గ్రామంలోని పలు వీధులలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఫీవర్ సర్వే నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భారతి, సచివాలయం-2 కార్యదర్శి మేఘజ్యోతి, ఏఎన్‌ఎం ఏసుమ్మ, సీహెచ్‌వో అర్చన, వీఎస్ శివదుర్గ, మహిళా మండలి సభ్యురాలు ఆకురాతి సుకీర్తన, ఆశా వర్కర్‌లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్డీవో

చీరాలటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : చీరాల ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు సోమవారం కలెక్టర్ వెంకట మురళిని మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యలను స్వీకరించిన ఆర్డీవో తిరుపతి ప్రోటోకాల్ నుంచి బదిలీపై చీరాల బాధ్యతలు స్వీకరించగా ఇప్పటి వరకు విధుల్లో ఉన్న దేవరకొండ అఖిల రామచంద్రపురం బదిలీ అయ్యారు. ఈమేరకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.



కలెక్టర్ వెంకటమురళికి మొక్కను అందజేస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

చినగంజాం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో బుధవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎ.శ్రీనివాస మూర్తి తెలిపారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు కోమట్ల అంకమ్మరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం

అద్దంకిటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో సోమవారం రక్తదానం చేశారు. డెంగ్యూ జ్వరంతో ప్లేట్ లెట్స్ పడిపోయి రక్తం అవసరమైన గోపాలపురానికి చెందిన నూతలపాటి హరిబాబుకి రోటరీ క్లబ్ కార్యదర్శి చుండూరి మురళి సుధాకరరావు ప్రోత్సాహంతో అద్దంకికి చెందిన గుమ్మడి సుబ్బారావుతో రక్తదానం చేయించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, సిందిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'మానవులందరికీ భగవద్గీత' పుస్తకం ఆవిష్కరణ

అద్దంకిటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్, స్థానిక ధార్మిక సంస్థల ప్రతినిధులచే సోమవారం డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ రచించిన మానవులందరికీ భగవద్గీత అనే పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు కో ఆర్డినేటర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. భగవద్గీతలోని 18 అధ్యాయాల విషయాల ను క్రోడీకరించి సామాన్య ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులకు దాని సారం చెప్ప డమే పుస్తకం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాలకు 30 వేల పుస్తకాలు పంపించినట్లు చెప్పారు. పుస్తకాలు కావాల్సిన పాఠశాల యాజమాన్యం, ప్రధానోపాధ్యాయులు స్కూల్ ముద్ర వేసి, సంతకం చేసి ఈ పుస్తకాలను ఉచింగా పొందవచ్చునన్నారు. బల్లికురవ 9989543467, సంతమాగులూరు 9133456969, మార్టూరు 6300363963, పంగులూరు 8977788209 నెంబర్లకు సంప్రదించాలని కోరారు. వివరాలకు 9848418538 నెంబరును సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో జ్యోతిచంద్రమౌళి, డాక్టర్ దేవపాలన, రామాంజనేయులు, అన్నమనేని వెంకట్రావు, దివాకర్ దత్తు, రఘురామశర్మ పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సంస్థల ప్రతినిధులు

గ్రామాలలో భగవద్గీత ప్రచారం

మార్టూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నరసరావుపేట కమిటీ సభ్యులు సోమవారం మండలంలోని రాజుగారిపాలెం, ద్రోణాదుల గ్రామాలలో భగవద్గీత ప్రచారం నిర్వహించారు. దీపావళి పండుగ సందర్భంగా భగవద్గీత పుస్తకాలను ఇంటింటికీ పంచిపెడుతూ ప్రచారం నిర్వహించారు. దీపావళి పండుగలోని పరమార్థం తెలుసుకోవాలని, అందరూ ఇంట్లో, బయట దీపాలను వెలిగించడం వల్ల జ్ఞానసముపార్జన కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు పెద్దిరెడ్డి, రమేష్, రామయ్య, భాస్కరరావు, అశోక్, రాజశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థుల సౌకర్యార్థం బస్సు ఏర్పాటు

ముందుకొచ్చిన కొండమంజులూరు చారిటబుల్ ట్రస్ట్

పంగులూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండమంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల రాకపోకల కోసం కొండమంజులూరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బస్ సౌకర్యం కల్పించారు. ట్రస్ట్ ఛైర్మన్ గ్రామానికి చెందిన బొప్పుడి నాగేశ్వరరావు రూ.10 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన బస్సును సోమవారం ట్రస్ట్ ప్రతినిధి సంజీవరాయుడు, స్థానిక నాయకులతో కలిసి ప్రారంబించారు. ఈ బస్సు ఏర్పాటుతో పరిసర గ్రామాలైన భగవాన్‌రాజుపాలెం, బైటమంజులూరు, కోటపాడు గ్రామాలకు చెందిన సుమారు 150 మంది విద్యార్థులు సల్ప వ్యయంతో పాఠశాలకు చేరుకునే అవకాశం కల్పించారు. పాఠశాల హెచ్‌ఎం ఐ.అణిత మాట్లాడుతూ ఇప్పటివరకు విద్యార్థులు ఈ బస్సు ఏర్పాటుతో సౌకర్యం లభించిందన్నారు. తల్లి వనజాక్షమ్మ జ్ఞాపకార్థం బస్సును ఏర్పా టు చేసిన నాగేశ్వరరావును హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చింతల సహదేవుడు, ఎస్‌ఎంసీ ఛైర్మన్ గోలి సంధ్యారాణి, వైస్ ఛైర్మన్ రావుల నరసింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




స్కూల్ బస్సును ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

అయ్యప్ప స్వామి దేవాలయంలో అన్నదానం

అద్దంకి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ సమీపంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో దీక్షధారులకు సోమవారం నుంచి అన్నదానం ప్రారంభించారు. డిసెంబర్ 14వ తేదీ వరకు 48 రోజుల పాటు అన్నదానం కొనసాగుతుందని అయ్యప్పస్వామి దేవస్థానం వ్యవస్థాపక అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి తెలిపారు. కార్యక్రమంలో వల్లెపు వెంకటేశ్వర్లు, శేషమ్మ దంపతులు, కమిటీ సభ్యులు పరుచూరి లక్ష్మీశ్రీనివాసరావు, తిరుపతిరెడ్డి గురుస్వామి, రామలింగేశ్వరరావు, బాపయ్య, అంజయ్య, పూజారి భాగవతుల మాలకొండాచార్యులు పాల్గొన్నారు.



అన్నదానంలో పాల్గొన్న దీక్షధారులు



సోమశిలలో 65.320 టీఎంసీల నీరు

అనంతసాగరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి సోమవారం 19,559 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 65.320 టీఎంసీలు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 50, కండలేరుకు 10,000, ఉత్తర కాలువకు 300 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

కంటైనర్ టెర్మినల్ పునరుద్ధరిస్తాం

● సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి ● పోర్టు సీఈవోతో చర్చలు

ముత్తుకూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అదానీ కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ పునరుద్ధరించి తీరుతామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఆయన బీజేపీ, జనసేన, సీపీఎం, సీపీఐ, ఇతర పార్టీల నేతలతో కలిసి పోర్టు సీఈవో జగదీష్ పటేల్‌ను కలిసి చర్చలు జరిపారు. అనంతరం మాట్లాడుతూ వేలాది ఎకరాలను త్యాగం చేసి కృష్ణపట్నం పోర్టు అభివృద్ధికి సహకరించిన స్థానికులపై బొగ్గు బూడిద చల్లి, ఉపాధి అవకాశాలను కల్పించే కంటైనర్ టెర్మినల్‌ను తమిళనాడుకు తరలించడం దారుణమన్నారు. దేశంలోనే అత్యుత్తమ పోర్టుగా కృష్ణపట్నం పోర్టు నిలవడంతో కీలకపాత్ర పోషించిన కంటైనర్ టెర్మినల్‌ను కాటుపల్లి, ఎన్నూరు పోర్టులకు తరలించడం సరికాదని ఆయన అన్నారు. ఒకవైపు పరిశ్రమల స్థాపనతో ఉపాధి అవకాశాలను పెంపొందించే క్రిష్ సిటీ ప్రారంభోత్సవానికి వస్తున్న ప్రధానికి, ఉపాధి కల్పించే కంటైనర్ టెర్మినల్‌ను మూసివేశామని చెబుతూ ఆదానీ యాజమాన్యం ఆహ్వానం పలుకుతారా ? అని ప్రశ్నించారు. కృష్ణపట్నం పోర్టులో యథా ప్రకారం కంటైనర్ టెర్మినల్‌ని పునరుద్ధరించి, సేవలు కొనసాగించాలని సీఈవోని సోమిరెడ్డి కోరారు. తాను ఈ విషయాలన్నింటినీ అదానీ యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లి కంటైనర్ టెర్మినల్ కొనసాగేలా చూస్తామని సీఈవో హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. పోర్టు యాజమాన్యం కంటైనర్ టెర్మినల్ కొనసాగించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూసి భవిష్యత్తు కార్యక్రమం నిర్ణయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సురేంద్ర, వెంకటేశ్వరరెడ్డి, బీజేపీ నాయకులు ఆంజనేయులురెడ్డి, రవీంద్రరెడ్డి, జనసేన నాయకులు సురేష్‌నాయుడు, సీపీఐ నాయకులు శంకర్, కిషోర్, సీపీఎం నాయకులు మోహన్‌రావు, శ్రీనివాసులు, స్థానిక నాయకులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, కోదండయ్య, తదితరులు పాల్గొన్నారు.

● పదివేల మంది పొట్టకొడతారా ?

లాభాలు ఆర్జించి పెట్టే కంటైనర్ టెర్మినల్‌ను పక్క రాష్ట్రానికి తరలించి, దానిపై ఆధారపడి జీవించే పదివేలమంది పొట్టకొడతారా.. ? అని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కంటైనర్ టెర్మినల్ ఇక్కడి నుంచి తరలిపోవడంతో వృత్తి నిపుణులు, పట్టభద్రుల నుంచి లారీ డ్రైవర్ల వరకు 10వేల మంది ఉద్యోగాలు కోల్పోయారన్నారు. భూములు, గ్రామాలను ఈ ప్రాంత రైతులు త్యాగం చేస్తే మీరు కంటైనర్ టెర్మినల్ మూసేసి వారి పొట్టకొడతారా? అని మండిపడ్డారు. అవసరమైతే అదానీ కాళ్లు పట్టుకుంటాం.. లేదంటే పోరాటానికి దిగుతాం తప్ప, గత ప్రభుత్వంలో పాలకుల మాదిరిగా అబద్ధాలతో కాలయాపన చేయబోమన్నారు.

● మీడియాకు నో ఎంట్రీపై ఆగ్రహం

పోర్టులో చర్చల సందర్భంగా మీడియా వాహనాన్ని అనుమతించకపోవడంపై సోమిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పోర్టు యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడామని, మీడియా ప్రతినిధులు పరిపాలన భవనంలో వేచి ఉంటారని చెప్పినా, సెక్యూరిటీ డీజీఎం అడ్డుపడడంపై మండిపడ్డారు. వెంటనే మీడియా ప్రతినిధుల వాహనాన్ని పరిపాలన భవనం వద్దకు అనుమతించాలని సూచించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి, ఎస్ఐలు శ్రీనివాసులురెడ్డి, విశ్వనాథ్‌రెడ్డిలు పోర్టు సెక్యూరిటీ సిబ్బందితో మాట్లాడి పక్కకు తీసుకెళ్లడంతో పరిస్థితి సద్దుమణిగింది.



పోర్టు సీఈవో జగదీష్ పటేల్‌తో మాట్లాడుతున్న సోమిరెడ్డి, తదితరులు

అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా తయారైంది సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(సీఆర్ఎఫ్) రోడ్ల పరిస్థితి. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కరూపాయి ఇవ్వాల్సిన అవసరం లేకుండా మొత్తం నిధులను

● ప్రారంభం కాని రహదారుల రద్దుకు ప్రభుత్వం ఆదేశం ● 25 శాతంలోపు జరిగినవి కూడా ఈ జాబితాలోకే..!

● జిల్లాలో నాలుగు కీలక రోడ్లకు గండం ● వీటి విలువ రూ.120 కోట్లకు పైగానే..

● రాజకీయ నేతల జోక్యమే కారణం ● ఇప్పుడు హడావిడి చేస్తున్న ఆర్అండ్‌బీ అధికారులు

కేంద్రం ఇస్తున్నా చేయడానికి కష్టం

సీఆర్ఎఫ్ రోడ్లు రద్దు



ఇందుకూరుపేట మండలం నరసాపురంలో రోడ్డు విస్తరణలో భాగంగా మట్టిని ఊడ్చుతున్న యంత్రం

కేంద్ర ప్రభుత్వమే అందిస్తున్నా, జిల్లాలో కీలకమైన రోడ్లను అభివృద్ధి చేసుకోలేకపోతున్నారు. నాడు వైసీపీ నేతలు రోడ్లను భ్రష్టుపట్టించి పోగా, ఇప్పుడు కొందరు టీడీపీ నేతలు కూడా అదే దారిలో నడుస్తున్నారు. ఈ ధోరణి కేంద్ర ప్రభుత్వ వర్కులపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

నెల్లూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం సీఆర్ఎఫ్ కింద ఏటా కొన్ని రోడ్లను మంజూరు చేస్తుంటారు. వాటిని ఎప్పటికప్పుడు పూర్తి చేసుకుం టుంటే ఆ మరు సటి ఏడాది మరికొన్ని రోడ్లకు అనుమతులు వస్తుంటాయి. కానీ జిల్లా లో రెండేళ్ల క్రితం అనుమతులు ఇచ్చిన వర్కు లు ఇంతవరకూ మొదలు కాలేదు. ఈ నేపథ్యంలో కొత్త వర్కులు కేంద్రం నుంచి మంజూరు చేయించుకునేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో అసలు ప్రారంభం కానీ, 25 శాతం లోపు పనులు జరిగిన వర్కులను రద్దు చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఆ జాబితాను పంపాలంటూ జిల్లా ఆర్అండ్‌బీ శాఖకు ఉత్తర్వులు పంపింది. కీలకమైన నెల్లూరు-మైపాడు, నెల్లూరు-పొదలకూరు-సైదాపురం, గూడూరు-తురిమెర్ల, కలిగిరి-ఓబులేటి వారిపాలెం రోడ్లు ఇప్పుడు రద్దయ్యే ప్రమాదం కనిపిస్తోంది. ఈ నాలుగు రోడ్ల విలువ సుమారు రూ.120 కోట్లు ఉంటుంది. రాజకీయ నేతల జోక్యం లేకుండా ఉన్నా, ఆర్అండ్‌బీ అధికారులు నిబంధనల ప్రకారం నడుచుకొని ఉన్నా ఈ పాటికి ఈ వర్కులు 50 శాతం పనులు జరిగి ఉండేవి. రద్దయ్యే అవకాశం ఉండేది కాదు.

ఎవరికి వారే.. అంటే! [heading partially illegible]

జిల్లా పర్యాటకాభివృద్ధిలో నెల్లూరు-మైపాడు రోడ్డు చాలా కీలకమైంది. ఈ రోడ్డును విస్తరించి అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సీఆర్ఎఫ్ కింద రూ.48 కోట్లు మంజూరు చేసింది. ఏడాది క్రితం ఈ రోడ్డుకు టెండర్ పిలిచారు. అయితే మూడు రోజుల క్రితం వరకూ పనులు మొదలు కాలేదు. టెండర్ల సమయం నుంచే ఈ రోడ్డుకు గ్రహణం పట్టింది. నాడు ఐదు గురు కాంట్రాక్టర్లు టెండర్లు వేసి అంతా రింగ్ అయ్యి ఎక్సెస్‌కు దక్కించుకున్నారు. అందరూ తలా కొద్దిగా పని చేసేలా అనధికార ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందుకు నాటి వైసీపీ నేతలు మధ్యవర్తిత్వం చేశారు. అయినా రాజకీయ కారణాలతో వైసీపీ ప్రభుత్వంలో ఈ రోడ్డు పనులు మొదలుపెట్టలేదు. ఇక కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ఈ రోడ్డుకు రాజకీయ గ్రహణం వీడలేదు. కోవూరులో కీలకంగా వ్యవహరిస్తున్న ఓ కాంట్రాక్టర్ ఈ రోడ్డు పని మొత్తాన్ని దక్కించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. 'ఆంధ్రజ్యోతి' కథనాలతో ఈ ప్రయత్నాలకు బ్రేకులు పడ్డాయి. ఎట్టకేలకు రెండు వారాల క్రితం కోవూరు ఎమ్మెల్యే ఈ వర్కుకు శంకుస్థాపన చేశారు. ఇన్ని రోజులు పనులు మొదలుపెట్టకపోవడంపై ప్రశాంతిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ప్రారంభం కాని సీఆర్ఎఫ్ వర్కులు రద్దు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత

(మిగతా 6వ పేజీలో)

ఆత్మకూరు పూర్వ ఆర్డీవోపై చార్జెస్ ఫ్రేమ్

● పది రోజుల్లో వివరణ ఇవ్వాలని ఉమాదేవికి ఆదేశం

నెల్లూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పూర్వ ఆర్డీవో పీ ఉమాదేవిపై చార్జెస్ ఫ్రేమ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం జీవో విడుదల చేసింది. ఆత్మకూరులో పనిచేసిన సమయంలో ఆమె పలు అవకతవకలకు పాల్పడ్డారని ఏసీబీ అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. పది రోజుల్లో రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలని, లేనిపక్షంలో అందుబాటులో ఉన్న వివరాల ఆధారంగా చర్యలు తీసుకుంటామని ఉత్తర్వుల్లో పేర్కొంది. 2019-20 సంవత్సరాల్లో ఆత్మకూరు ఆర్డీవోగా ఉమాదేవి పనిచేశారు. ఆ సమయంలో ఓ వ్యక్తి తాను ఏసీబీ అధికారినంటూ, రూ.లక్ష ఇవ్వాలంటూ ఆర్డీవోను బెదిరించారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు తెలియజేయాల్సి ఉండగా, ఉమాదేవి ఆ పనిచేయకుండా, రూ.25 వేలను సదరు నకిలీ ఏసీబీ అధికారి అకౌంట్‌కు జమ చేశారు. ఇది మొదటి తప్పుగా ఏసీబీ అధికారులు నివేదికలో పేర్కొన్నారు. అలానే ఉన్నతాధికారుల ఉత్తర్వులు లేకుండా ఓ రిటైర్డ్ తహసీల్దార్‌ను నియమించుకొని ఆర్డీవో కార్యాలయంలో పనిచేయించుకుంటున్నారు. ఈ విషయం ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీల్లో వెలుగు చూసింది. దీనిపై కూడా చార్జస్ ఫ్రేమ్ చేశారు. లేట్ డెత్, లేట్ బర్త్ రిజిస్ట్రేషన్ల వ్యవహారంలో కూడా ఉమాదేవి నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకుగానూ చార్జస్ ఫ్రేమ్ చేశారు.

విత్తన దుకాణాల తనిఖీ

60 దుకాణాల్లో 47 నమూనాల సేకరణ

నాణ్యత లేకపోతే చర్యలు : డీఏవో

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా సోమవారం విత్తన విక్రయ దుకాణాల్లో ముమ్మరంగా తనిఖీలు సాగాయి. పలు ప్రాంతాల్లో విత్తనాలు మొలకెత్తలేదన్న విమర్శలు రావడంతో జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి ఆదేశాల మేరకు, మండల వ్యవసాయాధికారులు ఈ తనిఖీలు నిర్వహించారు. విత్తన నాణ్యత రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్‌లతోపాటు కొనుగోలు చేసిన రైతుల వివరాలు, బిల్లు పుస్తకాలను పరిశీలించారు. మొలకశాతం 80శాతం కంటే ఎక్కువగా ఉన్న నాణ్యమైన విత్తనాలను మాత్రమే అమ్మాలని, ప్రతి లాట్‌లో విత్తనాల మొలకశాతాన్ని పరీక్షించాలని వ్యాపారులకు సూచించారు. సుమారుగా 60 దుకాణాల్లో తనిఖీలు చేపట్టి, 47 విత్తన నమూనాలను సేకరించారు. వీటి నాణ్యతను పరిశీలించేందుకు ఆయా నమూనాలను ప్రయోగశాలలకు పంపించనున్నారు. విత్తనాల్లో నాణ్యత లేదని ధ్రువీకరణ జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఏవో సత్యవాణి దుకాణాల నిర్వాహకులు, డీలర్లను హెచ్చరించారు. అధీకృత డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలని రైతులకు సూచించారు. ఆబిల్లును, విత్తనాల సంచులను పంట సీజను ముగిసే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. నారు పోయకముందే 100 విత్తనాల మొలక శాతాన్ని పరిశీలించాలన్నారు.

● విత్తనాల కొరత లేదు

రబీ సీజన్‌కు జిల్లాలో విత్తన కొరత లేదని డీఏవో తెలిపారు. జిల్లాలో ఎక్కువగా సాగు చేసే వరి విత్తనాలైన బీపీటీ -5204 3వేల క్వింటాళ్లు ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే ఆర్ఎన్ఆర్-15048 రకం 7500 క్వింటాళ్లు, కేఎన్ఎం-1638 రకం 8700 క్వింటాళ్లు, ఎన్ఎల్ఆర్-34449 రకం 1660 క్వింటాళ్లు, ఇతర రకాలు మరో 2500 క్వింటాళ్లు రైతులకు అందుబాటులో ఉన్నాయని ఆమె వివరించారు.



ఊరంతా చదువుకున్నోళ్లే !

ఆ ఊరిలో అంతా చదువుకున్నోళ్లే... ఎంతలా అంటే ప్రతి పది ఇళ్లలో ఓ ఉద్యోగి ఉండేలా.. అంతేకాదండోయ్.. ఆ గ్రామం నెల్లూరు రూరల్ మండలంలోనే అతి పెద్దదట. ఆ పల్లెలో చదుకున్నవారంతా వ్యవసాయం కూడా చేస్తారట. ఇది మరీ ఆశ్చర్యం...! ఇక్కడ రైతులు, రైతు కూలీలు, చేనేత కార్మికుల సంఖ్య కూడా ఎక్కువేమరి. నాటి తరం సినీనటి వాణిశ్రీని ఆ ఊర్లోళ్లు అడగ్గానే హైస్కూలు పెట్టించిదట. ఆ ఊరే సౌత్‌మోపూరు.

6 లో..

డీఆర్వో బాధ్యతల స్వీకరణ

నెల్లూరు హరనాథపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో)గా ఉదయభాస్కర్‌రావు సోమవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఆయన పశ్చిమ గోదావరిలో డీఆర్వోగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. నెల్లూరులో డీఆర్వోగా పనిచేస్తున్న లవన్న జీఏడీలో రిపోర్టు చేశారు. బాధ్యతలు చేపట్టిన డీఆర్వోకి కలెక్టరేట్ ఏవో పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

యథేచ్ఛగా ఇసుక దోపిడీ

● యంత్రాలతో బయట ప్రాంతాల్లో డంపింగ్ ● రాత్రికిరాత్రే లారీల్లో అక్రమ రవాణా

కలువాయి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నాబద్వేలు సమీపంలోని పెన్నానది ఒడ్డున ఉన్న భూముల నుంచి భారీగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఎక్స్‌కవేటర్‌తో ట్రాక్టర్లకు ఇసుక లోడ్ చేసి బయటకు తరలించి పెద్ద ఎత్తున డంప్ చేస్తున్నారు. అక్కడ నుంచి రాత్రికిరాత్రే లారీలకు లోడ్ చేసి అక్రమ రవాణా చేస్తున్నారు. కొందరు అక్రమార్కులు వారం రోజులుగా ఈ వ్యవహారం సాగిస్తున్నారు. మండల పరిధిలో రాజుపాళెం నుంచి తెలుగురాయపురం వరకు సుమారు 20 కిలోమీటర్ల దూరం పెన్నానది ఉంది. గతంలో కొందరు పెన్నా పరివాహక ప్రాంతం నుంచి రాత్రిళ్లు ఒకట్రెండుచోట్ల మనుషులతో ట్రాక్టర్లుకు ఇసుక లోడ్ చేసుకుని లోకల్‌గానే అమ్ముకుని జేబులు నింపుకునేవారు. అయితే కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని ప్రవేశపెట్టాక లోకల్‌గా ఇసుకకు డిమాండ్ తగ్గిపోవడంతో బయటకు ప్రాంతాల కు లారీలతో తరలించి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు.



కలువాయి : ట్రాక్టర్‌కు ఇసుక లోడ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్

రీచ్‌లోకి యంత్రాలు దించితే సీజ్ : నారాయణ



నెల్లూరు (వెంకటేశ్వరపురం) అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఉచితంగా ఇసుకను అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని భగత్‌సింగ్‌కాలనీ, బోడిగాడితోట, గాంధీ గిరిజనకాలనీ, పొర్లుకట్ట, పొట్టేపాళెం, దీన్‌దయాళ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ట్రాక్టర్ ఎక్కి ఇసుక లోడింగ్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పెన్నాలోని రీచ్‌ల్లోకి ఎట్టి పరిస్థితుల్లో యంత్రాలను దించరాదని ఆదేశించారు. అలా ఎవరైనా చేస్తే వెంటనే వాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. నగరంలో నాలుగు రీచ్‌లను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడా కూడా ఇసుక అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిపోకుండా పోలీసులు గట్టి నిఘా పెట్టాలని ఆదేశించారు. మంత్రి వెంట టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనావాసు లరెడ్డి, కమిషనర్ సూర్యతేజ, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, నారాయ ణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, విజేత రెడ్డి తదితరులు ఉన్నారు.

● బాణసంచా దుకాణాల ఏర్పాటులో నిబంధనలు బేఖాతర్

● నగరంలోని ప్రధాన కూడళ్లలోనే ఏర్పాటు

● లాటరీ పూర్తికాక ముందే విక్రయాలు

● రాజకీయ నేతల హామీతో ఇష్టానుసారం

● లబోదిబోమంటున్న లైసెన్సుదారులు

అడిగేదెవరు...? అంతా మా ఇష్టం !



మినీ బైపాస్‌లోని జీపీఆర్ కల్యాణ మండపం వద్ద అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణం

నెల్లూరు(క్రైం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దీపావళి వస్తుందంటే రెవెన్యూ, ఫైర్, పోలీసు శాఖల సమన్వయంతో లైసెన్సులు మంజూరు చేసి, లక్కీడిప్ ద్వారా దుకాణాలను కేటాయిస్తారు. దుకాణాలు ఏర్పాటుచేసే ప్రాంతంలోనూ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. అయితే నిబంధనలు గాలికి వదిలి.. అంతా మా ఇష్టం అంటూ జిల్లావ్యాప్తంగా అనధికార టపాసుల దుకాణాలను ఏర్పాటు చేశారు. నెల్లూరులో ఆర్డీవో సమక్షంలో లాటరీ తీసి, దుకాణాలు కేటాయించకముందే సోమవారం మధ్యాహ్నం నుంచే అంగళ్లు ఏర్పాటు చేసి విక్రయాలు ప్రారంభించారు.

● ముందే ఏర్పాటు

దుకాణాలకు దరఖాస్తు చేసుకున్న కొందరు వ్యాపారులు రాజకీయ నేతల అండతో దుకాణాలకు లక్కీడిప్ నిర్వహించకముందే ఆదివారం నుంచి ప్రధాన కూడళ్లలో బాణసంచా దుకాణాల ఏర్పాటుకు టెంట్లు సిద్ధం చేసుకున్నారు. సోమవారం మధ్యాహ్నం నుంచే విక్రయాలు సాగించారు. ఈ విషయమై కొందరు పోలీసు, రెవెన్యూ, ఫైర్ అధికారులు ప్రశ్నిస్తే తాత్కాలిక లైసెన్సు ఉందికదా ..? మిగిలిన విషయాలు మా నాయకుడు చూసుకుంటాడులే.. అంటూ సమాధానమిచ్చారు.

● సాధారణ వ్యాపారులు లబోదిబో

అధికారులు అడిగిన అన్నీ పత్రాలు సమర్పించి, లక్కీడిప్‌లో దుకాణాలు పొందిన సాధారణ వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా ప్రధాన కూడళ్లలో దుకాణాలు ఏర్పాటు చేయడాన్ని చూసి

(మిగతా 6వ పేజీలో)

ఆ ఊరిలో ఒకరిద్దరు కాదు.... ఏకంగా 80 మంది వరకు ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. విదేశాల్లో 30 మంది, సాఫ్ట్‌వేర్ రంగల్లో 60 మంది, ప్రైవేట్ రంగ సంస్థల్లో వందకు పైగానే ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిందరి విద్యకు గ్రామంలోని వాణిశ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్ పునాదులు వేయగా, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉన్నతవిద్యకు చేయూతనందించింది. ఆ ఊరే నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్‌మోపూరు. వ్యవసాయ, చేనేత రంగాలకు ప్రసిద్ధిగాంచిన ఈ ఊరు మండలంలోనే అతిపెద్దది. 1300 కుటుంబాలు ఉన్నగ్రామంలో ప్రతి ఇంట్లోనూ చదువుకున్నవారు, ప్రతి పది ఇళ్లలోనూ ఒకరు ఉద్యోగిగా ఉండటం గమనార్హం.

ఉద్యోగుల ఊరు.. సౌత్‌మోపూరు



మరో కోణం

- గ్రామంలో 80 మంది వరకు ప్రభుత్వ ఉద్యోగులు
- సాఫ్ట్‌వేర్ రంగంలో మరో 60 మంది
- వందమందికిపైగా ప్రైవేటు సంస్థల్లో పనిచేసేవారు
- విదేశాల్లోనూ 30 మందికి కొలువులు
- విద్యకు జీవం పోస్తున్న 'వాణిశ్రీ' హైస్కూల్
- ఉన్నత విద్యకు జూ. కళాశాల చేయూత



ఉద్యోగులెక్కువ...

మా ఊళ్లో ఉద్యోగులు ఎక్కువ. గ్రామంలోనే హైస్కూల్, కాలేజీలున్నాయి. ప్రతి ఇంట్లో పిల్లలు బడికి వెళ్తారు. ఇక్కడ చదువులు అయిపోయాక బయట చదువుకుని ఉద్యోగాలు తెచ్చుకుంటున్నారు. ఇది చాలా సంతోషం.

- తిరువీధుల పోలయ్య, సర్పంచి



అమెరికాలో టీచర్‌గా చేస్తున్నా

మా ఊరి హైస్కూల్లో పది తరగతి వరకు చదువుకుని, బయట ప్రభుత్వ సంస్థల్లోనే చదువు పూర్తి చేశా. అనంతరం అమెరికాకు వెళ్లి టీచర్‌గానే కొనసాగుతున్నా. మా ఊరికి హైస్కూల్ గుండెకాయలాంటిది. నాలాగా ఎందరికో ఓనమాలు నేర్పి ఉద్యోగులుగా తీర్చిదిద్దింది.

- పముజుల పద్మ



ఇంతమంది ఉద్యోగులు ఏ ఊళ్లో లేరు

ఓ గ్రామంలో ఇంతమంది ఉద్యోగులు బహుశా ఎక్కడా ఉండరేమో. ఈ విషయాన్ని మేము బయట ఎక్కడైనా చెప్పుకోవాలన్న ఎంతో గర్వంగా ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగాలు పొందడానికి మా ఊర్లో పోటీ పడతారు.

- తాళ్ల శ్రీనివాసులు, ప్రభుత్వ టీచర్



పెద్ద వాళ్ల కృషే జీవితాలను మార్చింది

అప్పట్లో గ్రామానికి చదువు ఉండాలని, హైస్కూల్ తీసుకువచ్చారు. పైగా వాణిశ్రీ లాంటి సినీనటి స్వయంగా ఆర్థిక చేయూతనివ్వడం మాలాంటి ఉద్యోగుల జీవితాలకు జీవం పోసింది. అప్పుడు పెద్దోళ్ల కృషి చేయకపోతే చదువుకు అనేది ఉండేది కాదు.

- చప్పరం వెంకటేష్, సచివాలయ ఉద్యోగి

సౌత్ మోపూరులో 1967వ సంవత్సరంలో ప్రముఖ సినీ నటి వాణిశ్రీ ఆర్థిక సాయంతో గ్రామం నడిబోడ్డున జడ్పీ హైస్కూల్‌ను ఏర్పాటు చేశారు. 2008లో ప్రభుత్వ జూనియర్ కళాశాలను స్థాపించారు. ఎందరికో ఇవి అక్షరజ్ఞానం ఇచ్చాయి. ఈ రెండు విద్యా సంస్థల్లో చదివినవారు 80 మంది వరకు రెవెన్యూ, పోలీసు, వైద్యం, విద్య, ఆర్టీసీ, సచివాలయాలు, అంగన్‌వాడీ శాఖల్లో అధికారులు, ఉద్యోగులుగా పని చేస్తున్నారు. మరో 30 మంది వరకు విదేశాలలో ఉద్యోగులుగా కొనసాగుతున్నారు. 60 మంది ప్రముఖ నగరాల్లో సాఫ్ట్‌వేర్ రంగంలో ఉపాధి పొందుతున్నారు. ఇక ప్రైవేట్ సంస్థల్లో వంద మందికి పైగానే వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. విదేశాల్లోనూ ఒకే గ్రామం నుంచి ఏకంగా 30 మంది వరకు ఉద్యోగాలు పొందడం విశేషం. 1981-82లో పది పరీక్షల్లో నూటికి నూరుశాతం ఉతీర్ణత సాధించి అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రశంసలు అందుకున్న గ్రామం ఇది.

● వ్యవసాయ, చేనేత రంగాల్లో ఖ్యాతి

జిల్లాలో వ్యవ సాయ, చేనేత రంగాల్లో ఖ్యాతి గడిచించిన ఈ గ్రామంలో రైతు, రైతుకూలీలు, కౌలురైతులు, నేత కార్మికులు ఎక్కువగా ఉన్నారు. 11 గ్రామాలకు విద్యా వనరులు కలిగిన ఈ ఊరు రవాణా సౌకర్యంలోనూ అనుకూలమైంది. ముప్పాతికశాతం మంది ఇక్కడ చదువులకు ప్రాధాన్యం ఇస్తుండగా, అతి తక్కువమంది మాత్రమే బయట ప్రాంతాలకు వెళ్తుంటారు. ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న పలువురు గ్రామస్థులు తమ పొలాల్లో పనులు చేసుకుంటుండటం ఇక్కడి ప్రత్యేకత.

- నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి)



● విద్యకు జీవం పోసిన వాణిశ్రీ

ఈ గ్రామంతో సినీ నటి వాణిశ్రీకి ఎలాంటి సంబంధం లేకపోయినా గ్రామస్థుల విజ్ఞప్తిని, చదువుకు చేయూతనివ్వాలన్న సంకల్పంతో హైస్కూల్‌ను ఏర్పాటు చేశారు. ఆమె చెన్నైలో ఉన్నా నెల్లూరు నుంచి ఆమెను కలిసేందుకు ఎవరొచ్చినా సౌత్‌మోపూరులోని తన పేరున ఉన్న హైస్కూల్ బాగోగులు అడగటం ఆమెకు అలవాటుగా మారింది. ఇటీవల మండలంలోని కాకుపల్లికి వచ్చిన సందర్భంగా ఆమె హైస్కూల్ ఏర్పాటు గురించి భావోద్వేగంతో మాట్లాడారు.

సీఆర్ఎఫ్ రోడ్లు రద్దు

(5వ పేజీ తరువాయి)

మూడు రోజుల క్రితం నెల్లూరు-మైపాడు రోడ్డు పనులు మొదలుపెట్టడం గమనార్హం. అలాగే గూడూరు-తురిమెర్ల రోడ్డు కూడా దారుణంగా దెబ్బతింది. ఏడాదన్నర క్రితం సుమారు రూ.28 కోట్లతో ఈ రోడ్డుకు టెండర్లు పూర్తి చేశారు. నాడు 'ఆంధ్రజ్యోతి' కథనాలతో కాంట్రాక్టర్ల రింగ్ ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో ఈ వర్కు ఏకంగా 18 శాతానికి పైగా లెస్‌కు వెళ్లడం విశేషం. రెండేళ్లలో పూర్తి కావలసిన ఈ రోడ్డు పనులు ఇప్పటికి సుమారు పదిహేను శాతం జరిగినట్లు అధికారిక వర్గాలు చెబుతున్నాయి. భారీ లెస్ కావడంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్ ఆసక్తి చూపడం లేదని చెప్పుకుంటున్నారు. అయితే నెల్లూరు-మైపాడు రోడ్డు, గూడూరు-తురిమెర్ల రోడ్లు రెండింటినీ ఒకే కాంట్రాక్టర్ దక్కించుకోవడం గమనార్హం.

● బిల్లుల సమస్యతో బ్రేకులు

నెల్లూరు - పొదలకూరు - సైదాపురం (ఎన్‌పీఎస్) రోడ్డుకు, కలిగిరి-ఓబులేటివారి పాలెం రోడ్లకు కూడా ఏడాదిక్రితం టెండర్లు పూర్తి చేశారు. కీలకమైన ఈ రోడ్లను విస్తరించి అభివృద్ధి చేయాల్సి ఉంది. నిబంధనల ప్రకారం రెండేళ్లలో ఈ రోడ్లు పూర్తి కావాల్సి ఉండగా, ఇప్పటికి 25 శాతం కూడా పూర్తి కాలేదు. ఈ రెండు రోడ్లలో కాంట్రాక్టర్లు కొంత మేర మాత్రమే పనులు చేశారు. ఆ తర్వాత పనులు నిలిపేశారు. వీరికి ఇతర వర్కుల్లో ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతోనే ఇక్కడ పనులు చేయలేదని ఆర్ అండ్‌బీ వర్గాలు చెప్పుకుంటున్నాయి. అయితే వీరిచేత పనులు చేయించడంలో ఆర్‌అండ్‌బీ అధికారులు విఫలమయ్యారు. తీరా 25 శాతం లోపు పనులు జరిగిన వర్కులు రద్దు చేయాలని ఉత్తర్వులు వచ్చాక హడావుడి చేయడం ప్రారంభించారు. ఎలాగైనా 25 శాతం పనులు జరిగినట్లు చూపించాలని ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ ఇప్పటికిప్పుడు అంత పనులు చేయడం సాధ్యం కాకపోతుండడంతో తలలు పట్టుకుంటున్నారు. పనులు పూర్తికాకుండానే 25 శాతం జరిగినట్లు రిపోర్టు పంపాలని కొందరు కాంట్రాక్టర్లు కూడా అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాకనే ఈ రోడ్ల స్టేటస్ మొత్తాన్ని ఇదే అధికారులు ప్రభుత్వానికి పంపారు. అటువంటిది ఈ లోపు 25 శాతం పనులు పూర్తయ్యాయని నివేదిక ఇస్తే తాము ఇరుక్కుంటామని కొందరు భయపడుతున్నారు. రాజకీయ నేతల జోక్యమో ? లేక అధికారుల నిర్లక్ష్యమో.. ఏదేమైనా గానీ ఇప్పుడు సుమారు రూ.120 కోట్ల పనులు రద్దయ్యే ప్రమాదం కనిపిస్తోంది. ఇది జిల్లా ప్రజలకు తీరని నష్టాన్ని మిగులుస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

● పనుల రద్దు వాస్తవమే..

ఈ వ్యవహారంపై ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ గంగాధరను వివరణ కోరగా ప్రారంభం కాని సీఆర్ఎఫ్ పనుల రద్దుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన మాట వాస్తవమేనని చెప్పారు. అయితే ఈ జాబితాలోకి వచ్చే రోడ్ల వివరాలు ఇంకా సిద్ధం చేయలేదని ఆయన పేర్కొన్నారు.

టపాసుల దుకాణాల కోసం పోటీ

- ● నెల్లూరులో ఇబ్బడిముబ్బడిగా దరఖాస్తులు
- ● డిప్ తీసి కేటాయింపు.. వ్యాపారుల ఆందోళన
- ● ఉద్రిక్తత.. పోలీసుల రంగ ప్రవేశం

నెల్లూరు వెంకటేశ్వరపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో టపాసుల దుకాణాల కేటాయింపు వ్యాపారుల ఆందోళనకు దారితీసింది. ప్రతిఏటా నగరంలో వీఆర్‌సీ, వైఎంసీ, ఆర్ఎస్ఆర్ స్కూలు మైదానాల్లో దుకాణాలను ఏర్పాటు చేస్తారు. ఈసారి వీటితోపాటు సర్వోదయ, ఎస్‌వీజీఎస్ కళాశాల మైదానాల్లో కూడా దుకాణాల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఎక్కువ మంది వ్యాపారులు వీఆర్‌సీ మైదానంలో దుకాణాల ఏర్పాటుకు పోటీ పడ్డారు. ఇక్కడ 46 దుకాణాలు ఏర్పాటుకు అవకాశం ఉండగా, 66 మంది దరఖాస్తు చేశారు. ఇక్కడే



ఆర్డీవో సమక్షంలో లాటరీ తీస్తున్న టపాసుల దుకాణదారులు



ఆందోళన చేస్తున్న వ్యాపారులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసులు

చిక్కు వచ్చింది. ఆర్డీవో అనూష 66 మందికి డిప్ తీసి దుకాణాలు కేటాయిస్తామన్నారు. అయితే కొత్తగా వచ్చిన వ్యాపారులకు ఎలా డిప్ తీసి కేటాయిస్తారని పాత వ్యాపారులు ఆందోళన చేపట్టారు. దీంతో ఆర్డీవో కార్యాలయం వద్ద కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకొన్న సంతపేట సీఐ శ్రీనివాసులు, సిబ్బందితో అక్కడికి వచ్చారు. వ్యాపారులతో మాట్లాడి ఆందోళనను విరమింపచేశారు. ఎట్టకేలకు పాత వ్యాపారులకే డిప్ తీసి దుకాణాలు కేటాయించారు. మిగతా వారికి ఎస్‌వీజీఎస్ కళాశాల మైదానంలో కేటాయిస్తామన్నారు. కాగా మిగతా నాలుగు ప్రాంతాల్లో దుకాణాల కేటాయింపు ప్రశాంతంగా సాగింది. నెల్లూరు నగరంలోని వీఆర్‌సీలో 46, ఆర్ఎస్ఆర్‌లో 28, వైఎంసీఏ లో 19, ఎస్‌వీజీఎస్‌లో 20, సర్వోదయలో 10 దుకాణాలతో కలసి మొత్తం 123 దుకాణాలను ఏర్పాటు చేయనున్నారు.

అడిగేదెవరు..? అంతా మా ఇష్టం !

(5వ పేజీ తరువాయి)

ఇదెక్కడి న్యాయం..? కేటాయించిన ప్రదేశాల్లో మాత్రమేగా దుకాణాలు ఏర్పాటు చేయాలి.. ఇలా ఏర్పాటు చేస్తే మేం నష్టపోతాం కదా..? అంటూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా నేతల ఒత్తిళ్లతో అలాంటి దుకాణాల జోలికి ఎవరూ వెళ్లలేదు. కాగా ఎవరికి కేటాయించిన ప్రాంతాల్లో వారే దుకాణాలు ఏర్పాటు చేయాలి. నిబంధనలు అతిక్రమించి, ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవు.

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం

వలేటివారిపాలె, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వస్తున్న లారీ మోటారు బైకును ఢీకొనడంతో యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందిన సంఘటన సోమవారం రాత్రి 9 గంటల సమయంలో వలేటివారిపాలెం-చుండి గ్రామాల మధ్య జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఈ వివరాలు ఇలా ఉన్నాయి. అయ్యవారిపల్లెకు చెందిన బచ్చు పృథ్వీరాజ్ (30) వలేటివారిపాలెం నుండి మోటారుబైకుపై అయ్యవారిపల్లె వెళుతుండగా పామూరు నుండి కందుకూరు వైపు వెళ్తున్న లారీ ఢీనడంతో తలకు తీవ్ర గాయం కావడంతో రక్తస్రావం అవడంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, భార్యపిల్లలు బోరున విలపిస్తున్నారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు. సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్‌ఐ మరిదినాయుడు మృదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలి

● మెల్‌బోర్న్ యూనివర్సిటీ సీఈవో రాఖెల్‌ష్రాఫ్

నెల్లూరు(విద్య), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : నేటి పోటీ ప్రపంచంలో యువత ఉద్యోగాలు పొందే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని మెల్‌బోర్న్ యూనివర్సిటీ సీఈవో రాఖెల్‌ష్రాఫ్ తెలిపారు. నగరంలోని డీకే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం వికసిత భారత్, స్వర్ణాంధ్ర-2047 సాధనలో భాగంగా మెల్‌బోర్న్ కెరీర్ ఎడ్యుకేషన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు తాము నేర్చుకుంటున్న విద్య ఉద్యోగం సాధించడానికే కాకుండా సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడాలన్నారు. తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవడంతో పాటు లక్ష్యాన్ని నిర్ధారించుకుని దాన్ని సాధించేందుకు కృషి చేయాలన్నారు. భారతదేశంలో ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని, విద్యార్థులు దీన్ని సక్రమమైన రీతిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవకాశాలను అందిపుచ్చుకుంటేనే ఉన్నతంగా ఎదగవచ్చని, ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించకుండా విద్యా విధానాలను అనుసరించాలని తెలిపారు. అనంతరం కళాశాలలో ఫొటో ఎగ్జిబిషన్‌ను, హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులతో, సిబ్బందితో పలు విషయాలను చర్చించారు. కార్యక్రమంలో ఆర్‌ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు, డీవీఈవో కే మధుబాబు, కేఏసీ ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి, ఆత్మకూరు ప్రిన్సిపాల్ వాణిశ్రీ, కెరీర్ గైడెన్స్ ట్రైనర్ అనూష, షేక్.గౌస్‌బాషా, సురేష్, ప్రతిమా ప్రియదర్శిని, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినులు, అధ్యాపకులతో మాట్లాడుతున్న రాఖెల్‌ష్రాఫ్

పదం పాడుతూ.. పాదాలు కలుపుతూ.. ఒకే రీతిన ఆడుతూ.. కోలాటం ప్రదర్శిస్తున్నారు సంగం గ్రామానికి చెందిన మహిళలు. ఇటు ఆరోగ్యం.. ఆనందం... అటు ఆధ్యాత్మికసేవలో తరిస్తున్నారు. వివిధ ఆలయాల్లోనూ, పుణ్యక్షేత్రాల్లోనూ భక్తితో ప్రదర్శనలు ఇస్తున్నారు. పండుగలు, ఇతర వేడుకల్లోనూ తమ ప్రత్యేకతను చాటుతున్నారు. నగర సంకీర్తనలో తమ గానాలాపనతో భాగస్వాములవుతున్నారు.



కోలాటంతో ఆరోగ్యం, ఆధ్యాత్మిక సేవ

పదం పాడుతూ పాదం కదుపుతూ!

జానపద కళలపై ఉన్న ఆసక్తితో గ్రామానికి చెందిన పలువురు మహిళలు భజన మండలిని స్థాపించారు. ప్రత్యేకంగా కోలాటంలో శిక్షణ తీసుకున్నారు. శ్రీవేంకటేశ్వర కోలాట భజన మండలి పేరుతో 40మంది సభ్యులు ఎనిమిదేళ్ల నుంచి కోలాట ప్రదర్శనలు ఇస్తున్నారు.పండుగల్లోనే కాక శ్రావణ, కార్తీకమాసాల్లో ఆలయాల్లో జరిగే ఉత్సవాల్లో కోలాటం ఆడుతున్నారు. ఇటు ఆరోగ్యం.. వినోదంతోపాటు అటు ఆధ్యాత్మికసేవ చేస్తూ ప్రజల మన్నలు పొందుతున్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని మరికొంతమంది పెద్దలు వారిళ్లలో ఉండే చిన్నారులకు కోలాటంలో శిక్షణ ఇప్పిస్తున్నారు. పట్టణంలో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. బృందం సభ్యుల్లోనే కొందరు వాయిద్య బృందాన్ని సమన్వయం చేసుకుంటూ పాటలు, కీర్తనలు కూడా చక్కగా అలపిస్తున్నారు.

- సంగం (ఆంధ్రజ్యోతి)

కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతోనే...



కోలాటం నేర్చుకోవడంలో కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతో ఉంది. ప్రసిద్ధ ఆలయాల్లో కోలాట ప్రదర్శన ద్వారా స్వామి వారిని అతిదగ్గరగా వెళ్లి దర్శించుకునే అవకాశం లభిస్తున్నది. ఉచితంగా ఆలయాల్లో ప్రదర్శనలిస్తున్నాం. కోలాటం పురాతన కళ అయినందున, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉంది.

- సుప్రజ, సంగం

వయసుతో పనిలేదు



నేను కోలాటం నేర్చుకోవడానికి మూడు నెలలు పట్టింది. కోలాటం ఆడుతుంటే ఆధ్యాత్మికతతోపాటు మనస్సుకు చాలా ఉల్లాసంగా ఉంటుంది. బృందాలుగా ఏర్పడి కోలాటం ఆడటం వల్ల సమైక్యత కూడా పెరుగు తుంది. ఈ కళపై ఆసక్తి ఉంటే నేర్చుకోవడానికి వయసుతో సంబంధం లేదు. మా బృందంలో అన్ని వయస్సుల వారు ఉన్నారు.

- పెంచలలక్ష్మి, సంగం

శిథిలావస్థలో ఎస్సీ బాలుర హాస్టల్

● భవనం పెచ్చులూడి పడుతున్న వైనం
● భయాందోళనలో విద్యార్థులు

ఉలవపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహం శిథిలావస్థకు చేరింది. 40ఏళ్ల కిందట నిర్మించిన భవనం కావడంతో భారీ వర్షాలకు భవనం స్లాబ్‌లోకి నీరు చేరి పెచ్చులూడి ఇనుప ఊచలు బయటపడుతున్నాయి. ఈ సమస్యతో మొత్తం 8గదుల్లో 5గదులు మూతపడ్డాయి. మిగిలిన గదుల్లో రెండు గదులు విద్యార్థుల వసతికి ఉపయోగించగా మరొకటి స్టోర్ కమ్ ఆఫీస్ రూమ్‌గా వాడుకుంటున్నారు. విద్యార్థులు ఉంటున్న గదులు కూడా స్లాబ్ పెచ్చులూడి ఎవరి మీద పడతాయో అని భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతానికి వసతి గృహంలో ఈ ఏడాది 35 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ సమస్యతో చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ హాస్టల్‌లో చేర్పేందుకు వెనకడుగు వేస్తున్నారు. ఆరేళ్లుగా ఎస్సీ బాలుర వసతి గృహం పరిస్థితిని ఉన్నతాధికారులకు చెబుతున్నా వారు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదు. కనీసం ప్రత్యామ్నాయ చర్యలు కూడా తీసుకోవడం లేదు. ఈ ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఎస్సీ బాలుర వసతి గృహం

నేడు గంధ మహోత్సవం

ఉదయగిరి రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోనకాలువ సమీపంలోని హజరత్ సయ్యదినా మహబూబ్‌సుభానీ గంధమహోత్సవం మంగళవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

ఉదయగిరి రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

ముమ్మరంగా వ్యవసాయ పనులు

వలేటివారిపాలెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):మండలంలో వారంరోజులుగా వ్యవసాయ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఎక్కువగా రైతులు పొగాకు, మిర్చి, వరినాట్లు వేస్తున్నారు. మంచి అదునులో వర్షం కురిసిందని పొగాకు, మిర్చి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

1న రాళ్లపాడు ఆయకట్టు రైతుల సమావేశం

లింగసముద్రం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టు ఆయకట్టు రైతుల సమావేశం శుక్రవారం ఉదయం 10గంటలకు ప్రాజెక్టు అతిథిగృహం వద్ద నిర్వహించనున్నట్లు ప్రాజెక్టు ఏఈ చంద్రమౌళి సోమవారం ప్రకటనలో తెలిపారు.

'ఎస్సీ వర్గీకరణతో అన్యాయం'

అల్లూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాల్మన్‌రాజు సోమవారం సంఘం సభ్యులతో కలిసి నార్తుమోపూరు దళితవాడలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్సీలను బలహీనులను చేసేందుకు ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని తీసుకొచ్చారని ఆరోపించారు. కార్యక్రమంలో ముసలి నరేంద్ర, పంగులూరు సుధాకర్, దానం మాల్యాద్రి, గంగపట్నం సతీష్, ఆశీర్వాదం ఉన్నారు.

పోలీసుల విధులపై అవగాహన

కొండాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా మండలంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులకు సోమవారం పోలీసుల విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. స్థానిక స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఖాదర్‌బాషా, పోలీసులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంపై అవగాహన

బిట్రగుంట, అక్టోబరు 28: (ఆంధ్రజ్యోతి): భారతపుత్ర చైర్మన్ కూరపాటి శ్యాంధన్ సోమవారం బోగోలు రాజావీధి సాయి మందిర ఆవరణలో ఆయుర్వేద మందుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా హ్యూమెన్‌రైట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సునీల్, జాయింట్ సెక్రెటరీ బత్తుల రవిచంద్ర హ్యూమెన్ రైట్స్ సభ్యులతో పాటు శ్రీదశ ఆయుష్ పీఠం నిర్వాహకులు శాంతిరాజ్ ఉన్నారు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి

బిట్రగుంట, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం నేతలు, కార్యకర్తలు సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు తెలిపారు. ఈ విషయంపై సోమవారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో చిలకపాటి వెంకటేశ్వర్లు, కోడూరు వేంకటేశ్వర్లురెడ్డి, కాండ్ర రఘురామ్ నాయుడు, యర్రం వెంకటేశ్వర్లురెడ్డి, పిన్ని బోయిన సుధాకర్, దేవరాల తిరుపతి, పుట్టా సుబ్బారావు, ఎన్.భాస్కర్, పార్వతి, నాగరాజు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కార్మికుల ధర్నా

కావలి టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్మికులు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పసుపులేటి పెంచులయ్య, కృష్ణ మోహన్, మధుసూదన్ రావు, నాయకులు తురకా శీనయ్యబాబు, బిడదల మహేష్, పోలయ్య, రమేష్ పాల్గొన్నారు.

ఆత్మకూరు,(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి కె పెంచలనరసయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శివప్రసాద్ మాట్లాడారు. ఆత్మకూరు మున్సిపాల్టీలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ డివిజన్ కార్యదర్శి ఆత్మకూరు నాగయ్య, మున్సిపల్ యూనియన్ నాయకులు గురవయ్య, రామయ్య, శీనయ్య పాల్గొన్నారు.



కావలి: ధర్నా చేస్తున్న కార్మికులు

ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థుల ఆందోళన

కావలిటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు సోమవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం వద్ద బైఠాయించి సమస్యలు పరిష్కారించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి హర్ష, పట్టణ కార్యదర్శి ఉదయ్‌కుమార్‌లు మాట్లాడారు. పెండింగ్‌లోని కోట్ల రూపాయల విద్యాదీవెన, వసతిదీవెన నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, తల్లికి వందనం, పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై స్పష్టత ఇవ్వాలని, జీవో నెంబర్ 77 రద్దు చేసి పీజీ విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింప జేయాలన్నారు. యూనివర్సిటీల అధ్యాపకులు పోస్టులన్నీ భర్తీ, సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జీవన్, మోక్షిత్‌సాయి, లోకేష్, భాను, సన్నీ, నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం వద్ద బైఠాయించిన విద్యార్థులు

క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం

కావలి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. స్థానిక పుల్లారెడ్డినగర్‌లో సోమవారం టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో నేతలు నాయకులు తిరువీది ప్రసాద్, ఉప్పాల వెంకట్రావు, దేవరకొండ శ్రీను, బోగ్యం క్రిషోర్‌కుమార్‌రెడ్డి, కేతిరెడ్డి విష్ణుతేజరెడ్డి జనసేన పట్టణ అధ్యక్షుడు పొబ్బా సాయివిఠల్ పాల్గొన్నారు.

కావలి రూరల్, అక్టోబరు 28: ముందర పొట్టెమ్మ తల్లి ఆసీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి తులిసానేజ అన్నగారిపాలెంలో వెలసిన ముందర పొట్టెమ్మ, గంగమ్మ తల్లి ఆలయంలో సోమవారం నిర్వహించిన కుంబాభిషేకంలో ఆయన పాల్గొన్నారు. అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డీఎస్పీ శ్రీధర్‌తో కలసి ఆలయ ప్రాగణంలో ఏర్పాటు చేసిన అన్నసంతర్పణలో పాల్గొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆవుల రామక్రిష్ణ, ప్రధాన కార్యదర్శి ఉప్పాల వెంకట్రావ్ పాల్గొన్నారు.



క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

అనుమతుల్లేకుండా బాణసంచా విక్రయించరాదు

వలేటివారిపాలెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా చర్యలు తప్పవని డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. కాకుటూరు సమీపంలోని లావణ్య టపాసుల నిల్వ కేంద్రాన్ని సోమవారం ఆయన గుడ్లూరు సీఐతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. గతంలో ఇతర ప్రదేశాలలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు. భద్రతా ప్రమాణాలు పాటిస్తూ దుకాణాలు ఏర్పాటు చేసుకొని విక్ర యించాలన్నారు. వారి వెంట వలేటివారిపాలెం ఎస్‌ఐ మరిదినాయుడు, సిబ్బంది ఉన్నారు.

● **ఉత్తర్వుల మేరకు అమ్మకాలు**

కావలి రూరల్,(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు నల్లమందు అమ్మకాలు చేపట్టాలని కావలి రూరల్ సీఐ రాజేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన కొత్తపల్లిలో ఎస్‌కె.భాషకు చెందిన టపాసుల గోదామును తనిఖీ చేశారు. అనంతరం పోలీస్ అమరవీరులదినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఎస్పీ ఆదేశాను సారం కొత్తపల్లి గ్లోబల్ స్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

● **నిర్వాహకులతో సమావేశం**

సంగం, (ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జి తహసీల్దారు సంధ్య తహసీల్దారు కార్యాలయంలో టపాసుల దుకాణాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. స్థానిక ఎస్‌ఐ రాజేష్ టపాసుల దుకాణం లైసెన్సు పొందిన నిర్వాహకులతో స్టేషన్‌లో మాట్లాడి జాగ్రత్తలు తెలియజేశారు.

● **దుకాణాల పరిశీలన**

ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి): తహసీల్దారు సుభద్ర, సీఐ వెంకటరావులు పట్టణంలోని బాణసంచా దుకాణాలు తనిఖీ చేసి నిల్వలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, ఏ.శ్రీనివాసులు పాల్గొన్నారు.

● **గోదాము తనిఖీ**

బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): కప్పరాళ్లతిప్ప సమీపంలోని టపాసుల గోడౌను సోమవారం కావలి డీఎస్పీ శ్రీధర్ తనిఖీ చేశారు. ఆయన వెంట పాటు స్థానిక ఎస్సై బోజ్యా, సిబ్బంది తదితరులు ఉన్నారు.



వలేటివారిపాలెం: నిల్వ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం

అలవి వలలతో జీవనోపాధి దెబ్బ

అనంతసాగరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయంలో నిషేధిత అలవి వలలతో వేటసాగిస్తుండడంతో తమ జీవనోపాధి దెబ్బతింటోందని స్థానిక గిరిజన మహిళలు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి తెలిపారు. సోమవారం అనంతసాగరంలో జరిగిన ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమంలో పాల్గొన్న మంత్రిని కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. జలాశయంలో అక్రమ చేపల వేట జరుగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం విలేకర్ల ముందు తమ ఆవేదన వెళ్లగక్కారు.

ఎమ్మార్పీకే మద్యం విక్రయాలు

● ఎక్సైజ్ సీఐ లక్ష్మణస్వామి



ఉదయగిరి రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నూతన మద్యం పాలసీలో ఏర్పాటుచేసిన ప్రైవేటు మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించాలని ఉదయగిరి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ లక్ష్మణస్వామి పేర్కొన్నారు. బెల్టుషాపుల ఏర్పాటు, కల్తీ మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

? : ఎన్ని మద్యం షాపులున్నాయి.

!: ఉదయగిరి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సర్కిల్ పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి, మర్రిపాడు, దుత్తలూరు మండలాల్లో 12 ప్రైవేటు మద్యం షాపులు ఉన్నాయి.

?: దుకాణాల వద్ద మద్యం తాగవచ్చా

!: మద్యం దుకాణాల వద్ద తాగించకూడదు. అలా తాగిస్తే చర్యలు చేపడతాం. ప్రభుత్వం నుంచి పర్మినెంట్ దుకాణాలకు అనుమతి పొందితే అవకాశం ఉంటుంది.

?: బెల్టుషాపుల నిర్మూలనకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు.

!: బెల్టుషాపులు ఏర్పాటు చేసినా, మద్యం కల్తీ చేసినా చర్యలు తప్పవు. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ దుకాణాలు నిర్వహించాలి. సమయపాలన పాటించాలి.

మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

సంగం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని బుధవారం జరిగే మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఎస్‌ఐ రాజేష్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. విద్యార్థులు, యువకులు, ప్రజలు రక్తదానం చేయాలని ఆయన కోరారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

సంగం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక పొదలకూరు శాఖ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై సోమవారం ప్రచారం చేశారు. తరుణవాయి, ఉడ్‌హౌస్‌పేట, తలుపూరుపాడు, సిద్దీపురం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పొదలకూరు కమిటీ సభ్యులు పెంచల నరసయ్య, క్రిష్ణయ్య, కొండయ్య, శేషాద్రి పాల్గొన్నారు.

దుర్గం అభివృద్ధికి కృషి

ఉదయగిరి రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్నలు పేర్కొన్నారు. సోమవారం ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి దుర్గం ప్రాంతంలో చారిత్రాత్మక కట్టడాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దుర్గాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారన్నారు. దీంతో ఉదయగిరి దుర్గానికి మహర్దశ పట్టనుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ మదన్‌కుమార్, ఏఈ మస్తాన్, టీడీపీ నాయకులు ఓబుల రెడ్డి, నారాయణరెడ్డి, గంగాధర్, ప్రసాద్, వెంగళరావు, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వెలుగొండ పనులు పూర్తిచేయాలి

ఉదయగిరి రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతాలకు జీవనాడి లాంటి వెలుగొండ ప్రాజెక్టు పనులు మందకొడిగా సాగుతున్నాయని, త్వరితగతిన పూర్తిచేయాలని వెలుగొండ సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ శ్యాంప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల వెలుగొండ సాధనసమితి ఆధ్వర్యంలో కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాల నాయకులతో వెలుగొండ ప్రాజెక్టు సొరంగ నిర్మాణ పనులను పరిశీలించామన్నారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని ఆశా భావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సాధన సమితి నాయకులు దస్తగిరిఅహమ్మద్, కాకు వెంకటయ్య, కాకు విజయమ్మ, సుజాత, ఫడ్స్ రమణయ్య, మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్య తీసుకోవాలి

కలువాయి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉయ్యాలపల్లిలో సోమవారం రీసర్వేపై నిర్వహించిన గ్రామసభకు తనకు కనీసం అధికారులు సమాచారం ఇవ్వలేదని గ్రామ సర్పంచు పుల్లే పరదేశి ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్ విచారించి ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

భూ అక్రమణపై ఫిర్యాదు

ఉదయగిరి రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జీ.చెర్లోపల్లిలో రంగమ్మ పేరంటాలమ్మ గుడి సమీపంలో భూమిని కొందరు అక్రమంచి చదును చేసి విక్రయించేందుకు చర్యలు చేపడుతున్నారని గ్రామస్థులు సోమవారం తహసీల్దారు సుభద్రకు ఫిర్యాదు చేశారు. తహసీల్దారు పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

గ్యాస్ సబ్సిడీని జమ చేయొద్దు

కావలి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉచిత గ్యాస్ సబ్సిడీలను లబ్ధిదారుల బ్యాంకుల ఖాతాల్లో జమచేయవద్దని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సమితి ఆధ్వర్యంలో సోమవారం కావలి ఆర్డీవో ఎం.వంశీకృష్ణకు కలిసి వినతి పత్రం అందజేశారు.

అధిక ధరలకు విత్తనాలు అమ్మితే చర్యలు

కందుకూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : డీలర్లు అధిక ధరలకు విత్తనాలు అమ్మితే కఠినచర్యలు తీసుకుంటామని, విత్తనం కొనుగోలు చేసిన ప్రతి రైతుకు వారి అడిగినా అడగకున్నా విధిగా రసీదు ఇవ్వాలని కందుకూరు ఏడీఏ పి.అనసూయ సూచించారు. సోమవారం కందుకూరు లోని విత్తన దుకాణాలను ఆమె ఏఓ రాముతో కలిసి సందర్శించి డీలర్లకు సూచనలిచ్చారు. విత్తన నిల్వ పట్టికలో విత్తన రకం, స్టాకు మోతాదు, ధరను ప్రదర్శించాలని, ధృవీకరించిన విత్తన కంపెనీల విత్తనాన్ని మాత్రమే తీసుకోవాలన్నారు. నాసిరకం విత్తనాలు అమ్మినట్లు ఫిర్యాదులు వస్తే లైసెన్సు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుతం వరి, మినుము, నువ్వుల విత్తనాలు విత్తనాల డీలర్ల వద్ద సిద్ధంగా ఉన్నట్లు ఆమె తెలిపారు.

కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు, ఎరువుల అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయశాఖ అధికారి లలిత తెలిపారు. సోమవారం ఆమె పట్టణంలోని ఇందిరా సీడ్స్ దుకాణాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. వ్యవసాయ సీజన్ మొదలు కావటంతో రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తున్నారని ప్రతి విత్తన దుకాణాన్ని నిత్యం తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం బిల్ బుక్‌లు తనిఖీ చేసి సందేహం ఉన్న వరి విత్తనాలు నాణ్యతా ప్రమాణాల పరిశీలనకు పంపించారు.

ఏఎస్ పేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విత్తనాలు, ఎరువులను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని నెల్లూరు సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన ఏఎస్ పేట మండలంలోని హసనపురం, ఏఎస్ పేట ఎరువుల దుకాణలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి రజిని, ఆత్మకూరు వ్యవసాయ అధికారి కిశోర్, తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు: విత్తన దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏడీఏ అనసూయ, ఏవో రాము

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయండి

కలిగిరి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పొగాకు సాగు చేస్తున్న రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు మొగ్గు చూపాలని పొగాకు బోర్డు రీజనల్ మేనేజరు తులసి తెలిపారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం జరిగిన రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆర్ఎం మాట్లాడారు. ఈ ఏడాది ఇతర దేశాల్లో పొగాకు సాగు పెరిగిన దృష్ట్యా రైతులు పెసర, కంది, మినుము వంటి పంటల సాగు చేస్తే రైతు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి వీలు ఉంటుందన్నారు. అలాగే నారు మడులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సీనియర్ శాస్త్రవేత్తలు కెవీకె ప్రసాద్‌బాబు తెలియజేశారు. కార్యక్రమంలో పొగాకుబోర్డు వేలం నిర్వహణాధికారి మహేష్, ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్, ఉద్యానశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మర్రిపాడు, (ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులు ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యత నివ్వాలని రీజనల్ మేనేజరు తులసి, వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. డీసీపల్లి పొగాకు బోర్డు పరిధిలోని పొగాకు రైతులతో సోమవారం బోర్డులో ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా పొగాకు పంట పెరుగుతుందని, ప్రతీ రైతు అనుమతి మేర మాత్రమే పొగాకును సాగు చేయాలన్నారు. మినుము, శనగ, కంది, పెసర వంటి పంటలపై దృష్టి పెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ప్రసాద్‌బాబు, వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారి రామ్మోహన్ రైతులు పాల్గొన్నారు.

భూ బాధితులకు న్యాయం చేయండి

కందుకూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో 167బీ జాతీయ రహదారి పనుల్లో భూమి కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లింపులో న్యాయం చేయాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం సాయంత్రం ప్రకాశం జిల్లా కలెక్టరు తమీమ్ అన్సారియాను కలిశారు. ఎకరానికి రూ.25 లక్షలు మాత్రమే పరిహారంగా అందించారని, కానీ అక్కడ బహిరంగ మార్కెట్లో భూమి విలువ రూ.75లక్షలు ఉన్నదని కలెక్టరుకు వివరించారు.

సబ్ కలెక్టరుకు రైతుల వినతి: ఈ సమస్యపై సోమవారం బాధిత రైతులు సబ్ కలెక్టరు శ్రీపూజను కలిసి వినతిపత్రం అందజేశారు. బహిరంగ మార్కెట్లో రూ.2కోట్లు ఎకరం పలుకుతున్న భూములను జాతీయ రహదారి కోసం సేకరిస్తూ కేవలం రూ.25లక్షలు పరిహారం చెల్లిస్తామని చెబుతుండటం దారుణం అన్నారు. ఈ విషయంపై సబ్ కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు.

కందుకూరులో పోలీసుల రక్తదాన శిబిరం

కందుకూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా కందుకూరు సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని వెంగమాంబ ఫంక్షన్‌హాలులో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. రక్తదాన శిబిరంలో యువకులు పెద్దసంఖ్యలో తరలివచ్చి రక్తదానం చేయడం పోలీసుల పట్ల సమాజంలో ఉన్న గౌరవం అర్థమవుతోందన్నారు. 117మంది రక్తదానం చేయగా కావలి రెడ్‌క్రాస్ సొసైటీవారు రక్తం సేకరించారు. కార్యక్రమంలో కందుకూరు డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, సీఐ వెంకటేశ్వరరావు, పట్టణ ఎస్‌ఐ సాంబశివయ్య, రెడ్‌క్రాస్ సబ్ బ్రాంచి చైర్మన్ చెన్నా వెంకటరామాంజనేయులు, సబ్ డివిజన్‌లోని ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, డీఎస్పీ